ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



4 అణాలు
24-9-52


పంచతంత్రం
మిత్రభేదం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
పూర్వమొక్క అడవిలోన
రావి చెట్టు కొమ్మలలో
అడవిజాతి బాతులెన్నో
హాయిగ నివసించేవి
చెట్టుకుదురులోన నొక్క
తీగె పదా పెరుగుతోంది.
బలమగు ఆ తీగె తీరు-చూచిన
ఒక ముదుసలి బాతు
చాలా కళవళ పడినది
"వేటగాడు ఎప్పుడైనా- ఈ తీగె సహా
యంతో-చెట్టుపైకి తేలిగ్గా- పాకి
వచ్చి మననందరి-పట్టుకుపోవచ్చును
గద!- ఇప్పుడె ఈ తీగెను ని-ర్మూలించిన
మేలు కాదె?"
ముసలి బాతు హితవాక్యం
విని మిగతా బాతులన్నీ
పూత్కారం చేసినవి
రోజురోజుకా తీగె
చివరికొమ్మవరకు పెరిగి
బలిష్ఠముగ తయారైంది
ఒకరోజున బాతులన్నీ
ఎక్కడికో పోగా ఒక
ఒక వేటగాడు తీగె నెక్కి
పైకి వచ్చి
వలలు పన్ని
తనదారిని
పోయాడు
సందెవేళ బాతులన్నీ
గుంపులుగా తిరిగివచ్చి
వలలలోన చిక్కాయి!
అన్నిబాతులొక్కసారి
గొల్లున గోలెత్తాయి
"అప్పుడె నామాట వింటె- ఈ దుర్గతి
పట్టేదా?- అయినదానికేడిస్తే- లాభ
మేమి మిత్రులార!- తట్టిన దొక్క
మంచి ఎత్తు!- చెబుతానది చేయుడట్లు"
మరునాడా వేటగాడు
చెట్టునెక్కి చూచుసరికి
బాతులన్నీ వలలోనే
చచ్చినట్లు పడివున్నవి
చచ్చిన ఈ బాతులునా- కెందుకనుచు వేటగాడు
ఒకటొకటే బాతు నెత్తి- కిందికి విసిరేశాడు
బాతులన్నీ కిందపడ్డ- తరువాతను
అన్నికలసి- ఒక్కసారిగా తుర్రున
ఎగిరి పారిపోయినవి!- ఇది చూచిన
వేటగాడు- నెత్తిబాదుకొన్నాడు
అని ఆ కథ వివరించి
ముసలిబాతు క్షణకాలం
జలధిరాజునే విధముగ
పరిభవించుటాయని తా
నాలోచన చేసినది
28

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 45
సంచిక 5
24-9-52

నందన ఆశ్వయుజ శుద్ధ పంచమి బుధవారము



దరియా దౌలత్ శ్రీరంగ పట్నంలోని చిత్రశాల

[ఛాయా చిత్రకారుడు— సినీ ఆర్టర్ శ్రీ ఎ. [illegible]]

విషయానుక్రమణిక

ఇండోర్ ఆలిండియా కాంగ్రెస్ కమిటీ

ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఇండోర్ సమావేశంలో ఆట్టే తర్జనభర్జనలు లేకుండా నియమావళి సవరణలు ఆమోదించబడినాయి. కాంగ్రెస్ శాసనసభల పార్టీలకూ, కాంగ్రెస్ కమిటీలకూ మధ్య సహకారం సాధించడానికి కేంద్ర కాంగ్రెస్ కార్యవర్గం చేసిన ముఖ్యసూచనల్ని అన్నివర్గాలవారూ నిరాక్షేపణగా ఆమోదించినందువల్ల, అభిప్రాయభేదాలకు తావిచ్చే సవరణల్ని కార్యవర్గం ప్రస్తుతానికి ఉపసంహరించుకుంది. పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఆలిండియా కాంగ్రెస్ కమిటీలోనూ, పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ సభ్యులందరికీ, రాష్ట్ర శాసనసభల కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలకూ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలలోనూ, రాష్ట్రశాసనసభల కాంగ్రెస్ పార్టీ సభ్యులందరికీ జిల్లా కాంగ్రెస్ కమిటీలలోనూ వోటులేని అనుబంధ సభ్యత్వం ఏర్పాటు చెయ్యడంతో మంత్రివర్గాలకూ కాంగ్రెస్ కమిటీలకూ మధ్య సహకారం ఎంతవరకూ ఒనగూడుతుందో అనుభవం దృష్ట్యా గమనించవలసిందే. అయితే ప్రస్తుత నిర్ణయంవల్ల ఒక ముఖ్యమైన కొత్త సిద్ధాంతం ఆమోదించబడిందని అన్వయించుకోవాలి.

స్వాతంత్ర్యసిద్ధికి పూర్వం స్వాతంత్ర్యోద్యమం ప్రధానంగా ఎంచి పార్లమెంటరీ కార్యక్రమాల్ని అప్రధానంగా ఎంచిన కాంగ్రెస్, ఈ అయిదేళ్ళలోనూ సంభవించిన మార్పులకు అనుగుణంగా కార్యకలాపాలను మార్చుకోలేక పోయిందనే చెప్పాలి. స్వాతంత్ర్యలాభం అనంతరం కాంగ్రెస్ లోకసేవాసంఘంగా పరిణతి చెందాలని గాంధీజీ ఆశించారు. అంటే పార్లమెంటరీ కార్యకలాపం ప్రధానంగా గలపార్టీ, ఒకటి, ఆ కార్యకలాపంతో నిమిత్తం లేని సంస్థ ఒకటి విడివిడిగా వ్యవహరించాలని గాంధీజీ ఆశయం. కాని కాంగ్రెస్ సంస్థ యావత్తూ పార్లమెంటరీ కార్యక్రమాలలో నిమగ్నం కావడంతో గాంధీజీ ఆశయం నెరవేరక పోగా, శాసనసభలకు ఎన్నికైన కాంగ్రెస్ వాదులకూ తదితరులకూ మధ్య రవరవలు బయలుదేరాయి. పార్లమెంటరీ వ్యవహారాల నిమిత్తం సంస్థయావత్తూ ఒక రాజకీయ పక్షంగా వ్యవహరించడంతో ఇది సహజమే ననిపిస్తుంది. రాజకీయ పక్షంగా వ్యవహరించాలంటే కమిటీలకు పైన పార్ల

(7-వ పేజీ చూడండి)

శాంతి బాంబులు

(ఏ బలహీన దేశంమీద దురాక్రమణ జరిగినా రక్షించటానికి అమెరికా, పశ్చిమ రాజ్యాలు సిద్ధంగా ఉన్నాయి. ఈ సంసిద్ధతవల్లనే మూడవ ప్రపంచయుద్ధం ఇంతవరకూ రాలేదు — మద్రాసులో అమెరికన్ జర్నలిస్టు లూయీఫిషర్.)

ఎక్కడ బెల్లం ఉంటే అక్కడే చీమలు ;
ఎక్కడ నిలవ నీరుంటే అక్కడ దోమలు ;
ఎక్కడ ధర్మగ్లాని జరిగినా అమెరికావారు
అక్కడి కందరికన్నా ముందుగా తయారు.

ప్రపంచం మూలమూలలా శాంతిరక్షణం
చెయ్యటానికే అమెరికా కట్టుకుంది కంకణం
ఈ సంగతి హిరోషిమా, నాగసాకీలతో
ఖచ్చితంగా తేలిపోయింది ఏనాడో.

తదాదిగా తయారుచేస్తున్నారు అమెరికన్లు
శాంతి బాంబులనబడేవి టన్నులపై టన్లు
ఇవి శాంతి పావురాలకంటే చాలా మిరుగు
పైగా మంచి గ్యారంటీ అమెరికన్ సరుకు.

ఈ బాంబులు మామూలు వాటి మల్లేకాదు
వాటికంటే ఇవి అనేక రెట్లెక్కువ ఖరీదు.
ఒక్కొక్కదాన్ని నిర్మించేందుకయ్యే ఖర్చు
పెట్టి కొన్ని లక్షల జనం హాయిగా బతకచ్చు.

యురేనియం అణువుల్తో తయారయ్యే ఈ బాంబులు
ఒక్క చిటికెలో శాంతిస్థాపన సమర్థంబులు
దురాక్రమణ చేసిన దేశంపై వేసి చూడండి
ఆ దేశంగాని, దురాక్రమణగాని మిగిల్తే అప్పుడనండి.

అమెరికావారు ప్రపంచ శాంతి రక్షణార్థం
ఇంత ఖర్చుపెడుతున్నారంటే ఏమిటి దానర్థం ?
అమెరికా ఒక్కటే ప్రపంచప్రజల వెల్ విషర్,
అని మన్ని నమ్మమంటారు లూయీ ఫిషర్.

— సవ్యసాచి

కాలక్షేపం

"అక్కరకురాని చుట్టము
మ్రొక్కిన వరమీని వేల్పు - మోహరమున దా
నెక్కిన బారని గుర్రము
గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ"

మన కష్టసమయంలో మన వద్దకువచ్చి మనలను ఆదరించనటువంటి చుట్టమును గ్రక్కున విడువంగవలయు నన్నాడు. మనము మ్రొక్కుకొన్నప్పుడు మనము కోరినవరమును యివ్వనటువంటి వేల్పును అనగా దైవమును గ్రక్కున విడువంగవలయు నన్నాడు మనము యుద్ధరంగంలోకి గుర్రాన్ని ఎక్కివెళ్లిన సమయంలో ఆ గుర్రము ముందుకుపారనియెడల (అనగా పరుగెత్తనియెడల) అటువంటి గుర్రమును అక్కడే గ్రక్కున విడువంగవలయు నన్నాడు. ఈవిధంగా గ్రక్కున విడనాడిన వాడే సుమతీ అనగా "మంచిబుద్ధిగలవాడు" అని సూచించాడు.

ఎవరైనా ఒక చుట్టము మన కష్టసమయంలో మనకు సహాయం చెయకపోయినట్లయితే, ఆ చుట్టముయొక్క అభిప్రాయం ఏమిటి? మన కష్టసమయంలో మనలను ఆదరించడంగాని సహాయం చేయడంగాని భారమైన విషయంగా, కష్టమైన పనిగా అతడు భావించి మనతో సంబంధము అతడు కల్పించుకొనదలంచ లేదని అర్థం. మనతో సంబంధం అతడు వదులుకొన్నాడు. ముందుగా మనలను గ్రక్కున విడువంగవలయునని నిశ్చయించినది అతడే మనతో సంబంధం విడనాడుకొన్న బంధువుతో, ఇంకా మనం విడనాడుకోవలసిన సంబంధం ఏమైనా వున్నదా? అదే అసలైన ధర్మసందేహం.

అన్నయునూ తమ్ముడునూ ఆస్తిని పంచుకొని వేర్వేరుగా కాపురము ఉంటున్నప్పటికీ, ఒకరి కష్టసుఖములలో ఇంకొకరు సమాన భాగస్వాములవలె వ్యవహరిస్తూ సహకరిస్తూ ఉండవచ్చు. మీదుమిక్కిలి, అలా సహకరిస్తూ ఉండవలసిందే. కాని, ఒక్కొక్క సందర్భములో ఒకరి కష్టమునకు ఇంకొకరు చేదోడు వాదోడుగా ఉండకపోవచ్చును. అన్నగారి కష్టసమయంలో తమ్ముడు వచ్చి ఆదరించకపోవచ్చును. ఆ కారణంచేత వెంటనే "ఆ తమ్ముడు నాకు సంబంధించినవాడు కానే కాడు" అని చాటించి "వానితో నాకిక సంబంధం లేదు" అని గ్రక్కున విడనాడవలసినదేనా? ఇదేనా బుద్ధిమంతుని లక్షణం?

"ఉపకారికి ఉపకారము
విపరీతము కాదు సేయ — వివరింపంగా
అపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడె — నేర్పరి
సుమతీ"

అనే నీతివాక్యం మొదటిపద్యంలోని నీతికంటె మేలుజాతినీతి తన సోదరుడు తనకు ప్రత్యక్షంగా అపకారం చేసినప్పటికీ, వానికి తిరిగి ఉపకారమే చేయవలెనని యీ పద్యంలో బోధింపబడుతోంది గదా. అటువంటి సందర్భంలో తన సోదరుడు తనకు ఏ విధమైన అపకారమూ చేయకపోయినప్పటికీ, తన కష్టకాలంలో వచ్చి తనకు ఉపకారం చేయలేదనే కారణంచేత ఆ సోదరుణ్ని గ్రక్కున విడువంగవలసినదేనా?

ఆవిషయం అట్లా ఉంచండి. "అక్కరకురాని చుట్టము" అంటె ఏమిటి? తన అవసరానికి ఉపయోగపడని చుట్టము అని అర్థం చెప్పాలి. అనేక అసందర్భాల వల్లనూ, అవాంతరాల వల్లనూ, అశక్తత వల్లనూ, సమయానికి రాలేనివాళ్లు ఉంటారు. అంతమాత్రంచేత అటువంటి చుట్టాన్ని గ్రక్కున విడనాడవలసినదేనా?

ఇంకా యీవిషయంలో దూరం ఆలోచించాలి. ఎందుకంటే, భగవదనుగ్రహం లేనిదే, దైవసహాయం లేనిదే, యిక్కట్టులనేవి తొలగవు. దైవానుగ్రహం అనేది ఉంటే వచ్చిన విపత్తులు విచ్చిపోతాయి. దైవసహాయం లేనప్పుడు ఎంతమంది ఆప్తులువచ్చి ఆదరించినా, ఎంత పరివారం చుట్టూ ఉన్నప్పటికీ, మానవ జీవితం అనేది నీటి బుడగలాగున అంతర్థానమైపోతుంది. ప్రాణం కృష్ణార్పణం అవుతుంది.

కొంతకాలం క్రింద జరిగినవిచిత్రవిషయం ఒకటి భగవంతుని చిద్విలాసం ఎటు

ఏడుస్తూ ఏడు అనడం ఎవ్వరికీ కూడదు

వేదోక్తంగా మంత్రయుక్తముగా జరిగేటటువంటి హిందూ వివాహంలో మంగళ సూత్రం ముడివేసినంత మాత్రం చేత వివాహం పూర్తి అయినదని భావించకూడదు. సూత్రధారణ అయిన తర్వాత సప్తపది అనే వివాహతంతు కూడా పూర్తి కావాలి. అదికూడా అయిన పిమ్మటనే, వధూవరులు న్యాయశాస్త్రం ప్రకారంగా భార్యాభర్తలుఅవుతారు. సూత్రధారణ అయిన తర్వాత (సప్తపది కాక పూర్వమే) పెండ్లి కుమారుడు ఆకస్మికంగా "హరీ!" అంటే (అమంగళం హరించును గాక!) అప్పుడు పెండ్లి అయిన పిల్ల గతి ఏమిటి? ఆ పిల్లకు మనోవర్తియివ్వవలసిన బాధ్యత లేదనిన్నీ, వివాహం పూర్తి కాలేదు గనుక నిరభ్యంతరంగా ఆపిల్లను మరొకనికిచ్చి వివాహం చేయవచ్చుననిన్నీ కోర్టు తీర్పులు కూడా ఉన్నాయి.

సప్తపది అంటే, పెండ్లి కుమారుడున్నూ పెండ్లి కుమార్తెయున్నూ చేతులుపట్టుకొని ప్రదక్షిణం చేస్తూ ఏడు ప్రమాణాలు చేస్తూ ఏడు అడుగులు పూర్తిగా వెయ్యాలి. ఒకవేళ ఆరు అడుగులు మాత్రమే వేసి పెండ్లి కుమారుడు ఏడో అడుగు వేయకముందే, అతనికి గుండె కొట్టుకోనడం అంతటితో ఆగిపోయినట్లయితే (తిరిగి అతని గుండె కొట్టుకొనుగాక!) అట్టి సందర్భంలోకూడా అతడు ఏడు అడుగులు పూర్తిగా వేయలేదు గనుక వివాహం జరుగలేదనియే తీర్పు చెప్పవలసి ఉంటుందని న్యాయమూర్తులు అన్నారు. కాబట్టి ఏడుఅడుగులు పూర్తిగా వేయడం కల్యాణానికి అత్యంత అవసరం. శుభానికి ఈ ఏడు ఎంత ముఖ్యమో గ్రహిస్తే "ఏడుస్తూ ఏడు" అనేమాట మనం అనం.

ఈ ఏడు అడుగులు వేసేటప్పుడు చేసే ఏడు ప్రమాణాలు ఏవంటే:-

1. ఓం ఇష ఏకపదీ భవ
సా మా మనువ్రతా భావ
విష్ణుస్త్వానయతు పుత్రాన్
విందావహై బహూంస్తే సంతు
జరదష్టయః

తా॥ ఓ కన్యా! సంతానము కొరకు నీవొక అడుగు వేయుము. నీవు నాకు అనుకూలవతివి కమ్ము - ఈ అనుకూల్య వ్రతానుష్ఠాన శక్తిని భగవంతుడు నీకు ప్రసాదించుగాక! అయిశ్వర్యమును, బలిష్ఠమైన ఆయుర్వృద్ధి గల పుత్ర సంతానమును మనము పొందెదముగాక!

2. ఓం ఊర్జే ద్విపదీ భవ!

తా॥ జవస్వత సంపాదనకై రెండవ అడుగు వేయుము.

3. ఓం రాయస్పోషాయ త్రిపదీభవ.

తా॥ ధనైశ్వర్యముల సంరక్షణమునకు మూడవ అడుగు వేయుము.

4. ఓం మాభయోభావ్యాయ
చతుష్పదీభవ.

తా॥ సుఖప్రాప్తికై. నాలుగవ అడుగు వేయుము.

5. ఓం ప్రజాభ్యః పంచపదీభవ.

తా॥ సంతాన ప్రాప్తికోసం ఆ ప్రజాపోషణకోసం, అయిదవ అడుగు వేయుము.

6. ఓం ఋతుభ్యః షట్పదీభవ.


తా॥ షట్ ఋతువుల అనుకూల స్థితికై ఆరవ అడుగు వేయుము.

7. ఓం సఖా సప్తపదీభవ.

తా॥ స్నేహ సంపాదనకై ఏడవ అడుగు వేయుము.

శుభప్రదంగా సంతోషంగా ఈ ఏడు అడుగులు వేసిన వాళ్ళందరూ ఏడుస్తూ ఏడు అనడం ఎప్పుడూ కూడదు.

వంటివో బుజువుచేస్తోంది. గోదావరీనదివంతెనమీదనుంచి రైలుబండి అతివేగంగా పోతోంది. ఇంజనులో బొగ్గువేసే పనివాడు, ఇంజనుగుమ్మంవద్దకు వచ్చి, దాని పడిచెక్కమీద నిల్చున్నాడు. ఒకఇనుపకమ్మీని పట్టుకొని నిల్చున్నాడు, ఆచేతి పట్టు దురదృష్టవశాత్తు విడిపోయి అగాధమైన గోదావరిలో పడ్డాడు. కాని, ప్రవాహం ఫుల్ గావున్న చోటపడలేదు. పక్కనున్న యిసుకదిబ్బమీద పడ్డాడు. అదృష్టవశాత్తు కాలికి కొంచెంగా దెబ్బతగిలింది. అటుతర్వాత, రైలు ఆగింది. ఇసుకతిన్నెమీద పడిఉన్న ఇంజనుపనివాణ్ణి మరొక రైలులో ఎక్కించి యింటికి చేర్చారు. దురదృష్టవశాత్తు పడ్డాడు. అదృష్టవశాత్తు బ్రతికాడు.



ఆపత్తుకు ఏ కారణం అయితేనేం? అది గోదావరి అయితేనేం? అది గంగ అయితేనేం? "కృష్ణార్పణమెల్ల జీవనము కాదా కృష్ణవే



ముస్తాబు
చిత్రకారుడు: శ్రీ ఎ. వి. యస్. ఆర్. జోస్యులు.

కామ్యర్గో!” అన్నట్టుగా మానవ జీవితంలో ఎవ డేపని చేసినా ఆపని తాను భగవంతునకు చేస్తున్న సేవ అనే భావంతోనే చెయ్యాలన్నారు. లోక సంగ్రహార్థమే అనండి. లేదా లోకేశ్వర అనుగ్రహార్థమే అనండి. ఏమైనప్పటికీ “కృష్ణార్పణం” అని త్రికరణశుద్ధిగా ఆ పని చెయ్యాలన్నారు. యుద్ధంలో శత్రువును ఖడ్గంతో సంహరించేటప్పుడు కూడా “హర! హర! మహదేవ్!” అని సంహరించవలసినదే. ఈ నదులు, యీ పర్వతములు, యీ రాజ్యాలు, యీ జగత్తు యావత్తూ మన సొంతసొత్తు కాదనిన్నీ భగవంతుని ఆజ్ఞప్రకారం మన జీవితంలో మనం కొన్ని పనులు చేయవలసియున్నాము గనుక, ఆ భగవంతుని పేరుతోనే ఆయా పనులను చేస్తూ ఉండాలన్నారు. “కృష్ణార్పణం” అని స్మరిస్తూ) విజయుడు అర్జునుడు) ధర్మయుద్ధం చేశాడు. కృష్ణుడు మాత్రం అవతారం చాలించి నిర్యాణం పొందలేదా? యాదవకులానికి ముసలం పుట్టిందన్నారు. అందుచేతనే శ్రీకృష్ణుడు నిర్యాణం పొందినాడన్నారు. ఏ కారణం చేతనైతేనేమి? ఒక సందర్భ కారణం ఏర్పడింది. అందువల్ల ఒకపని జరిగింది. ఆ కర్మకు ఆ ఫలితం ఆ రూపంగా కన్పించి ఆయన అవతారం చాలించడం జరిగింది.

కనుక దేహధారుడైన తర్వాత కర్మబద్ధుడై తీరాలి. ఎటువంటి మహాత్ముడైనా కర్మబద్ధుడై ధర్మమును నిర్వహించవలసిందే.

కనుక, ఏవో కొన్ని కార్యకారణ సంబంధములతో గిరగిరా తిరుగుతూ ఉండే అగాధమైన యీ కర్మచక్రపు సుడిగుండంలో బద్ధులైన మానవులకు దాన్ని తప్పించుకోవడం సాధ్యమా?

“నా భుక్తం క్షీయతే కర్మ
కల్పకోటి శతైరపి”

న అభుక్తం అనగా అనుభవించకుండా, క్షీయతే కర్మ—కర్మ అనేది హరించిపోదు—కల్పకోటి శతైరపి అంటే శతకోటి కల్పముల కాలం జరిగినప్పటికీ (భుక్తం కావలసిన కర్మ, భుక్తం కావలసినదే). ఇంత కఠినంగా ఇంత నిర్మొగమాటంగా మన ప్రాచీన బ్రహ్మజ్ఞానులు ఘోషించారు. వారి గ్రంథాలు ఇంకా ఆ విషయాలనే “లాడ్ స్పీకర్లు”లాగున గర్జిస్తున్నాయి.

మన కర్మసూత్రమే యింత నిర్మొగమాటంగా నిజమును నిర్వచించి నిరూపిస్తూ ఉంటే, అనుభవించవలసిన కష్టాలు అనుభవించి తీరవలసినదే అంటున్నప్పుడు, ఎవరేం చెయ్యగలరు?

“ఏ తీరున దయ జూచెదవో
ఇనవంశోద్భవ రామా!
నా తరమా భవసాగరమీదను
నళినదళేక్షణ రామా!”

ఇంతకంటే యీ భవసాగరం యీదడానికి ఇంకో మార్గం లేదని కూడా మహాభక్తులు బోధించారు. ఆ భక్తుల హృదయంలోనుంచి వచ్చిన యీ ఆర్తనాదము అభంగ తరంగ మృదంగనిస్వనము తెరంగున నాటికి నేటికి మారుమ్రోగుతూనే ఉంది.


“మా యట్టిడుముల బడిన నరులు గలరె యొరులు పరమ మునీంద్రా” (“మావలె కష్టముల బడిన మనుష్యులు ఇతరులెవరైనా ఉన్నారా ఓ ముని శ్రేష్ఠుడా!”) అని ధర్మరాజులవారు తన సోదరులతోను ద్రౌపదితోను అడవులపాలై అరణ్యవాసం చేస్తున్నప్పుడు ప్రశ్నించారు. “స్వామీ! మీకంటె కష్టాలపాలై అరణ్యాలపాలైనవారు కూడా ఉన్నారు. ఆనాడు హరిశ్చంద్రుడు ఆడినమాట తప్పనని అడవులపాలు కాలేదా? ఆనాడు, నలమహారాజు అడవులపాలై అవస్థలపాలు కాలేదా? అని వెంటనే జవాబు వచ్చింది.

ఈ రోజున కూడా ఎవరిమట్టుకు వారు “మా యిట్టిడుముల బడిన నరులు గలరె యొరులు?” అని ప్రశ్నిస్తూనే ఉంటారు.

కర్మపాశంలోనుంచి తప్పించుకొనడానికి వీలులేదని వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మజ్ఞానులు, అంత గట్టిగా నిర్మొగమాటంగా చెప్పుతున్నప్పుడు, మనచుట్టాలు మనతో నిర్మొగమాటంగా ప్రవర్తించి మనలను ఆదరించలేదనే అనవసరమైన కంఠశోష ఎందుకు? “రాతిలోని కప్ప రక్షించు నెవ్వాడు?” కొండబండను బద్దలుకొడితే ఆ శిలాగర్భంలో హాయిగా సజీవంగా ఉంటుంది ఒక పెద్దకప్ప-ఆ మండూక మహర్షికి ఆ గుహావంటి బందిఖానాలో ఊపిరి ఎట్లా ఆడుతోంది? దాని ఆకలి ఎట్లా తీరుతోంది?

ఈ రాతికప్పరక్షకునికంటె మించిన రక్షకు డెవరు? చుట్టాలు రక్షిస్తారా? అవసాన సమయం ఆసన్నమైతే “మాతా నాస్తి పితా నాస్తి”. తల్లి లేదు, తండ్రి లేదు, అన్నప్పుడు ఇక చుట్టాలు అక్కరకు రాలేదనే ఆందోళన ఎందుకు? ఆలాపన ఎందుకు? ఆగ్రహం ఎందుకు? అందుకనే ‘నాస్తి బంధు సహోదరః” అని కూడా యీ నాస్తిసెక్షనులో చేర్చారు. ఈ సంగతి గ్రహించినపిమ్మట ఇక చేయవలసిన పని ఏమిటి? ఏమీ లేదు. భజగోవిందం, భజగోవిందం! అని భజనచేయవలసివదన్నారు. ఈ సంగతి గ్రహించకపోతే అటువంటివాడు వట్టి “భజగోవిందం!” అన్నారు. అట్టివాడు వట్టి “మూఢమతే”

(56-వ పేజీ చూడండి)



ఇండోర్ ఆలిండియా కాంగ్రెస్ కమిటీలో నెహ్రూ, ఆజాద్ ప్రభృతులు.

ఇండోర్ ఆలిండియా కాంగ్రెస్ కమిటీ

(3-వ పేజీ తరువాయి)

మెంటరీ పార్టీలకు ప్రాముఖ్యత రాక తప్పదు. కమిటీలు తమ ప్రాముఖ్యత నెంత బలపర్చుకోవాలని యత్నిస్తాయో అంతా సంఘర్షణ పెచ్చుమీరక తప్పదు. ప్రస్తుత నిర్ణయం ఈ సంఘర్షణ తగ్గి ఉభయవర్గాల మధ్యనా సహకారసాధనకు తోడ్పడ్డానికి ఉద్దేశించబడింది. అయితే కమిటీలకంటె పార్లమెంటరీవర్గం ప్రాధాన్యత ఈ నిర్ణయం ధృవపరుస్తుంది.

విదేశాంగవిధానం

ప్రపంచ శాంతిసాధనకోసం అగ్రరాజ్యాల నాయకులు సమావేశమై యుద్ధభీతిని నివారించి ప్రధానమైన ప్రపంచ సమస్యల్ని పరిష్కరించవలసిందని అగ్రరాజ్యాలకు విజ్ఞప్తి చేస్తూ ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఒక తీర్మానం చేసింది. కొరియాలో ఏదో విధంగా రాజీ సాధించి ప్రాచ్యదేశాలలో శాంతి స్థాపనకు దోహద మివ్వాలని కూడా విజ్ఞప్తి చేసింది. ఈ తీర్మానం బ్రిటన్, అమెరికాలకు అట్టే రుచించలేదని లండన్ వాషింగ్టన్ నగరాలనుంచి వస్తున్న స్వల్ప వార్తలనుబట్టే తెలుస్తున్నది.

భారతప్రభుత్వ విదేశాంగ విధానాన్ని ఆమోదిస్తూ చేసిన తీర్మానాన్ని ఆలిండియా కాంగ్రెస్ కమిటీలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ గారు ప్రవేశపెట్టారు. ప్రవేశపెడుతూ ప్రభుత్వవిధానాన్ని తిరిగి వివరించారు. స్వలాభంకోసం ప్రపంచ రాజ్య కూటాలలో ఏదో ఒకదాని అండను చేరడం కాని, ఎవరె రీతిగా ప్రవర్తించినా మన కెందుకనే తటస్థవిధానం కాని భారత ప్రభుత్వానికి నచ్చదన్నారు. చీనా జపాన్ల పట్ల భారతప్రభుత్వం అవలంబించిన వైఖరినిబట్టి ఈ అంశాలను వివరించారు.

అయితే ఒక విషయాన్ని వారు వివరించలేదు. అంతర్జాతీయ వ్యవహారాల్లో ఉత్పన్నమైన ప్రతి సమస్యనూ విడివిడిగా వాని మంచి చెడ్డల్నిబట్టి నిర్ణయిస్తున్నా రన్నారు. ఆపైన, శాంతిసాధనకు ఎంత వరకు అవకాశముంటుందో దానినిబట్టి భారతప్రభుత్వం నిర్ణయాలకు వస్తున్న దన్నారు. ఇంకోటి కూడా చెప్పారు. న్యాయం, సత్యం అనేవాని ఆధారంతో ప్రతివిషయాన్నీ తూచి నిర్ణయిస్తున్నా రన్నారు. ఈ మూడు వివరణలూ అందరికీ సమ్మతమైనవిగానే కనపడినా తరుచు పరస్పర విరుద్ధంగా ఉంటాయి మచ్చుకు మన కాశ్మీరుసమస్యే చూడవచ్చు. ఈ సమస్యా పరిష్కారానికి మనం ఐక్యరాజ్యసమితిని న్యాయం సత్యం చూసి నిర్ణయించమని కోరుతున్నాము. కాని ఏ తునితగవుతీర్పైనా పాకిస్తాన్ భారత దేశాలమధ్య యుద్ధం లేకుండా చెయ్యడం భద్రతా మండలి ఉద్దేశం. తునితగవు తీర్చడం న్యాయానికి విరుద్ధం. అంతర్జాతీయ సమస్యల్ని న్యాయం, సత్యం గమనించి పరిష్కరించడం వేరు, ఎవరికి ఏ కొంత అన్యాయం జరిగినా తలొగ్గి సంఘర్షణ నివారించడం వేరు. అందువల్లనే మనకి కాశ్మీర వ్యవహారంలో ఐక్యరాజ్య సమితి వైఖరి బోధపడకుండా పోయింది.

[19-9-52]

సీరియల్ నవల

రెండు మహా నగరాలు

చార్లెస్ డికెన్స్

35

డిఫార్ ఆ కవరు తీసుకుని డార్నేను తనవెంట రమ్మని సంజ్ఞచేశాడు. డార్నే అతన్ని అనుసరించి బయలుదేరాడు. వాళ్లిద్దరి వెంటా ఇంకో యిద్దరు సాయుధదేశభక్తులు బయలుదేరారు

ఆఫీసు మెట్లు దిగుతూ, డిఫార్జ్ డార్నేను మెల్లిగా ప్రశ్నించాడు: 'వెనక యిక్కడ బాస్టిలీ జైల్లో ఖైదీగా వుండేవాడే,—డాక్టర్ మానెట్—ఆయన కూతుర్ని పెళ్ళిచేసుకుంది నువ్వేనా?'

డార్నే అతనివంక ఆశ్చర్యపడి చూస్తూ: 'అవును, నేనే,' అన్నాడు.

'నా పేరు డిఫార్జ్—సెయింట్ ఆంటోనీ వీధిలోవున్న సారాదుకాణం, యజమానిని; బహుశా నువ్వు నా సంగతి వినే వుంటావు'

'అవును విన్నాను—తన తండ్రికోసం, నా భార్య మీయింటికి వచ్చింది.'

'పనీ పాటా లేక—ఇక్కడి కెందుకొచ్చావ్?'—

'ఎందుకొచ్చానో చెప్పానుగదూ—ఆమాట అబద్ధమనా మీరనుకోటం?'—

'అబద్ధంగాదు సత్యమేననుకో—ఎందుకొచ్చిన సత్యం, దరిద్రపుగొట్టు సత్యం' అన్నాడు: అతని కనుబొమలు రెండూ బాధగా ముడిబడ్డయ్.

'ఇదంతా ఏదో అయోమయంగానే వుంది—పరిస్థితి ఇలా మారిపోయిందని అనుకోలేదు—అంతా కంగారుగావుంది—మీరు నాకో చిన్న సహాయం చెయ్యగలరా?'—

'చెయ్యను—' అనేశాడు డిఫార్జ్; కందగడ్డయి పోయిన ముఖం డార్నేకు కనుపించకుండా, ఆకాశంలోకి చూస్తూ;

'పోనీ ఒకమాట అడుగుతాను సమాధానం చెబుతారా—'

'చెప్పదగినదైతే—'

'ఖైదులో పెట్టబోతున్నారుగదా—బయటివాళ్ళ కెవళ్ళకేనా ఉత్తరం వ్రాసుకోవటానికేనా అవకాశమిస్తారా అదీ లేదా?'

'చూస్తావుగా—'

'విచారణా గిచారణా లేకుండానన్నా జైల్లో శాశ్వతంగా భూస్థాపన చెయ్యరుగదా?'—

'చూస్తావుగా—అయినా దానికో పెద్దయిదేవిటి?—లోగడ, అంతకంటే దరిద్రపు గొట్టుజైళ్ళలో యెంతమందిని భూస్థాపనం చేశారుగాదు?'—

అనువాదం: తెన్నేటి సూరి

'కాని, డిఫార్జ్ గారూ—నేనుమాత్రం అలాంటిపాపం యెప్పుడుచేసిన వాణ్ని గాదండీ'

డిఫార్జ్ డార్నే ముఖంలోకి ఒక క్రోర చూపు చూసి ముఖం తిప్పేసుకున్నాడు. మరింత ఉద్ధృతంగా నడిచి పోతున్నాడు. అతనితోపాటు గబగబా నడుస్తూ డార్నే వెర్రివాడులా బ్రతిమిలాడుతున్నాడు;

'పోనీ యీ ఒక్క సాయం చెయ్యండి డిఫార్జ్ గారూ!—చాలా ప్రాణావసరం—టెల్ సన్సు బ్యాంకు గుమాస్తా, లారీ గార్ని మీరు ఎరిగేవుంటారు—ఆయన ప్రస్తుతం పారిస్‌లోనే వున్నారు. నన్ను యిలా జైల్లో పెట్టినట్టు, కాస్త, ఆయనకు కబురు పంపే యేర్పాటు చేయించి పెట్టండి—'

'మీకు నేను చచ్చినా రవ్వంత సహాయంచేసేది లేదు. మీకు వ్యతిరేకంగా నా దేశం పక్షానా, ప్రజల పక్షానా నిలబడి పోరాడటానికి ప్రతిజ్ఞ పట్టాను. మీకు నేను సహాయ పడటమనేది కల్లోవార్త.'

ఇక, అతన్ని బ్రతిమిలాడి లాభంలేదని, డార్నే నిరాశ చేసుకున్నాడు. అలా ప్రాధేయపడటంకూడా అతని మనస్సుకు కష్టంగానే వుంది. ఇద్దరూ మౌనంగా నడిచి పోతున్నారు. డార్నేతోపాటు అలా అనేకమందిని జైళ్లకు తీసుకు పోతున్నారు. ఆ రోడ్లమీద వస్తూ పోతున్న జనానికి అదేమంత విచిత్రమైన సంఘటనగా లేదు. అతని వంక చూసినవాడే లేడు; అథవా యెవడేనా కాస్త తలెత్తి చూసినా 'బూర్జువా వెధవలు' అంటూ పళ్ళుకొరికేవాడే తప్ప, 'అయ్యో!' అనుకునేవాడు లేడు.

ఒక సందు మలుపుకు వచ్చేసరికి అక్కడ ఒక సభ జరుగుతోంది. ఆ వేదికమీద నిల్చుని ఒక దేశభక్తుడు ఉపన్యసించుతున్నాడు; రాజూ రాజకుటుంబం ప్రజలపట్ల జరిపిన ఘాతుక కృత్యాలను యేకరువు పెడుతున్నాడు.

ఆ కాసేపటిలోనూ, చెవులబడ్డ మాటలవల్ల, రాజుగారు జైల్లో వున్నట్టూ, విదేశ రాయబారులంతా ఎక్కడి వాళ్లక్కడ తమ తమ దేశాలకు వెళ్ళిపోయినట్టూ డార్నేకు అర్థమైంది. ఈ సంగతి తెలియగానే, తాను యెలాంటి పరిస్థితిలో చిక్కుబడ్డదీ పూర్తిగా అర్థమైపోయింది. తాను యిగ్లండునుంచి బయలుదేరే నాటికి పరిస్థితి యింత విషమించిలేదు. లేకపోతే తాను బయలుదేరేవాడే కాదేమో అయినా యేది యెలా జరుగుతుందో—ముందుగానే ప్రాణభీతి దేనికని ఇంకా కొంచెం ఆశతో వున్నాడు. 'గిలటైన్' అనే కర్కశి ఫ్రాన్సు నడిగడ్డమీద జననమైన సంగతి పాపం అతని కింకా తెలీదు!

డిఫార్జ్ డార్నేను వెంటబెట్టుకు "లాఫోర్స్" ఖైదుదగ్గిరికి తీసుకువచ్చాడు. అక్కడున్న గాండ్రుపిల్లి మొహం అధికారి, "ఇంకా యీ జైలునిండా యెంతమందిని కుక్కమంటారు" అంటూ విసుక్కున్నాడు.

డిఫార్జ్ డార్నేను వప్పగింతచేసి రశీదుతీసుకుని వెళ్ళిపోయాడు, తనతో వచ్చిన మిగతా యిద్దరు దేశభక్తుల్నీ కూడా వెంట పెట్టుకుని.

డిఫార్జ్ వెళ్ళిపోయిన తరువాత కూడా, ఆ జైలు ఉద్యోగి, ప్రక్కన కూర్చున్న భార్యవంక చూసి: 'ఏమిటీ నా మొహం!—ఇంకా యెంతమంది యీ తొంబ!'—అని చిరాకు పడ్డాడు.

'మనిషికి నెమ్మదనేది వుండాలి—ఏమిటా చిరాకు' అని భర్తను మందలించింది ఆ యిల్లాలు.

ఆ అధికారి బల్లమీదవున్న గంట మోగించగానే, లోపల్నుంచి ముగ్గురు జైలువార్డర్లు చక్కావచ్చారు. వాళ్ళల్లో ఒకడి చేతికి ఒక చిన్ని కాయితం ముక్కను అందిస్తూ డార్నేను వప్పగింత చేశాడు. కాయితంవంక మాస్తున్న వార్డరు—'రహస్య ఖైదీ కూడానా' అంటూ విసుక్కున్నాడు: 'సరే! రా!' అన్నాడు, డార్నేవంక చూసి.

ఆ ముగ్గురువార్డర్లూ, ఖైదీని వెంటబెట్టుకుని లోపలికి తీసుకు వెడుతున్నారు. ఆ జైలుయావత్తూ ముంజుకంపు కొడుతూ, నానా కచాటీగానూ ఉంది. ఆ చీకటి కొట్లనిండా జనం కిటకిటలాడుతున్నారు. అలా కొంత దూరంలోపలికి పోగా పోగా చీకటి చీకటిగావున్న పెద్దహాలుఒకటి కనుపించింది. దాల్లో ఉన్న బల్లచుట్టూ చాలా మంది స్త్రీలుకూర్చున్నారు. వాళ్ళచుట్టూ చాలా మంది మగవాళ్లు నిల్చుని ఏవో కబుర్లాడుతున్నారు.

ఆ హాల్లో వున్న ఒక పెద్ద మనిషి డార్నే కటకటాల దగ్గిరికి రాగానే ఒక చిన్ని ఉపన్యాసం మొదటలెట్టాడు.

'ఇక్కడవున్న మిత్రులందరి తరఫునా తమకు స్వాగతం చెబుతున్నాను. ఈ ప్రదేశానికి తమర్ని పడలాక్కువచ్చిన దురదృష్టానికి దురపిల్లుతూ, ఈ 'లాఫోర్స్' జైలుకు తమర్ని ఆహ్వానించగలిగే సదవకాశం లభించినందుకు ఆనందించుతున్నాను. త్వరలో మనవాళ్ళందరికీ యీ దురదృష్టం తొలగిపోగలదనీ మంచి రోజులు రాగలవనీ ఆశించుతున్నాను. మరోక తావునైతే, అలాంటి భోగట్టాలు చెయ్యటం, అసభ్య చర్యగా కనుపించవచ్చునుగాని, ఇది జైలు గనుక తెగించి అడుగుతున్నాను—తమ నామధేయాదికాలు తెలిపించితే కృతజ్ఞుణ్ణి అన్నాడు.

డార్నే తనపేరూ, వూరూ అంతా తెలియజేశాడు.

'కొంపతివ్వ "రహస్యఖైదీ" గాదు గదా?'—

'ఆమాటకు అర్థమేమిటో తెలియలేదుగాని, అదే అంటున్నారు' అని డార్నే సమాధానం చెప్పాడు.

'అలానా—పాపం—చాలా విచారకరమైన సంగతి—మరేం ఫరవాలేదు లే, అధైర్యపడకు, మనవాళ్ళలో చాలామందిని మొదట్లో ఇలాగే రహస్య ఖైదీలుగా వుంచి, అనంతరం మార్చారు' అన్నాడు.

'ఏయ్! అక్కడ నిల్చున్నావేం—త్వరగా రా' అంటూ కేక పెట్టాడు, వార్డరు. అతని హెచ్చరిక విని డార్నే కదిలిబయలుదేరాడు.

డార్నేను వెంటబెట్టుకుని, వార్డర్ వలయాలు వలయాలుగా వున్న రాతిమెట్లమీదనుంచి ఒక బురుజుమీదికి ఎక్కించాడు. పైకి యెక్కిన తరవాత, ఒక చిన్ని దరవాజా తెరిచి, నిర్మానుష్యంగా వున్న ఒక కొట్లోకి తీసుకువెళ్లాడు. ఆగది బాగా తేమగా వున్నా మరీ అంత చీకటిగా లేదు.

'నన్ను ఒంటరిగా ఎందుకు ఖైదుచేస్తున్నారు'—అని ప్రశ్నించాడు డార్నే.

'ఏమో ఆ సంగతి నాకేం తెలుసు' అని సమాధానం చెప్పాడు వార్డరు.

'నేను కాయితం కలం కొనుక్కుని, ఉత్తరాలూ అవీ వ్రాసుకోవచ్చునా.'

'నాకు అలాంటి ఉత్తరువు లేవీ యివ్వలేదు—అధికారులు వస్తారు—అడుగుదువుగాని లే'

వార్డర్ గది నాలుగుమూలలూ పరికించి తలుపుతాళంవేసి వెళ్ళిపోయాడు. డార్నే గదిలో అటునుంచి యిటూ ఇటునుంచి అటూ తిరుగుతూ గదిపొడుగూ వెడల్పూ కొలుస్తున్నాడు—నాలుగు అంగలన్నర పొడువు-నాలుగుఅంగల వెడల్పూ-చతురస్రం! ★

సీరియల్:

పరారి

(నాటిక)

జాన్ గాల్స్‌వర్దీ

నాలుగో ఘట్టం

[ఏడుగంటల తరవాత. నదివొడ్డున డెనాంట్ కూర్చొని వుంటాడు. గేలం వేసి దిక్కులు చూస్తాడు. ఒక వృద్ధుడు ప్రవేశిస్తాడు.]

వృద్ధుడు: మంచు ఇప్పుడే విడిపోతోంది. అప్పుడే చేపలకోసం బయలుదేరారే!

డెనాంట్: అవునండి. ఇప్పుడు వెలుగు బాగానే వుంది.

వృద్ధుడు: చిన్న చేపలు దొరికినట్లున్నాయి. తింటానికివే బాగుంటాయటండి.

డె: (నోరూర్చుకుంటూ చేపలబుట్ట వంక చూస్తూ) నిజమండి.

వృ: (వింతగా అతన్ని పరికిస్తూ) ఇంత మంచులో ఎవరూ వీధిలోకి రారు—ఖైదీలు తప్ప.

డె: (ఉలిక్కిపడి)—అంటే పారిపోయినవాళ్లా? కాని ఎవరూ తప్పించుకోలేరని విన్నానే!

వృ. నేనూ అలాగే విన్నాను. అయినా ప్రయత్నించేవాళ్ళూ ఉంటారు. అలాటివాడు కనపడితే ఎలా వుంటుందో!

డె: నిజమే!

వృ: (కోటు కింద వేసి దానిమీద కూచుంటాడు) అలాటివాడు కనపడితే ఏంచెయ్యడం? పెద్దమనిషితరహాగా ఉండడమా? లేకపోతే ప్రభుత్వ శాసనాన్ని బలపరిచి పోలీసులి కప్పగించడమా?

డె: (లేనిశ్రద్ధ చూపిస్తూ) తప్పించుకోడానికి ప్రాణాన్నికూడా లక్ష్య పెట్టని వాడి చురుకుతనం మెచ్చుకోవలసిందే. ప్రాణంమీద పందెం ఒడ్డుతున్నాడన్నమాట.

వృ: అవును అయినా ఈ చుట్టుపట్ల అలాటి వాడిపని చాలా కష్టం. ఇక్కడ జనమంతా పోలీసులపక్షమే. అమెరికాలో ఇలా వుండదు. అంతా తారుమారు. ఖలే చురుకైన జాతిలే. శాసనాలంటే నీసంలెక్క ఉండదెవ్వరికీ. మళ్లీ ఇతరులెవ్వరికీ నీతి లేదంటారు. నిరుడు వెళ్లాను అమెరికా. మీరెప్పుడేనా వెళ్ళారా?

డె: యుద్ధం రోజుల్లో అక్కడ పడమటి కెళ్ళాను

వృ: నిజం? సినీమాల్లో చూస్తే, పోలీసులకి తోకరా తినిపించడం ఇంకా ఫేషన్‌లాగే కనపడుతుందక్కడ. అబ్బే! అల్లా వుండకూడదు. కాస్తంత స్థిమితం అంటూ వుండాలా దేశంలో!

డె. నాకు మట్టుకు అల్లా అనిపించదు. నేను జర్మనీలో తప్పించుకున్నవాణ్ని. అందువల్ల అల్లా అనిపిస్తోందనుకుంటాను.

వృ. ఏమిటి, మీరే! బలే!

డె: ఒళ్లు లావు తియ్యాలంటే అదే మంచిమందు. పరారవడం అంటే తిరణాల కెళ్ళడం కాదు.

వృ: అవునవును.

డె: అన్నట్టు ఇక్కడో ఖైదీ తప్పించుకు పారిపోయాట్టండి.

వృ: విన్నాను. కెప్టెన్ డెనాంట్ అతని పేరు. ఆ కేసుకూడా చదివాను పేపర్లలో. అది మీకెల్లా తోచింది?


డె: (జాగ్రత్త పడతాడు) అట్టే జ్ఞాపకం లేదండి.

వృ: ఏమిటి? హైడ్ పార్కు కేసు జ్ఞాపకం లేదూ?

డె: ఓహో! అదా! అవును. ఒక అమ్మాయీ అదీ చదివాను. అటువంటి కేసుల్లో ఎవరో ఒకరు ఫిర్యాదు చేసేదాకా పట్టుకోకూడదసలు.

వృ: అహఁ. పోలీసు తన డ్యూటీ తను చేస్తున్నాడు. అందులో తప్పేముంది? అయినా అలాటిది మంచిది కాదు. నీతిపరులైనవాళ్ళెవళ్ళో అవినీతిపరులెవరో చూసి పోలీసుల్ని కనిపెట్టమనడమేమిటి? పోలీసులూ మనలాటివాళ్ళే. మనకి మాత్రం, చాలామందికి విచక్షణజ్ఞానం తక్కువే. కెప్టెన్ ఫిర్యాదు చెయ్యనే లేదు. మీకు జ్ఞాపకం లేదూ?

డె. (లోని తత్తరపాటు అణుచు



విజయవాడవద్ద కృష్ణానదిపై రైలువంతెన.

ఛాయా-చిత్రకారుడు: శ్రీ పి. హనుమంతరావు,—ఈమని.

కుంటూ) నాకు జ్ఞాపకం ఉన్నంతవరకూ, ఆమె మేధావి అని అతను చెప్పాడను కుంటాను.

వృ. (చుట్టలసంచీ తీస్తాడు) కాలుస్తారా?

డె: థాంక్స్! నేను తెచ్చుకోడం మరిచిపోయాను. (ఇద్దరూ చుట్టలు వెలిగిస్తారు)

వృ. పారిపోయినవాడు మన కంట బడితే ఏమో అనుకుంటా. పాము ఎదురైనట్టే వుంటుంది మీ కంటపడకుండా పారిపోవాలని చూస్తుంది అయినా కంటపడ్డ తరవాత తల చితక్కొట్టకపోతే కరిచే మాట ఖాయం అదీ ఒక డ్యూటీయే. ఏమంటారు?

డె. కావచ్చు కాని అలాటి డ్యూటీ నేనైతే తప్పించుకుంటాన.

వృ అవును లెండి. అది మంచిదే. నేనూ తప్పించుకుంటాను.

డె. (మాటమారుస్తూ) ఆ జైలు చూశారూ? చూడ్డానికి రోతగా వుంటుంది.

వృ చూశ్నేదు అసలు సంగతేమిటంటే - మా రోజుల్లో నేను స్వయంగా అనేకమందిని జైలుకి పంపాను. ఆరోజుల్లో అప్పుడప్పుడు జైళ్ళకెళ్లి చూసివాణ్ని. అడపాదడపా జూరీపెద్దల్ని పంపి చూడమనేవాణ్ని. ఎంతమంది చూసేవారనుకుంటారు

డె: ఎవ్వరూ చూడరు

వృ. సరిగ్గా అంతే జరిగింది.

డె. అయినా జైలుచూడాలనుకునే వాళ్ళెవరుంటారు? అంతకంటె శ్మశానం చూడ్డం నయం. అక్కడైతే మనుషులు చచ్చిపోయుంటారు

వృ. ఇప్పుడు జైళ్లు చాలా బాగుపడ్డాయిట. కొత్తకనికరం చూపుతున్నారుట.

డె. అలాగా! ఓహో! అదెప్పణ్నించండీ?

వృ: (బెరుకుగా చూస్తాడు) కంచీలతో కొట్టించడం లేదిప్పుడు. బుర్రలు గొరిగించడంలేదు. దానికేం గాని ఇప్పుడతనొచ్చి ఎదురైతే ఏంచేస్తారు?

డె. పిక్కబలం చూపించడమే.

వృ. చుట్టుపక్కల ఎవరూ చూసే వాళ్ళు లేకపోతే మనిషితత్వం అంతే లెండి. చలేం బాగుండలేదు. అసలీపూరు

అనువాదం.
సూరంపూడి సీతారామ్

మంచిదే కాని

డె. బస్తీ ఇంకా బాగుంటుంది

వృ: మీకీ చుట్టుపట్ల బాగా తెలుసా?

డె: లేదు ఇదే మొదటిసారి ఇక్కడికి రావడం.

వృ ఇంకా ఉంటారా?

డె. ఊహు (ఈల పాట పాడతాడు) హఠాత్తుగా పాట ఆపి నుదుట చెమట తుడుచుకుంటాడు.

వృ: ఏం? వొంట్లో బాగుండలేదా?

డె: అబ్బే ఖాళీ కడుపుమీద చుట్ట కాల్చడం కష్టం, చుట్టైతే బలే కమ్మగా వుంది కాని. (చుట్టముక్క మీదేస్తాడు. జాలిగా తడిసి తేలుతున్న చుట్టపీకవంక చూస్తాడు.)

వృ: (చితుకుచూపులు చూస్తూ) పాపం ఖైదీలకి చుట్టకాల్చుకోడానికి కుండదు. ఏమంటారు. మీ కలా అనిపించలేదూ?... అట్టే అదే జర్మనీలో మాట.

డె (ఊపిరి బిగబట్టుకుంటాడు. గొలం ముడిచేస్తాడు.) అప్పుడప్పుడు చుట్టలిచ్చేవాళ్లు

వృ: ఎప్పుడూ పొట్టలు ఖాళీగావుంటే వనుకుంటాను.

డె. అవును.

[డెనాంట్ వెళ్లిపోడానికి సిద్ధమౌతున్నాడు. వృద్ధుని చూస్తున్నకొద్దీ అతనికి తత్తరపాటు ఎక్కువౌతోంది]

వృ: నేనూ వెడతాను. కొత్త కాలక్షేపం అయింది ఈ యీడులో నావంటి

(52-వ పేజీ చూడండి)

"టొమెటో"-"పొటెటో" సంతతి "పొమెటో" అవుతుంది

జర్మను దేశీయుడైన లూథర్ బర్‌బ్యాంకుగారు వృక్ష వ్యవసాయ పరిశోధనలు చాలా చేశారు. పండ్ల జాతులలో వారు చాలా కొత్త రకాలు సృష్టిచేశారు. ఇంగ్లీషులో "టొమెటో" అనబడే పండును రామములక్కాయ, లేదా సీమవంకాయ, లేదా కర్బూర వంకాయ అలి తెలుగులో అంటారు పండిన పండు ఎర్రగా గుండ్రముగా ఉంటుంది. దాని గింజలు వంకాయలోని గింజలు లాగున ఉంటాయి. పండు రసంగలిగి కండగలిగి ఉంటుంది. పండ్లను ఉన్నవి ఉన్నట్లే తినవచ్చు. లేదా ఉడకబెట్టి పప్పులోవేసి వండుకోవచ్చును. చాలా రుచిగలది. ఆరోగ్యకరమైనది. చెట్లకు కాయలు సమృద్ధిగా కాయును.

ఇంగ్లీషులో "పొటెటో" అనగా బంగాళాదుంప. దీనినే ఉర్లగడ్డ అని కూడా అంటారు. టొమెటో చెట్టును పొటెటో చెట్టును అంటుత్రొక్కి సంగమింపజేసి లూథర్ బర్‌బ్యాంకుగారు "పొమెటో" అనే పేరుతో ఒక క్రొత్తరకం మొక్కను సృష్టిచేశారు.

టొమెటోకు, పొటెటోకు ఉన్నటువంటి లక్షణములు యీ "పొమెటో"కు సంక్రమించాయి. పొటెటోవలె యీ చెట్టుకు దుంపలు ఉంటాయి. టొమెటోవలె దీనికి కాయలూ ఉంటాయి. బర్‌బ్యాంకుగారు యిటువంటి పరిశోధనలు ఇంకా ఎన్నో చేశారు.

మేం పుణ్యాం సంపాదించాం

'ఏమండోయ్! ఇవాళ శివరాత్రి.' మా ఆవిడ కేక పెట్టిందంటే ఆనాడు నిర్ధారణగా శివరాత్రి అన్నమాటే.

'అవుతే ఏమంటావ్?' అని అడిగాను మంచంమీదినుంచి లేవకుండానే.

'వేగం లేచి స్నానంచెయ్యండి'

గిరుక్కున తిరిగి వెళిపోయింది ఆర్డరు వేసేసి. తప్పదు మరి. లేచేతీరాలి.

లేచాను. మొహం కడుక్కున్నాను. మొహం కడుక్కోగానే కాఫీనీళ్లు అలవాటు. ఓమాటు అలా వంటింటిలోకి తొంగిచూశాను. అబ్బే! ఎక్కడా ఆ సరంజామా ఏమీ అవుపించలేందే! అసలు పొయ్యిలో నిప్పే లేనట్టుంది! గుండె గుభేలుమని వెనక్కి తిరిగి చూచేటప్పటికి, మా ఆవిడ నవ్వుతూ ఎదురైంది. అడుగుదామనే అనుకున్నాను. కాని అడగలేక పోయాను. నిర్ఘాంతపోయి మిడుతూ, మిడుతూ చూస్తున్నాను ఆవిడ మొహంలోకి.

'ఇవాళ శివరాత్రని చెప్పానుగా. ఉపవాసముండాలి మీరు," నవ్వుతూ చాల సులువుగా అనేసింది ఆ మాట. నా బాధ ఏమిటో దానికేం తెల్సు.

'నువ్వున్నావుగా వుపవాసం. నన్నెందుకుమళ్లీ బాధ పెట్టడంచెప్పు.'

'నేనున్నాను గనకనే మిమ్మల్ని కూడా వుండమనటం.'

'మనలో ఎవరున్నా ఒకటేగా.'

'అబ్బే అదేమన్నమాట, నేను చేసిన పుణ్యంనాది. మీరు చేసే పుణ్యంమీది.'

'కాదు. కాదు. మనజంటలో ఎవరు అర్జించినా సమంగానే పంచుకుంటాం ఆపుణ్యమేదో.'

'ఇద్దరం ఆర్జించటం అంతకన్నా మంచిదిగదూ?'

తనమాట నెగ్గాలన్న ఇదేకాని, మరి యువతల వాళ్ళ భావం గ్రహించే వుద్దేశమే లేదు. ఉపవాసముంటే స్వర్గానికి ఓ మెట్టువేశామన్న మూర్ఖంలో నేవుంది... సరే తను నమ్మింది, తనకి మంచిదని తోచిందీ, తను ఆచరించడం బాగానే వుంది. కాని యిష్టంలేకపోయినా నాచేత కూడా ఆచరింపచెయ్యాలన్న యీ మూర్ఖపు పట్టుదల ఏమిటి చెప్మా?

వొద్దని గట్టిగా అనలేక పోతున్నాను. ఏముందీ! తీరాఅనేస్తే ఆకాస్త మృదువూ పోతుందేమోఅని నాబెంగ. పెళ్లాంముందు జంకకుండా అంత నిక్కచ్చిగా చెప్పడమెల్లాగో నాకోసమస్యగా తయారయింది. అట్లా చెప్పి నెగ్గించుకునే మొగవాడెవడెనావుంటే, చెయ్యెత్తి దండం పెట్టాలి ఆ మహానుభావుడికి. లేదా తనన్నమాటను ఉపసంహరించుకొని, మొగుడు మాటను హర్షించే యిల్లాలన్నా నాకంతే గౌరవం.

'అవును కానీ, కడుపుమాడుతోంటే డ్యూటీ చెయ్యాలావొద్దా?

'ఇవాళకూడా డ్యూటీఏమిటండోయ్.' అని అడిగింది నేనన్నమాట యందు విశ్వాసంలేనట్టు. అంటే తనకెంత భక్తిశ్రద్ధలున్నాయో, అందరికీ అలాంటిభక్తిశ్రద్ధలే వుంటాయని, శివరాత్రినాడు ఎక్కడపనులక్కడ ఆగి పోతాయని కాబోలు మా ఆవిడ తాత్పర్యం.

'పండుగా, పబ్బమూ ఏమీ అక్కర్లేదు మీకు, ఎంతసేపూ మీ తిండీ, మీ డ్యూటీ. అంతే అలాగే మీజన్మ, మిమ్మల్ని కట్టుకున్నందుకు నా జన్మ తిరించిపోవాలి.'

'మరి' తలమ్మకున్నామంటే ఏమన్నమాట?

'పోనీ అంత పీకమీద కత్తైయితే సెలవైనా పెట్టండి.'

'సెలవిచ్చే దాతైనా వుండాలా?'

'ఏం విడ్డూరమండీ మీది! ఏదో మలిగిపోయినట్టే చెబుతారు మీకా వుద్దేశం. లేదనండి. ఉంటే సెలవెందుకివ్వరూ?'



"ఇవాళ శివరాత్రని చెప్పానుగా. ఉపవాసముండాలి మీరు"

'ఉపవాసమంటే వుంటాను. ఉపవాసానికీ, సెలవుకీ సంబంధమేమిటి. రాత్రి జాగరం సంగతి ఆ తర్వాత చూసుకోవచ్చును. ఏదో యిలాగే కాల్లీడ్చుకుంటూ పోయి, సాయంత్రానికల్లా యింటికి చేరుకుంటానులే.'

'వొద్దొద్దు. అక్కడ మీరు సవ్యంగా వుంటారూ! నలుగురూ కలిసి ఏ హోటల్లోనో కతుకుతారు. మీ సంగతి నాకేం కొత్త ఏమిటి.'

ఎన్ని సాకులుచెప్పి తప్పించుకుందామన్నా ససేమిరా అన్నిటికీ అన్నీ అడ్డసవాళ్లే. తప్పని సరిగా సెలవు పెడితేనే కాని గతిలేకపోయింది. ఆ వొచ్చే నాలుగు రాళ్లూ యీ రోజు రాకుండా పోయాయే అని కించపడ్డమాట వాస్తవమేకాని ఏం చెయ్యనూ? మహాశివరాత్రి...పర్వదినం. మళ్ళీమళ్ళీ రావలసినరోజు కాదు. దేవుడియందున్న భక్తి చేతకాకపోయినా, పెళ్లాన్ని మెప్పించడంకోసమైనా ఆనాడు ఆమాత్రం త్యాగంచెయ్యాలి మరి...అదీకాక ఈదినం కూరఖర్చు ఎలా గడుస్తుందని భయపడుతున్న నాకు ఉపవాసం వుండడంవల్ల ఆ బెంగ కాస్తా తీరిపోయింది.

* * *

'యేమండీ ఇహ దేవాలయానికి వెడదామా?' అని అడిగింది ఆ సాయంత్రం.

'ఇంత తొందరగా నేనా?'

'తొందర లేదులెండి. ముందుగా పండూ కాయా తెచ్చుకోవాలిగదా!'

చచ్చేం! ఏం పురమాయిస్తుందో ఏమిటో!

'మొన్న మీరు జ్వరం పడ్డప్పుడు మొక్కుకున్నాను, శివరాత్రినాడు శివుడికి డజను అరటిపళ్ళు, ఐదుకొబ్బరికాయలూ యిస్తానని లేచి బజారుకి ఎళ్ళండి.'

అరె! యిదో కొత్తతంటా తెచ్చిపెట్టిందే. కనీసం రెండుమూడు రూపాయిలైనా వుండాలిప్పుడు. ఏందారి? జేబులన్నీ గాలిస్తే మూడణాలు దొరికాయి.

'అబ్బే, అన్ని డబ్బులు లేవు.' పెదవి విరుస్తూ అన్నాను.

'డబ్బు లేవంటే ఎలా కుదురుతుంది. ఎలాగో ఓలాగు తేవాలికాని.'

'పోనీ మరోసారికి వాయిదా వెయ్యలేవా?'

'మళ్ళీ యేటిదాకానా?' దీర్ఘంగా యీడుస్తూ పలికిందా మాటలు వెక్కిరింతగా.

'చూడు. మన దగ్గిర డబ్బుల్లేవని దేవుడికి మాత్రం తెలియదా ఏమిటి? ఈమాటుకి మన్నించమని, అపరాధులమని ప్రార్థిద్దాం. అంతటితో చెల్లు.'

'ఏమి మాటలండీ అవి! మన దగ్గిర డబ్బులున్నాయో లేలో దేముడికేం కావాలి? మన మొక్కు చెల్లించుకోడం మన పని.'

'మరి దేవు డివ్వంది మనకి మాత్రం ఎలా వొస్తాయి చెప్పూ డబ్బులు?'

'ఆ! దేము డివ్వంది మనంతట మనమే గడించేస్తున్నాం లెద్దురూ; మీ మాటలూ మీరూనూ...ఆపద గడిచిపోగానే భగవంతుడు మూలపడిపోతాడు.'

'పండూ కాయా యిస్తామని, ముడుపులు చెల్లించుకుంటామనే కాబోలు ఆపదలు గడుపుతూ వుంటాడు! ఔనౌను. లంచమిస్తేనే కాని దేవుడైనా పలకడు పాపం.'

దేవుణ్ణి నిందిస్తున్నానని కోపమే వొచ్చిందో, లేకపోతే నే నన్నదానికి జబాబివ్వలేని సంతాపమో తెలియదు కాని, అశ్రువులు జలజలరాలాయి మా ఆవిడ కళ్ళలోంచి. అది చూసి నాకూ కూడా అదేమో ఒకలా ఐపోయింది. విచిత్రమైన సృష్టి! ఏ ఆయుధాలకూ లేని శక్తి ఆడదాని కన్నీళ్ళకుందంటే అతిశయోక్తి కాదేమో! నిజంగా స్త్రీలకున్న ముఖ్యాయుధం కన్నీళ్ళు. అదీ, తలచుకున్నప్పుడు, సకాలంలో ప్రయోగించగలగడం మరొక విశేషం. ఎంత ప్రగల్భాలు కొట్టేవాడూ అక్కడ బోల్తాకొట్టకతప్పదు.

గదిలోకెళ్ళి కండువా భుజాన్ని వేసుకొని బజార్లో పడ్డాను ఆపళంగా...రెండు రూపాయలు పుట్టించే మార్గం నా మెదడులో వున్న తెలివినంతా ఉపయోగించి, నెత్తికొట్టుకున్నా సరే స్ఫురించలేదు; కేవలం బుర్ర వేడెక్కిపోవడంతప్ప. బుర్ర వేడెక్కిపోగానే వొంట్లో మిగిలివున్న సత్తువ కాస్తా హరించుకపోయింది. అక్కడొక తూముంటే దానిమీద చతికిలబడి శూన్యంగా చూస్తున్నాను నాలుగువైపులా.

చటుక్కున ఓ ఆలోచన తట్టింది. వెంటనే లేచి పళ్ళదుకాణంవద్దకు వెళ్లాను.

'ఏం తాతా! కులాసాగా వున్నావా?' అని అడిగాను పళ్ళతాతని.

'ఏదో బాబూ! మీ దయవల్ల.'

'అయితే తాతా! మరి...మరి...'


తొట్రుపడింది మాట. అనవలసింది అనలేకపోయాను. ఏమిటో అందామని అక్కడిదాకా వొచ్చాను. తీరా వచ్చింతరవాత అది మర్చిపోయాను. కాస్సేపు తటపటాయించాను జ్ఞాపకం తెచ్చుకుందుకు. దానిసిగ తరగా, మళ్ళీ జ్ఞాపకం రాలేదు అదేమిటో......ఒక్క క్షణం క్రిందట అనుకున్నది యింతలోనే మర్చిపోతే ఏమనుకోడం...ఆలోచించడానికి తగినశక్తివున్న మనిషిలోనే, చిటికెలో దాన్ని మరిచిపోయే దౌర్బల్యం కూడా వున్నందుకు విచారించాలి.

'తాతా! ఇవాళ శివరాత్రట కదూ!'

అప్పటికి మాటల్లోకి దించాను. ఇంతలో ఏదైనా మార్గం స్ఫురించకపోతుందా అని.

శ్రీ చల్లా కృష్ణారావు

'అదికాదు...అన్నిడబ్బులువున్నాయో లేదో చూడాలి'
'పోనీ మీ దగ్గిర ఎన్నిడబ్బులుంటే అంతమట్టుకే యిస్తానులెండి'





పగలల్లా ఆఫీసులో పని చేసి అలిసివచ్చిన భర్త భోజనంచేసి నిద్రకు ఉపక్రమించాడు. భార్య అతన్ని సమీపించి:

"అప్పుడే ఏం నిద్రండీ? చూడండి, ఆకాశంలో చంద్రుడెంత బావున్నాడో?"

"అబ్బ, ఇప్పుడేం మించిపోయింది లేవే. రేపు పొద్దున చూస్తాలే."

'ఔను బాబూ! ఔను. పండూ కాయా యిమ్మంటారా బాబూ!'

'కావాలే తాతా!...కాని...'

'అంతటా ఒకటే ధర బాబూ! మీలాటి మెక మెరిగి నోళ్ళదగ్గిర బేరంచెప్పను. ఏమిటిమ్మంటారు? రెండుడజన్లు అరటి పళ్ళూ, పది కొబ్బరికాయలూ...'

'అదిసరిలే. కాని యింకా యింటికి పోలేదు. తిన్నగా యిలాగే వొచ్చేశాను.'

'అయ్యో బాబయ్యా! సంచీలేకపోతే నాసంచీలోవేసి యిస్తాను. మీరు తీరికైన ప్పుడు మళ్లీ తెచ్చి యిద్దరుగాని తీసుకు వెళ్ళండి.?

'అదికాదు...అసలు...అన్ని డబ్బులు వున్నాయో లేదో చూడాలి'

'పోనీ మీదగ్గిర ఎన్ని డబ్బులుంటే అంతమట్టుకే యిస్తానులెండి.'

'అబ్బే అవి చాలవు...నాకో డజను అరటిపళ్ళూ, ఐదు కొబ్బరి కాయలూ కావాలి...సరే, రేపొద్దున్నే యిచ్చేస్తాను...యిస్తావా?'

'క్షమించండి బాబూ! అరువివ్వనని చెవి నులుపుకున్నాను.'

'నన్నేరకంగా ఏమిటితాతా! ఈదారినే రోజూ పదిమాట్లేనా వొచ్చి పోతుంటానుకదా!'

'అరువు కానండి. తీరాపట్టుకపోయిన తరవాత ఒకో—ఆసామీ పత్తాకూడా వుండడు. ఓ పెద్దమనిషి మీలాగేనమ్మించి పట్టుకపోయి ఏడాదిన్నర అయింది. ఇంత వరకూ అయిపులేడు.'

'నన్నూ వాణ్ణీ ఒకటే లెక్కలో కడతావా?'

'ధర్మమా తమరు అలా అనడం? కాని.. డబ్బుదగ్గిర మాకు అందరూ ఒకటేనండి. అసలు వ్యాపారం సంగతే అంతండి. పాపిష్టిడబ్బు చేతిలోనుంచి ఊడదీసేసరికి నానాచంకలూ నాకాలి...మరేం అనుకోకండి...మీారైనా అంతే, నేనైనా అంతే...విషయం పెట్టకండి బాబూ! దయచెయ్యండి.'

ఆమాటలువింటూవుంటే నావొళ్లు నీరైపోయింది. కాదూ మరి! అరువుకోసం కక్కుర్తిపడబోతే, సిగ్గుతో తలదించుకో వలసినపరిస్థితి తటస్థించింది. వెధవ ముఖం చూడకుండా, నాలో నీపమిత్తు విలువా, నిజాయితీ లేనట్టుగా మాట్లాడుతోంటే, అంతకంటే అవమానం యింకేముంది? ఆ!...విలువా, నిజాయితీ మనిషిలో ఎక్కడేడ్చాయి చేతిలో డబ్బు లేనప్పుడు? వ్యక్తి విలువకు డబ్బే గీటురాయి. ఆ డబ్బే లేనప్పుడు వ్యక్తిత్వాన్ని కష్టాల్లో కాల్చవలసిందే...అయితే ఆ పుల్లలకున్న మూల్యంకూడా ఒకప్పుడు మనిషి కుంటుందా అని అనుమానం.

దించిన తలయెత్తకుండా బయల్దేరాను. దారిలో రేడుద్దామని, రేడ్చి మనసులోని భారం దించేసుకుందామని ఎంతో ప్రయత్నించాను. కాని గుండెలు తీవ్రంగా కొట్టుకోడం తప్ప, కళ్లంట నీళ్లు కారలేదు...ఆ విషయంలో ఆడవాళ్లు ఎంతో మెరుగనిపించారు. వాళ్లు యిట్టే ఏడ్చేసి, అట్టే జరిగిందాన్ని మర్చిపోతారు. మగవాడికా అదృష్టంలేదు.

చీరకొంగుతో కళ్లు వొత్తుకుంటూవున్న పెళ్ళాం నా దృష్టిలో మెదలుతోంది. ఆవిడ దుఃఖానికి అర్థం అప్పట్లో తెలియకపోయినా, యిప్పుడు బోధపడింది. నేననుకున్నట్టు దేవుణ్ణి దూషించానని కాని, నేనన్నమాటకు జబాబివ్వలేక కాని కాదా దుఃఖం. మరేమిటంటే నా దరిద్రాన్ని

చూసి భరించలేక కార్చిన కన్నీరై వుండాలి.

* * *

మందహాసంతో తులుకుతూ అందుకుంది నా చేతిలోని సంచీ మా ఆవిడ.

'మీరు దొంగలు సుమండీ; డబ్బులు లేవన్నారు కదా, యివన్నీ ఎలా వొచ్చాయి.' ప్రశ్నార్థకంగా వోరగా చూసింది నాకేసి. ఏమీ లేని నవ్వొకటి నవ్వేశాను, ఆవిడ ప్రశ్నకి జవాబుగా. నా మట్టుకి నాకే గుండెలు దడదడ మంటున్నాయి. నేను డబ్బు సంపాదించిన విధానం తల్చుకుంటే. ఆవిడకి ఎలా చెప్పను? ఆవిడకి తెలియకుండా ఎలా దాచగలను?

దేవాలయానికి బయల్దేరాము యిద్దరమూను. అప్పటికప్పుడే ఎనిమిదిగంటలయింది రాత్రి. ఆవిడమాత్రం వుత్సాహంగానే వుంది. నాకు ఉపవాసం తాలూకు మజా బాగా తెలిసొస్తోంది. దానికి తోడు గుండెలు పీకుతున్నై కూడా.

దేవాలయంలో మేము అడుగుపెట్టడమేమిటి, జయజయధ్వని మా చెవుల్లో పడడమేమిటి, రెండూ ఒక్కమాటే జరిగాయి. దరియాఫ్తు చేసినమీదట, ఆనాటి శివరాత్రి మహోత్సవానికి ఖర్చంతా ఓ ఆసామీ భరిస్తున్నాడని, తెల్లవార్లూ ఆవునేతితో దీపారాధన చేయిస్తున్నాడని, ఆ పుణ్యాత్ముడ్ని అప్పుడే పూలమాలల్తో అలంకరించి తీసుకొని వచ్చారని, తేలింది.

'ఓహోహో! ఏం పుణ్యమండీ... ఏం పుణ్యమండీ.' తన్మయత్వంతో మూర్ఛపోతుందా ఏమిటా అన్నంత భయం వేసింది నాకు, మా ఆవిడ వైఖరి చూసి. కాని అంతపనీ జరగలేదు నయమే.

'ఆయన ఎవరండీ?' ఎవర్తో ఏమిటో నా మాట తెలిసి విడిచి నట్టుగా ప్రశ్నించింది నన్ను.

'ఎంత అదృష్టమండీ... భగవంతుని సాన్నిధ్యం సంపాయించాలన్నా పెట్టి పుట్టాలిసుమండీ.'

వాడు పెట్టిపుట్టాడు. మనం పెట్టిపుట్టలేదు. ఎందుకొచ్చిన గోల. నాకు తలనొప్పి అలాంటి మాటలు వింటానికి.

'ఇంకా కదలరేం. ఆయన దర్శనమైనా చేసుకుంటే మన కింతకైనా పుణ్యముంటుంది పదండి.'

చెయ్యిపెట్టుకొని యీడ్చుకుపోతోంది నన్ను బలవంతంగా. పూజారికి తప్ప యింకొకళ్లకు ప్రవేశించడానికైనా వీలులేని స్థలంలో, లింగానికి అతి సమీపంగా, అంటే యించుమించులో తగుల్తూ, కూర్చున్నాడా మహాభక్తుడు. ఆ ముఖం చూస్తూ

(24—వ పేజీ చూడండి)

'ఆడపిల్ల పగవాడికైనా వద్దు'

శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి

సాధారణముగా భరించుకొనలేని బాధా ఇబ్బందీ దేనివల్లనైనా మనకు కలిగితే 'ఈబాధ శత్రువుకైనా వద్దు పగవాడికయినా వద్దు' అనుకుంటాము. మనము అనుకొనే ఆ బాధ ఎంత దుర్భరమైనది కాకపోతే మనకు శత్రువుమీద కూడా జాలీ కనికరమూ కలుగుతాయి? ఇటువంటి భరించరాని బాధలక్రింద జమకట్టబడినవాటిలో ఆడపిల్లకు పెళ్లిచేయటమనేది ఒకటిగా చేర్చబడ్డది.

అల్లారుముద్దుగా పెంచిన అమ్మాయికి-ప్రయాసతో వెతికి అనువైన సంబంధము తెచ్చి ముచ్చటగా కట్నకానుకలతో మూడుముళ్లూ వేయించటమూ సారె తీసుకొని అమ్మాయి అత్తవారింటికి వెళ్ళటమూ బాధాకరమా? అందులోనూ 'శత్రువుకైనా వద్దని' అనుకునేటంత బాధాకరమా అని నిజము విచారిస్తే, ఇందులో బాధపడవలసిన అవసరము కనబడదు. వివాహము వధూవరులకూ వధూవరుల పక్షములవారికీ. శుభప్రదమైనదిగానూ ఆహ్లాదకరమైనదిగానూ ఉండవలసిన ఘట్టము. ప్రతి శుభలేఖపైనా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణమును గురించిగాని, సీతారాముల వివాహమును గురించిగాని శ్లోకములను ఉదహరిస్తారు. అంటే, జరుగబోవు ఈ వివాహము పైన ఉదహరింపబడిన పుణ్యదంపతుల వివాహములవలె శుభప్రదమైనదీ ఆహ్లాదకరమైనదీ నన్న భావమూ ఆశయమూను మనవాళ్ళది. పుణ్యదంపతుల వివాహాలు జరిగినప్పుడు ఋషులు వేదాలనూ మంగళశ్లోకాలనూ వల్లించేవారు; ప్రకృతి చిగిర్చి రామణీయకముగా చూపట్టేది; దేవదుందుభులు మ్రోగేవి; మూడులోకాలవారూ సంతోషించేవారు అని చెప్పబడింది. ఆ వివాహాలను ఒరవడిగా పెట్టుకొని జరుపబడుతున్న నేటి వివాహాలు అంత ఆనందదాయకముగానూ, శుభప్రదముగానూ ఉన్నాయా అంటే, మనము తల తడిమిచూసుకొని పెదవి విరువవలసినదే!

మరి దీనికి కారణమేమిటి? దీనిలో మనసును బాధించే విషయమేదైనా ఉన్నదా అంటే - జరుగుతున్నది శుభప్రదమైన వివాహము-జరిపించేవారు వధూవరుల తలిదండ్రులు. కొలిపెబోయేది ప్రణయైక దంపతుల వైవాహిక జీవితము. చవిచూడబోయేది ప్రణయరుచులు. కనబోయేది వంశవర్ధనులను. స్వీకరించబోయేది ఆశ్రమములలోకెల్ల మేటియయిన గృహస్థాశ్రమము!

పోనీ మరెవరైనా ఈ సందర్భములో ప్రముఖపాత్ర ధరిస్తారాఅంటే వివాహ కార్యములో ముఖ్యవ్యక్తులు వధువు, వరుడు, కన్య తలిదండ్రులు, వరుని తలిదండ్రులు.

తన వయోరూపలావణ్యవిద్యాసంపదలకు తగిన వరుడు లభ్యమైనాడు; అతడిని చేపట్టి తాను సంతోషముగా సుఖముగా ఇహలోకమే కాకుండా పరలోక జీవితము కూడా సార్థకము చేసుకొనవలెనని వరుని సమాగమ మపేక్షించేది వధువు.

తాను మెచ్చిన వధువును సహధర్మచారిణిగా చేసుకొని, తన శుభాకాంక్షులకూ శుభాశయాలకూ మూర్తీభవించిన మనోరథముగా చేసుకొనవలెననీ, అనురసుఖములచే ఉభయుల జీవనమును సార్థకము చేసుకొనవలెననీ, ఆమెద్వారా సత్సంతానాన్ని పొంది వంశమునూ జాతినీ పోషించవలెననీ అభిలషించేవాడు వరుడు.

తమ శక్త్యనుసారము ధనము వెచ్చించి తమ బాలికను ఒక యింటిదానిగా చేయవలెనని ఎంతటి త్యాగమైనా చెయ్యటానికి సిద్ధపడేవారు కన్య తలిదండ్రులు.

తమ కుమారుని వివాహముచేసి, పరాయిబిడ్డ అయినా న్యాయశాస్త్రరీత్యా తమకు కుమార్తె అయి, తమ వంశావళిని పెంపొందించు కులదీపిక ఈ వధువు - ఈమెను కన్నవారు తమకు ఆప్తులు అని భావించుకొనవలసినవారు వరుని తల్లిదండ్రులు.

వివాహ వైభవమునూ - వివాహ మహోత్సవమునూ కన్నులతో చూచి ఆనందించి-వధూవరులను ఆశీర్వదించటానికి గాను ఆహూతులైనవారు బంధువులు.

పాలకడలివంటి ఈ శుభసందర్భములో 'శత్రువుకైనా ఈ బాధవద్దు' అనే హాలాహలము ఎట్లా జనించింది? ఎవరిమధ్య జనించింది?

ఈ బాధ అనుభూతము! ఇది వధూవరులమధ్య ఉద్భవించదు. సామాన్యముగా కన్యాదాతకూ వరుని తలిదండ్రులకూ మధ్య వివాహ వేదికవద్ద జనించి - వరుని తండ్రి నోటివెంటగానీ, వరుని పక్షమువారి నోటివెంటగానీ మాటరూపములో వెలువడి, మరికొంతసేపటికి కలహముగా పరిణమిస్తుంది. దీని స్వభావము వరుని పక్షమువారికి దయాదాక్షిణ్యములను నశింపచేసి, మానవత్వానికి దూరముగా ఉంచి, క్రిందు మీదు తెలుగకుండా చేయటమూ; వధువు పక్షము వారిని ఆర్థికముగా నష్టపరచి, మానసికముగా బాధించి సర్వనాశనమునకు దారితీయటమూను. తత్ఫలితముగా వధువు జీవితము దుఃఖభాజనము చేయగలిగినది బాధ. ఈ బాధ మన సంఘములో సముద్రఘోష వంటిదీ, నిత్యమైనదీ, సత్యమైనదీ, అందరికీ అనుభవైక వేద్యమైనదిను!

మన సంఘములో ప్రతి మానవుడి అనుభవములోనూ ఉన్న ఈబాధ ప్రకృతి సిద్ధమూ, దైవికమా? అంటే రెండూ కాదు! ఇది కేవలము సామాజికము, సాంఘికము!

వధూవరుల తల్లిదండ్రులు ఉభయకుటుంబాల గౌరవప్రతిపత్తిని ధనధాన్య సమృద్ధినీ పరస్పరము ఎరిగియుకొని-ఇచ్చిపుచ్చుకొనటాలను ముందుగానే నిర్ణయించుకొని శుభకార్యానికి ఉపక్రమిస్తారు.

పెండ్లిపందిరిలో-ఆత్మీయులూ, బంధువులూ, పెద్దలూ చేత అక్షతలు పట్టుకొని ఉండగా, పురోహితుడు మంత్రాలను ఉచ్చరిస్తూఉండగా, మంగళతూర్యరావాలు మ్రోగుతూఉండగా, మంగళసూత్రమును చేతపట్టుకొని, "తెర వెనుకనున్న వధువుకు ఈ సూత్రము కట్టనా వద్దా? తండ్రికోరిక సంభారమంతా సిద్ధముగా ఉన్నదా లేదా? తల్లికోరిన లాంఛనాలన్నీ జరుగుతాయా లేదా? లేక ఇంతకంటె అన్ని విషయాలలో మించిన సంబం

ధము ఏదైనా ఉన్నదా?' అనే జిజ్ఞాసలో సూత్రధారణకు అనుమానిస్తూ ఉంటాడు వరుడు.

'ఈ పెండ్లివల్ల వచ్చే ధనమూ కానుకలూ తన కుమార్తెల వివాహాలను చేయించగలవా? ఎన్ని వివాహాలకు సరిపడగలవు? అబ్బాయికి పోసి పెంచిన ఉగ్గుపాల ఖర్చూ-వాముపాల ఖర్చూ ఇందులో వచ్చినదో లేదో? ఇంతటితో ఈ పిల్లకు సూత్రధారణ కానివ్వవలెనా...... లేక మించిపోయినదేమీ లేదు! ఇప్పుడు పట్టుపట్టినా రెండు సంచులు రాలుతాయనటములో సంశయము లేదు. వెర్రివానివలె ఇచ్చినంతా పుచ్చుకొని - తొందరపడి మూడు ముళ్లూ వేస్తే అసమర్థుల మనిపించుకుంటామేమో?' అని డోలాందోళిత మనస్కుడై ఉంటాడు వరుని తండ్రి. అప్పటికప్పుడు మెరుపువలె కొన్ని క్రొత్త ఆలోచనలూ ఉపాయాలు తోస్తాయి. వెంటనే లేచి నిలువబడి 'ఉండరా అబ్బాయీ!' అంటూ ఒక చేత్తో వరుని వారించి కూర్చోపెట్టుతాడు.

అందరూ విస్మయపడతారు. కార్యక్రమము ఆగిపోయిన కారణము తెలియక తబ్బిబ్బయిపోతారు. 'జీవితములో రేపటి మాట ఆలోచించకుండా ఇంత వ్యయము చేసి, నా కుమార్తెను గృహిణిగా చేస్తున్నాను. నా జన్మ తరించబోతున్నది' అని ఆనందపడుతున్న కన్యాదాత అది చూసి నిర్ఘాంతపోతాడు.

వరుని పక్షమువారిపట్ల ఏ అపరాధము జరిగినదో నని 'ఏమి టేమిట'ని అందరూ గగ్గోలుపడి లేచి పరస్పరమూ ప్రశ్నించుకొంటూ సందడి చేస్తారు.

వరుని తండ్రి ధీమాగా కూర్చుంటాడు!

వధువు తండ్రి దీనుడై చేతులు నులుపుకుంటూ నిలబడి ఉంటాడు!

సంప్రతింపులు జరపటానికీ సామరస్యము కుదర్చటానికీ పెద్దలయినవారు ఇరుపక్షాలనుండీ లేచి నిలువబడతారు.

"వీరికి కట్నకానుకల విషయములో ఏమైనా సందేహము వచ్చిందా? వీరు కోరినంతా సిద్ధముగా ఉన్నది గా! అంటారు వధువు పక్షమువారి ప్రతినిధి.

"వీరు సరిగా అర్థము చేసుకోనని విషయము అదే! ఏడాది క్రిందటే మా అబ్బాయికి ఈ కాస్త మొత్తమూ ఎవరో ఇస్తామన్నారు. అందులోనూ వీరు లాంఛనాలు కూడా ఆ మొత్తములో సరిపెట్టాలని చూస్తున్నారు. మా మాటలలోని అర్థము గ్రహించలేనివాళ్లు వీరేమి పిల్లను యిస్తారు? మేమేమి చేసుకుంటాము?" అంటాడు లౌకికుడైన వరుని ప్రతినిధి.

దానితో పేచీ ప్రారంభమవుతుంది. తూకము తప్పిన మాటలు అనేకము ఇరుపక్షాలనుండీ బయలుదేరుతాయి.

కన్యాదాత నిలువునా కూలిపోతాడు. ఇక్కడికి ఈ మొత్తమే అధిక ప్రయాసతో సమకూర్చినది. ఇంకా ఎక్కడినుండి తేగలడు? ఇక తనకు ఇల్లూ వాకిలి మిగలటమున్నదా? మిగతా బిడ్డల ఆలోచన ఉన్నదా? లేక ఇంతటితో సన్యాసాశ్రమము స్వీకరించటమేనా?" అని నిశ్చేష్టుడైపోతాడు.

వివాహప్రయత్నానికే అంతవరకూ కొన్నివందలూ, వేలూ ఖర్చయి ఉంటాయి. బంధువులందరూ వచ్చి ఉంటారు. తప్పులు వెదకవలెనని జ్ఞాతు లెదురు చూస్తూ ఉంటారు. కుమార్తె పసుపుబట్టలతో, కాళ్ళకు పారాణి, ముఖమున కళ్యాణ సూచకమైన కుంకుమ రేఖలతో 'నాన్నా! నా గతి ఏమిటి?' అన్నట్లు దీనముగా చూస్తూ ఉంటుంది. కన్యాదాతకది విషమావస్థ! అతడు సందిగ్ధావస్థలో కొట్టుకొని పోతూ ఉంటాడు, అయినదానికి తోడు ఇంకా కొంచెము ఋణమో-పణమో తెచ్చి రెండుసంచులు కుమ్మరించి — సూత్రధారణ చేయించటమా? మర్యాదమార్గములూ దాక్షిణ్యములూ విడచి, కొడుకులను కన్న అహంకారముతో నరమాంస భక్షణకు పూనుకొన్న వధువు తండ్రికి తిరుగుమాట చెప్పటమా? వాళ్ళు కోరినధనము యివ్వకపోయినకైన సూత్రధారణ కాదు; పీటలమీది పెండ్లి తప్పిపోతుంది. అమ్మాయికి జీవితములో ఇదొక కళంకముగా నిలచిపోతుంది. ఈ విషమసంధిలో కన్యాదాత మానాభిమానాలు వదలుకొని మరో రెండు సంచులతో - దీనవదనముతో వివాహవేదికను సమీపిస్తాడు.

మందహాసముతో వరుడు వధువు మెడలో మంగళసూత్రము కట్టుతాడు.

సూత్రధారణ అయినంతమాత్రాన వివాహము పూర్తికాదు. భోజనాల దగ్గర - కాఫీలదగ్గర - ప్రతిచిన్న విషయములోనూ మగపెండ్లివారు వధువువైపువారిని గడగడ లాడించుకొంటారు. వియ్యపురాలికీ ఆడుబిడ్డలకూ అలుకలు! వారు లాంఛనాలతో శాంతిస్తారు.

వరునికి — ముందుగా మాట్లాడుకొనని లాంఛనమొకటి పెండ్లిలో నిర్ణీతమై ఉంటుంది. అది వరుని అలుక వేదిక, మధ్యాహ్నము పన్నెండుగంటల సమయములో పెద్దలూ చిన్నలూ భోజనాలకు

కోలినాస్

ప్రకృతియొక్క ఆకుపచ్చ క్లోరోఫిల్ గలది

...మీ దంతధావనంలో యింతకు ముందెన్నడు లేని గొప్ప పురోగమనం!

మొక్కలను తాజాగా ఆకుపచ్చగా ఉంచు ప్రకృతిసిద్ధమైన క్లోరోఫిల్ తో...నోటి దుర్వాసనను రోజంతా పోగొట్టుకొనుడు...దంత క్షయమును చిగుళ్ల బాధను ఆపుకొనుడు!

నిస్సందేహంగా మీకింతకు పూర్వ మెన్నడు లభించని అమోఘమగు దంతరక్షణ యిదియే! క్లోరోఫిల్ గల అద్భుత కోలినాస్ దంతక్షయమును రోగ క్రిములను నాశనము చేయుటయేగాక నోటి దుర్గంధము ఒక రోజంతా లేకుండ చేయును....ఇది మొక్కలను పచ్చగా తాజాగా ఉంచు ప్రకృతి సిద్ధమైన రసాయనిక పదార్థమగు ఆకుపచ్చని క్లోరోఫిల్ వల్లనే.

క్లోరోఫిల్ గల కోలినాస్ అమోఘమైన దగుటయే గాక పొదుపు కూడా. పొడి బ్రష్ మీద అరంగుళమే చాలు. ఆకుపచ్చని అట్ట పెట్టెలో అన్ని దుకాణాలలో దొరకును. నేడే కొని దంత శాస్త్రంలోకెల్ల అపూర్వ పురోగమనంవల్ల కలిగే లాభములను పొందండి!


క్రొత్త ఆకుపచ్చ అట్ట పెట్టెను గమనించుడు
స్టాండర్డ్ కోలినాస్ (పసుపు పచ్చ లేబిల్ కలది) కూడ లభించును

2,000 అమెరికన్ దంతరోగులు క్లోరోఫిల్ యొక్క సత్ఫలితములను నిరూపించుచున్నారు

నాలుగు సంవత్సరముల పరిశోధన, దాదాపు 2,000 అమెరికన్ రోగులపై యింతకు ముందెన్నడు జరుపబడని అత్యంత పెద్ద పరీక్షలవల్ల రుజువైనదేమంటే, క్లోరోఫిల్ గల డెంటల్ క్రీమ్

- చిగుళ్ల సామాన్య జబ్బులన్నిటిని అరికట్టును.
- నోటి దుర్గంధములను ఒక రోజంతయు పూర్తిగా పోగొట్టును
- దంతక్షయ క్రిములను అమోఘంగా నాశనం చేయును.

మీ దంత వైద్యునకు ఈ శోధనలన్నియు తెలియు, ఆయన యీ ఫలితములను నిర్ధారణ చేయగలడు






కోలినాస్ చిరునవ్వులో ఆరోగ్యం అగుపడుతుంది!

భారతదేశంలో తయారు చేయువారు:

జ్యాఫ్రే మానర్స్ & కం. లి. బొంబాయి 1. బ్రాంచీలు: కలకత్తా — మద్రాసు — ఢిల్లీ



లాండ్రీ మనిషితో :—
"వర్టు ఇస్త్రీ చెయ్యటానికేం తీసుకుంటావు? అర్జంటుగా ఫొటో తీయించుకోవాలి."
"రెండణాలు."
"అబ్బో రెండణాలే? అణా యిస్తాగానీ కుడివైపు మాత్రం ఇస్త్రీచెయ్యి. సైడ్ పోజులో తీయించుకుంటాను."

తొందరపడుతూ ఉంటారు. విడిదిలో బంధువులమధ్య పెండ్లికొడుకు అధినేత వలె అలుకవేదిక నధిష్ఠించుతాడు. ఎంతమంది వచ్చి పిలిచినా - భోజనానికి లేచి రాడు. చివరకు కన్యాదాత యజ్ఞపశువు వలె చేతులు కట్టుకొనివచ్చి నిలబడతాడు.

ఆతని రాకను చూసి వరునిపక్షమువారు 'నీ మనసులో ఏమున్నదో చెప్పు? ఇంత ఖర్చు పెట్టిన పెద్దమనిషి ఈ కాస్తకూ వెనుక తీస్తాడా ఏం?' అని వరుని ప్రోత్సాహపరచి, రేడియో కావాలా? మోటారు సైకిలా? కారా? ఏమిటి చెప్పు?' అని పెద్దపెద్దవస్తువులను సూచిస్తారు. అందులో ఒకటి వరునిచేత అడిగిస్తారు. బిక్కచచ్చిన కన్యాదాతచుట్టూ కొందరుచేరి 'ఇంతఖర్చు కానే అయింది. ఈ కాస్తకూ వెలితిపడకండి. ఈ ఒక్క రోజూ కళ్లుమూసుకుంటే పెళ్లి అయిపోతుంది' అంటూ అతడికి మరొకమాట తోచకుండా చేస్తారు. అక్కడికి ఆ లాంఛనము *Extra*!

ఇక అప్పగింతలు. ఈ ఘట్టముకూడా తగవులమారి ఘట్టమే! పెండ్లికి వచ్చినవారందరికీ బట్టలు యిచ్చి అమ్మాయిని అప్పగించమని వరునిపక్షమువారు అంటారు. దానికి తలవొగ్గి యిచ్చినా తగవులు వస్తూనే ఉంటాయి. ఏదో కోటా సైనుబట్టలతో అప్పగించారంటూ పేచీలు పెట్టారు. ఇన్నివిధాల బట్టలతో అమ్మాయిని అప్పగించుకొన్నవారెవరూ అత్తవారింటిలో పిల్ల కష్టపడుతూఉంటే నోటిమాటగా అయినా క్షేమ మడగరు!

ఈ విధముగా అడుగడుగునకూ పేచీలతో పెళ్లివారు సంచరిస్తారు. మాటకు ముందు 'మీ అమ్మాయిని మీ యింట్లోనే ఉంచుకోండి. మాదారిన మేము పోతాము' అంటూ బెదరిస్తారు.

వ్యయప్రయాసలకోర్చి ఇంతా పెండ్లి జరిపితే - అమ్మాయి అత్తవారింటికి వెళ్ళుతుందన్న నమ్మకము లేదు. పెళ్లినా బ్రతుకు కత్తిమీద సాముగానే ఉంటుంది!

పిల్లకు పెళ్ళిచేయటమంటే ఇన్నిబాధలూ ఇంత యమయాతనా కన్యాదాత అనుభవించవలసి వస్తున్నది. పెండ్లిలో లగ్నమూ - స్థాలీపాకమూ - సదస్సు - నాకబలితో పాటు తగవులూ పేచీలూ కూడా ముఖ్య ఘట్టాలుగా స్థిరపడ్డవి.

పెళ్లిళ్ళల్లో జరుగుతున్న హంగామాలో ఇక్కడ వివరింపబడినది సహస్రాంశము మాత్రమే.

ఈ బాధలు ప్రతి గృహస్థునకూ అనుభవైకవేద్యమే! మరి వాటిని తొలగించే మార్గముల నన్వేషించుతున్నారా అంటే, కన్యాదాతలు తమ కుమార్తెల వివాహాలు కావటముతోటే ఒక వింతప్రకృతిలో పడి కన్యాదాతను ఏడిపించే అవకాశము తమ కెప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తారు!

నిజము విచారిస్తే వరుడూ వధువూ ఎవరికివారు ముఖ్యులే-అధికులే! వరునివలెనే విద్య, రూపసంపద, అభిమానసంపద కలిగినదే వధువు, పెండ్లికి వరుడెంత ముఖ్యుడో వధువంత ముఖ్యము. వైవాహిక జీవితములోనూ, కుటుంబ బాధ్యతలలోనూ, సమాజములోనూ, వరునితో సమానమైన బాధ్యత వహించకలిగినది వధువు. ఈసందర్భములో సామాజిక జీవితములో స్త్రీ వివాహమునకు కట్నకానుకలు చెల్లించుకొనవలసి వచ్చిన దంటే దీని అంతర్యమేమిటి? స్త్రీ వివాహము చేసుకొనవలెనన్న ఈ పెనాల్టీ చెల్లించుకొనవలసినదేనా?

ఈ దురాచారము 'ఆర్థికమాంద్యమువలన వచ్చిన అనర్థాలలో ఒకటి' అని కొందరంటారు గాని, సామాన్యులలోకంటె ధనవంతులలోనే ఇది ఎక్కువగా కనబడుతున్నది.

ఈ దురాచార ఫలితముగా ఎంత విజ్ఞానవంతులైనా ఆడపిల్ల పుట్టినదనగానే తలిదండ్రులు పెండ్లిబాధలను తలచుకొని ఆర్థికపు చిక్కులను తలచుకొని వ్యసనపడతారు. అందువలన బాలుని పెంచినంత ఆహ్లాదముగానూ, సంతోషముతోనూ బాలికను పెంచరు. బాలబాలికల పెంపకములో తల్లిదండ్రులు చూపుతున్న వ్యత్యాసమూ భేదభావమూ బిడ్డలకు కూడా అబ్బి ఎక్కువ తక్కువలనే భ్రమలో పడవేస్తున్నది.

పెంపకములో వ్యత్యాసము ఉండటమువలన ఈ కాంప్లెక్సు వృద్ధిఅయి చివరకు ఆ పరిణామము వచ్చినదో, ఈ రెంటిలో దేనిఫలితము ఏదో, ఏది ముందో, చర్చించితే త్వరలో తేలేది కాదు. కాని ఫలితముమాత్రము మనజాతికి తలవంపులు తెచ్చేది!

స్త్రీ పురుషునితో సమానమని ఎంతకాలమునుండో మనవారు నినాదాలు చేస్తున్నారు. అనేక విషయాలలో నిరూపించుకుంటున్నారు. చాలామంది పురుషునితో సమానముగా ఉన్నామని గర్విస్తున్నారు. కాని ఎంతవరకూ-వివాహాలలో ధనము లేకుండా కన్య స్వీకరింపబడదో-అంతవరకూ స్త్రీ పురుష సమానత్వమునకు అర్థములేదు. విద్య నేర్చినా, ఉద్యోగాలు చేసినా-సంఘములో మాత్రము స్త్రీకి గౌరవము తక్కువని మనము తెలుసుకోటానికి వరకట్నాలే నిదర్శనము. ఈ విషయములో తగినంత కృషిచేసి తమకు సంఘములో సమానగౌరవ ప్రతిపత్తిని కలిగించుకోవటము స్త్రీల కర్తవ్యమని స్త్రీలోకానికి నా విజ్ఞప్తి.

తమతో సమానముగా చదువుకొన్న కన్యను వివాహము చేసుకొనటానికి, తాంబూలములోని దక్షిణను ఎంచుకోవటమనేది తన ఆధిక్యతకు లోపమని పురుషుడు గ్రహించవలసి యున్నది.

భారతమాత గర్భములో రత్నాలూ, జడలో కోహినూరూ వడుముచుట్టూ గంగా యమునలూ ఉన్నాయని మురుస్తూ కాలక్షేపము చేస్తున్నాము కాని కుటుంబాలను సర్వనాశనము చేసుకొని, జాతిని నిర్వీర్యము కావించి, సంఘాన్ని దేశాన్ని పతనము కావించే దురాచారాలలో మునిగి తేలటము స్వతంత్రభారత పౌరులకు అవమానకరమైన విషయమని మనము భావిస్తున్నట్లు కనబడదు. ★

"నువ్వు నన్ను నిజంగా ప్రేమిస్తున్నావా?"

"లోకంలో అన్నిటికంటే నిన్ను ఎక్కువగా ప్రేమిస్తున్నాను. నా హృదయాధి దేవతా! నీకోసం నా ప్రాణాలనే త్యాగం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను...ఒక్కసారి నీ చక్కటి శరీరాన్ని నా చేతుల్లో..."

శకుంతల ఒక్కసారిగా పుస్తకాన్ని శక్తికొద్దీ విసిరి కొట్టింది. అది కిటికీ ఊచలకి తగులుకుని, కొంచెంసేపు నిస్సహాయంగా ఊగులాడి చివరికి క్రిందపడ్డది. ఆమెకి కోపంతీరలేదేమో, లేచి ఆ పుస్తకాన్ని తీసి కిటికీలోంచి బైటపడవేసింది.

పుస్తకం తియ్యబోయేసరికి ఇదీ కథ! ప్రేమ—మోహం... ఇంతే కాబోలు వీళ్లకి వచ్చినది! 'నీకోసం చచ్చిపోతాను - కాఫీ మానేస్తాను—అది చేస్తానూ ఇది చేస్తానూ' అనడం—అక్కడినించి మామూలుగా కృతఘ్నతా—అంతా చవకబారు కథలు!

కిటికీలోంచి శకుంతల బయటికి చూసింది. తూర్పువైపు ఉన్న స్టూడెంట్ల లాడ్జినిండా దీపాలు. అందరూ చదువుకుంటున్నట్లున్నారు. మార్చిగా మరి! నిరుడు తానూ అలాగే బాధపడ్డది!

టైము చూసింది—పదిన్నర. నిద్రపోదామని మళ్ళా మంచం మీద వాలింది శకుంతల. నిద్రవచ్చే సూచనలేమీ కనపడలేదు. చదువుకోడానికి పుస్తకాలేవీ లేవు. ఉన్న దొక్కటీ పైకి విసిరింది. మూడో అంతస్థులోనించి దిగి దానిని తెచ్చుకోవడం అసంభవం—తాను పడిన తొందరకి కొంచెం సిగ్గుపడ్డది శకుంతల... ఇంకా చదివితే కథ బాగుండు నేమో!

ఒకటి రెండుసార్లు దొర్లింది. కాని, లాభంలేదు - నిద్ర పట్టదు. ఏమిటిలాభం అలాపడుకొంటే?

లేచి, లైటు వేసింది. రేడియో పెట్టింది. ఇండియన్ స్టేషన్లన్నీ నిద్రపోతున్నై...పన్నెండుదాకానైనా స్టేషన్లు పనిచెయ్యకపోతే ఎట్లా? అనుకుని చికాకుపడ్డది శకుంతల... అన్ని బేండ్లూ చూసింది ఏ ఫారెన్ స్టేషనైనా దొరుకుతుందని.

దొరికింది. ఏదో స్టేషనులో చక్కటి జంత్రసంగీతం వస్తోంది. పియానో, దాని వెనకాల ఎన్నో ఇతర వాద్యాలు. ఎంత హాయిగా ఉంది!

పద్దెనిమిదేళ్ళ యవ్వనం శకుంతలని ఆ సంగీతం వింటూండగా నిలువనియ్యలేదు. చిన్నప్పుడు కాన్వెంటులో చదువుతోండగా ఆమె నాట్యం నేర్చుకొనేది— ఈ ప్రశాంత వాతావరణంలో, ఏకాంతంలో, ఈ చక్కని సంగీతానికి ఆమెలో నరాలన్నీ కదలికపొందేయి. ఆనందంగా అడుగులు వేసుకుంటూ నాట్యం చెయ్యసాగింది.

టెలిఫోన్ గంట గణగణమోగింది.

శకుంతలకి కోపం వచ్చింది. ఎవరబ్బా ఈ అర్ధరాత్రిన పని ఉన్న మహానుభావుడు?

విసుకుతో రేడియో గొంతుక తగ్గించి, ప్రక్కనే ఉన్న టెలిఫోను తీసిందిఆమె.

"ఇది నూటపదహారు...ఎవ రది?"

"అక్కడ ఎవరు?"

"శకుంతల"

"నమస్తే, శకుంతలాదేవి గారూ!"

"నమస్తే...మీ రెవరని అడిగాను"

"ఎవరైతేనేంలెండి - మీరు బి. ఏ. నిరుడేగా ప్యాసయ్యారు?"

"తమకెందు కదంతా?"

"పని ఉండే లెండి—అర్ధరాత్రయేదాకా మీ రేడియో ఫుల్ బాస్‌లో ఉంచిగోలచేస్తూంటే మా మాట ఏమిటంటారు?"




"మీ రెవరని అడుగుతున్నాను"
"ఎవరైతేనేం లెండి....."

"మీ రెవరో నాకు తెలీదు - అయితేనేం? సంగీతం విని సంతోషించండి"

"పరీక్షల్లో మా సంగీతం వినరుగా?"

రసభంగం

శ్రీ ఇచ్ఛాపురపు జగన్నాథరావు



"నేను వింటాలెండి"

"వింటే ఏం లాభం ?"

"చెప్తాను-రేపో సారి కల్సుకోండి"

"పోనీ ఆసాయం ఇప్పుడే చేయరాదూ?"

"ఏంటదీ ?"

"మీ రేడియో గారి నోరు కట్టేయాలి"

"లేకపోతే ?"

"మీకు తెలుసుగా ?"

శకుంతలకి వళ్ళుమండింది - మంచిగా చెప్పరాదూ ? అంత పొగరుమోతుతనం ఎందుకూ ?

చేతిలో ఉన్న రిసీవర్ రేడియో మీద పెట్టి, టోన్‌పూర్తిగా రైజ్ చేసింది. తన పనికి తానే నవ్వుకుంది... రెండు నిమిషాలయాక తీసింది.

అవతలాయన ఇంకా డిస్కనెక్ట్ చెయ్యలేదు.

"చాలా బాగుందండీ సంగీతం"

"థాంక్స్-ఇంక చాల్లనుకుంటాము!"

"చాలకేం ? కాని, వెంటనే కట్టేస్తారా ?"

"అదలా వినిపిస్తూంటుంది లెండి. మీ సంగీతం మీరూ కానివ్వండి..."

రిసీవర్ పెట్టేసింది కోపంగా శకుంతల. రేడియో పాడుతూనే ఉంది. కొన్ని నిముషాలయాక కట్టేద్దామా అనుకుంది. కాని, అంత సులువుగా ఓటమిని అంగీకరించడం ఇష్టంలేకపోయిందామెకి.

లైటుమాత్రం ఆర్పేసుకుంది. అనేక ప్రశ్నలామెని బాధించడం మొదలుపెట్టాయి. ఎవరా పిలచినది ? ఎందుకంత కటువుగా మాట్లాడాడు ? చుట్టు ప్రక్కల ఎవరో అయితీరాలి. కాని, ఎవరు ? పెద్దమగవాణ్ణని, నోరు కట్టేయాలిట !- ఇన్సల్ట్ !

ఎదురుగావచ్చి, 'మాకు పని చెడుతోంది; దయయుంచి రేడియో పెట్టకండి!' అంటే తాను తప్పకుండా ఆ పని చేసి ఉండేది. పోనీ, ఫోనులో అయినా మంచిగా అడగరాదూ ? ఎందుకంత గర్వం ?

మళ్ళా ఆ ప్రశ్న...ఎవరతను ? ఎలా ఉంటాడు ?...

ఎవరైతేనేం ? చుట్టుప్రక్కల ఎవరో అయిఉంటాడు...అని తానే సమాధానం ఇచ్చుకుంది శకుంతల.

ఆమెకి తెలియకుండానే నిద్ర పట్టిందా ఆలోచనలో. తెల్లారుఝామున మూడుకి రేడియో గోలకి తెలివివచ్చింది. లేచి రేడియో కట్టేసి పడుకుంది మళ్ళా.

* * *

ఉదయం కాఫీ తాగుతూంటే తండ్రి అడిగాడు-: "రాత్రి మూడుగంటలకి రేడియో పెట్టావేంటమ్మా ?" అని.

"ఏదో స్టేషన్ వస్తోంటే వింటున్నాను నాన్నా" అన్నది శకుంతల.

"అప్పుడెలా వచ్చింది ? ఏ స్టేషను ?"

"టొరంటో నాన్నా"

అసలా స్టేషనుందో లేదో తెలీదామెకి. తనుముకుంటే నాన్న అనుమానపడతాడు. ఆయన నిజమేననుకున్నాడు.

తన గదిలోకొచ్చేసరికి శకుంతలకి రాత్రి జరిగిన సంగతిఅంతా జ్ఞప్తికి వచ్చింది. మరిచిపోదామంటే మరీ మరీ జ్ఞప్తికి వచ్చాయి తానాడిన మాటలు.

అతనెంత బాధపడ్డాడో! నిశ్చయంగా అతను తన నెరుగును. ఆ చనువు తీసుకున్నాడేమో! తానెంత కటువుగా మాట్లాడింది!-పాపం అతను చాలా సిగ్గుపడి ఉంటాడు.

ఆరోజంతా ఆమె నా జ్ఞప్తి వెంటాడుతూనే ఉంది. కనిపించిన ప్రతీయువకుణ్ణీ ఆమె పరీక్షిస్తూంది తన కిటికీవైపు తేరిపారి చూస్తాడేమోనని. ఊహూఁ. ఎవ్వరూ చూడలేదు. ఎవరిపనుల్లో వాళ్లు నిమగ్నులై ఉన్నారు.

ఏవో పుస్తకాలకోసం లైబ్రరీకి వెళ్ళింది. అక్కడ అందరినీ పరీక్షించింది-ఆమె భావనకి సరిపడే వాడెవడూ దొరకలేదు. పరధ్యానంగా పల్లులు వెదుకుతూ దేనికోసం తాను వెదుకుతూందో మరిచిపోయింది.

ఆ రోజల్లా ఆమెకి కలలో బ్రతుకుతూన్నట్టుంది. ఆ ప్రశ్న ఆమెని వేధిస్తూంది.

సాయంత్రం ఎనిమిదయేదాకా రేడియో ఉంచుకుని తరవాత తీసేసింది శకుంతల. "పోనీ పాపం! చదువు నా మూలంగా పాడయి పరీక్షు సంగీతం పాడితే నామీద ఏడుస్తాడు" అనుకుంది.

తొమ్మిదయేసరికి టెలిఫోను మోగింది.

"నూటపదహారు..." అంది శకుంతల.

"నమస్తే!"

తృళ్లిపడింది అమ్మాయి. ఆ గొంతుకే! మళ్ళా...

"నిన్నరాత్రి సంగీతానికి మిమ్మల్ని థాంక్ చేద్దామనిపించింది. పోయిన చదువు పోతే పోయిందిగాని, చక్కటి ఆర్కెస్ట్రాసుమండీ!"

శకుంతల చాలా సిగ్గుపడ్డది-ఇంత మోటుగా ప్రవర్తిస్తున్న అతనిమీద ఆమెకి కోపమూ వచ్చింది.

"ఇది చెప్పండి-మీ పేరేమిటి ?"

"ఏమైతేనేం లెండి ?-న్యూసెన్స్ కేసు పెట్టడానికా ?"

"పెట్టను లెండి. చెప్పండి"

"కేసు పెట్టకపోతే పేరెందుకు ? పోనీ 'ఎక్స్' అనండి"

"మీ ఇలెక్కడ ?"

"మీలాంటివారి జొన్నత్యాలక్రింద... దానికేం లెండి. ఈవేళ మీరు నన్ను డిస్టర్బ్ చెయ్యకూడదని నిశ్చయించుకున్నందుకు సంతోషం"

కోపంతో పెదవులు బిగబట్టి రిసీవర్ని

ఈరోజుల్లో వైద్యశాస్త్రం ఎంత అభివృద్ధి అవుతోందంటే శరీరంలోని ప్రతి అవయవంలోని ప్రతి భాగానికీ ఒక స్పెషలిస్టు ఉంటున్నాడు.

ఒకరోజున ఒక డాక్టరుకు పూర్వస్నేహితుడెదురై "హల్లో. ఈమధ్య నీపేరుకు డాక్టర్ అని తగిలించావే? డి. ఎస్. సి. పాసయ్యావా?"

"లేదు మామూలు డాక్టర్నే."

"అంటే ఎలాటి జబ్బుకైనా—"

"కాదు. స్పెషలిస్టుని."

"కన్నా, ముక్కా నోరా?—"

"ముక్కు స్పెషలిస్టుని."

"ఏ ముక్కు? ఎడమముక్కా, కుడిముక్కా?"

క్రిందపడవేసి, శకుంతల రేడియో పెట్టింది. సాధ్యమైనంత ఎక్కువ చేసింది వాల్యూమ్. రాత్రి పన్నెండుదాకా ఆపాటికి నిద్రపట్ట లేదు. ఆమె అది సహించింది-రేడియో మాత్రం కట్టలేదు.

మరునాడు ఉదయం కాఫీతాగి కూర్చునేసరికి టెలిఫోన్ పిలిచింది. రిసీవర్ తీసేసరికి మళ్ళీ అదే గొంతుక!

"రాత్రి సంగీతానికి థాంక్ చేద్దామని పిల్చాను"

తెల్లబోయింది శకుంతల. మరుక్షణమే తెలివితెచ్చుకుని "మీరు మీ పొటుతనానికి క్షమాపణ చెప్పేకగాని, నా రేడియో గోలచేస్తూనే ఉంటుంది-మీరు థాంక్ చేసినంత మాత్రాన రేడియో పెట్టడం మానేస్తానని ఆశ పడకబోకండి" అన్నది.

నవ్వు... "నేను పొటుగా ప్రవర్తించానా?"

"అక్షరాలా. చేతనైతే ఎదుటపడండి. ఎంత పొటుగా ప్రవర్తించారో చెప్తాను"

"మీ కంత కోపం ఎందుకూ? క్షమాపణ కావాలంటే ఇప్పుడే ఇచ్చేస్తాను"

"ఫోన్ క్షమాపణ అక్కర్లేదండి"

"నేరమైతే ఫోన్‌మీద చేశాగా?"

"అయినాను—"

"కాని నేను మీకు కనపడదల్చుకో లేదండి"

చికాకుగా రిసీవర్ పెట్టేసింది శకుంతల. అతనెవరో చూడాలనే కౌతుకం ఆమెకు రోజు రోజుకీ ఎక్కువౌతోంది. రోజూ ఈ టెలిఫోన్‌వల్ల తన ఆలోచనలు పెరిగిపోతున్నవి. కొంపతీసి, అతనీ ప్రసంగం ఏ ప్రణయానికీ నాందిగా ప్రారంభించలేదుగద?

తన ఆలోచనకి నవ్వుకుంది శకుంతల. "శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒక యువకుడు, ఒక యువతిని ప్రేమించాడట. అనుదినమూ ఫోన్‌ద్వారా ఆమె యోగక్షేమాలు తెలుసుకుంటూ ఉండేవాడట. కాని తానెవరో, ఎందుకలాగ చేస్తున్నాడో మాత్రం చెప్పేవాడు కాదట. సంవత్సరం ఇలాగ గడిచాక, ఆమె అతనెవరో తెలుసుకోలేకుండా ఉండలేక, 'నువ్వెవరైనా సరే, నాదగ్గరికి వస్తే వివాహమాడతాను' అని చెప్పిందట. తరవాత ఆ ఇద్దరూ పెళ్ళాడి సుఖంగా జీవిస్తున్నారు" అని ఒక వార్తపేపర్‌లో పడితే ప్రతీవాళ్లూ నమ్మకశారు. బహుశా ఈ యువకుడూ అలాటి పనేమీ చెయ్యడం లేదుగద?— అందులో పరీక్షలు కూడా అయిపోతే కావలసినంత తీరుబడి!

కాని, ఎవరితను?

* * *

రోజూ రాత్రిళ్ళు రేడియో పూర్తి వాల్యూమ్‌లో ఉంచుతోంది శకుంతల— ఈ గొడవ తగ్గించుకోవడానికి అతను వ్యక్తిపరంగా క్షమాపణ చెప్పుకుంటాడని ఆమె ఆశ.

ప్రతీరోజూ టెలిఫోన్‌లో అతనామెకి గతరాత్రి సంగీతానికి కృతజ్ఞత చెప్తున్నాడు.

"మీరీ రాత్రి సంగీతం పెట్టరని ఆశించవచ్చునా?"

"అలాటి ఆశేమీ పెట్టుకోవద్దు—వానికొక్కటే షరతు"

"నేను వచ్చి క్షమాపణ చెప్పాలా?"

"ఔను..."

టెలిఫోన్‌లో నవ్వు..."సారీ..."

"వెరీ సారీ..."

ఇదీ వరస. ఇలాగ పదిరోజులు గడిచిపోయాయి. ఆమె సంగీతం రాత్రంతా ఉంచుతోంది—ఈ మెసేజే వస్తూంది.

ఆ మరుసటి దినం శకుంతల సినీమాకి పోయింది. తిరిగొచ్చేసరికి టెలిఫోన్ ఒకే పనిగా అరుస్తోంది.

"నమస్తే శకుంతలాదేవి గారూ!"

"ఊం. ఏం?"

"అయితే మీరు పంతం వదలనంటారు?"

"మీరూ అంతే అంటున్నారుగా ?"

"మీ కింతకోపం ఉండకూడదండీ... నామాట విని ఈ రోజునుంచి గాత్రి నిశ్శబ్దం ఉండనివ్వండి."

జవాబుగా రేడియో సంగీతం టెలిఫోన్ లోంచి వెళ్ళింది.

"శకుంతలాదేవీ !"

"సంగీతం చాలేదా ?"

"నన్ను ఓడించారండీ !"

"సంతోషం"

"రేపు సాయంత్రం మీదర్శనం చేసుకో మంటారా?"

"చిత్తం"

శకుంతల కొక్కసారి సముద్రంలో మునిగినట్లుంది సంతోషంతో.

"ఎక్కడ ?"

"నదివడ్డుకి రండి 5 గంటలకి. లవర్స్ బెంచ్.."

"థాంక్యూ. సెలవు."

"సెలవు."

ఈ పదిరోజుల ఆట ఈనాటితో సరి! ఆరాత్రి సంతోషపు టుద్రేకంలో నిద్రే పట్టలేదు. ఇంత గ్రిట్ ఉన్న యువకుడిని లొంగదియ్యగలిగినందు కామె చాలా గర్వపడింది. మర్నాడు సాయంత్రం జరుగబోయే కథ నామె భావించుకుంది... అతను వినమ్రుడై క్షమాపణ చెప్తొంటే... పాపం! మగవాళ్ళు! అనుకుంది.

మర్నాడు తెల్లవారిన దగ్గరనించీ ఆమె సాయంత్రంకోసమే ఎదురు చూస్తోంది. రోజు మెల్లిగా నడుస్తోంది. సాయంకాలం వేసుకోబోయే దుస్తులను గురించి ఆమె ఆలోచిస్తూ ఎలాగో గడిపింది.

మూడున్నర అయిన దగ్గర నించీ ఆమె అలంకరించుకో సాగింది. "ఎందు కింత అలంకారం ?" అన్న అనుమానం ఆమెకి కలుగలేదు...తాను పొందబోయే మహా విజయగర్వంలో ఆమె మునిగితేలుతోంది.

సరిగ్గా అయిదు.

లవర్స్ బెంచ్ దగ్గరకి వచ్చింది శకుంతల. చుట్టూ చూసింది. ఒక చెట్టుక్రింద ఎవరో ఒక ముసలాయన కూర్చుని ఏదో చదువుకుంటున్నాడు.

వాచీ చూసుకున్నది. అయిదూ రెండు నిమిషాలు.

తానే అక్కడికి ముందువచ్చినందుకు సిగ్గుపడ్డది శకుంతల. 'వీళ్ళకి పంక్చువాలిటీ' అంటే తెలియనే తెలియదు. అని

గోణిగింది. కనుచూపు మేరలో ఆ ముసలాయన తప్పిస్తే ఇంకెవరూ లేరు.

కొద్ది నిముషాలామె అట్లానే నిల్చుంది. మధ్య మధ్య ముసిలాయన తన వంక చూస్తున్నాడని గ్రహించి ఒకచోట కూర్చున్నది. ఆయన ఎవరో పెద్ద ఇంటాయనల్లే ఉన్నాడు.

అతనింకా రాడేమిటి?

తనని ఫూల్ చేస్తున్నాడా?

చుట్టూ చూసింది శకుంతల మళ్ళా. ఎవ్వరూ రాడంలేదు. ఏదో ఆలోచిస్తూ ఎలాగో అయిదున్నర అయేదాకా గడిపింది. ఆ యువకుడి జాడలేదు.

'డామ్‌హిమ్' అని గట్టిగా అని వెళ్లిపోడానికి లేచింది శకుంతల కోపంగా.

ముసిలాయన అప్పుడు చేతులో ఉన్న పుస్తకం మూశాడు. "ఏమమ్మా అంత కోపంగా ఉన్నావ్?" అన్నాడాయన.

ఆమె నిజం చెప్పలేకపోయింది. "ఏమీ లేదండి. ఊరకనే వచ్చాను. తోచడం లేదు. చికాకు పుడుతోంది" అన్నది.

ఆయన చిన్న నవ్వునవ్వాడు. 'నీమాటలు అబద్ధం అని నాకు తెల్సులే' అనేట్లు, శకుంతల సిగ్గుపడ్డది.

"ముసిలివాళ్ళకి నిజం చెప్తే మంచే జరుగుతుందమ్మా. నాకు కొంచెం థాట్ రీడింగ్ వచ్చును. నీ పేరు శకుంతల కాదమ్మా?... సిగ్గుపడకు. అతనిక్కడికి రాడు." అని ఆగాడు.

ఆమె నిరాశగా చూసింది-దొరికిపోయాననుకుంది. ఈయనెవరో మహానుభావుడల్లే ఉన్నాడే!

"అసలు జరిగిన సంగతి చెప్పేదా?" అన్నాడాయన ఒక్క క్షణం కళ్ళు మూసుకుని. ఎక్స్‌రే తీస్తోన్నట్లు *Feel* అయింది శకుంతల.

"...అతనువస్తే ఏంచేస్తావు?" అన్నాడాయన కళ్లు తెరిచి.

"ఇంకెప్పుడూ అలా చెయ్యొద్దని చెప్తాను"

ఆయన మళ్లా నవ్వాడు. చిన్నగా "నిజంగానా?"

"ఔనండీ..."

"అతనంత అపరాధం ఏంచేశాడని? మీ రేడియో తనని బాధిస్తోందిగనుక నిన్ను కొంచెం వాల్యూం తగ్గించమన్నాడు. పెద్ద నేరం ఏమిటి చేశాడమ్మా?"

శకుంతల తల వంచుకున్నది.

"నాకు తెల్సునమ్మా. నువ్వు చాలా మంచిదానివని. అంతకోపం నీకు రానేరాదు. ఊరికేనే అతన్ని చూడాలనుకున్నావ్. కౌతుకం చాలా బలమైనదిగదూ మరి!"

"ఆయన ఎవరండీ?"

ముసిలాయన ఒక్కసారి ఆమెపైపు తన కళ్లు తిప్పి,

"అతన్నే. చాలా ముసిలాయనలే అమ్మా" అన్నాడు.

శకుంతల దెబ్బ తిన్నది....."ముసిలాయనా?" అన్నది.

"ఔనమ్మా..."

"పరీక్షకి చదువుతానన్నాడే?"

ఆయన పెద్దగా నవ్వాడీసారి...."అబద్ధంలే" అన్నాడు.

"ఎవరండీ ఆయన అసలు?"

"—నేనేనమ్మా..."

నిలువునా నీరైపోయింది శకుంతల. ఈయనా?...

"మీ ఇంట్లోనే క్రింది భాగంలో ఉంటున్నాం. మా అల్లుడింటికి వచ్చాను. వాళ్ళ రేడియో చెడ్డది. నాకు పన్నెండుదాకా నిద్ర పట్టదు. ఆ ఇంగ్లీష్ సింఫొనీలూ అవీ నాకిష్టం. అందుకని ఈ నాటకం వేశానమ్మా."

"నాతో చెప్తే..."

"పిల్లలమ్మ మీరు—పంతంతో ఏమన్నా చేయించగలం గాని, మంచిని అవునా!...నాటకంలా ఉందా?—ఏమనుకోవుగదూ?"

శకుంతలకి చాలా బాధగా ఉన్నది. పెద్ద దెబ్బతిన్నదానిలా తల దించుకున్నది.

"ముసిలాళ్ళమీద అంత కోపం అయితే ఎలామ్మా? కావలిస్తే నాతో దెబ్బలాడు. మా మనవరాల్లాగ చేశే..."

శకుంతలకి జరిగినదంతా తల్చుకోగానే నవ్వు వచ్చింది. ఇక ఆగలేక నవ్వింది గట్టిగా.

"రేపు వెళ్తున్నానమ్మా. అందుకే నీకు కనిపించాను. వెళ్దామా?" అన్నాడాయన లేస్తూ.

"పదండి" అని వెనకాల బయలుదేరింది. కొంచెందూరం వెళ్ళగానే సంభాషణ మొదలుపెట్టింది. ★

మేం పుణ్యం సంపాదించాం

(15-వ పేజీ తరువాయి)

విసుపోయాను. అలా వుండిపోయాను కొంతసేపు పరధ్యానంగా.

'ఏమండీ! చూడండి...చూడండి' మా ఆవిడ నన్నాపుతోంది.

కొత్తగా ఒక చిన్న గ్రామంలో పోస్టాఫీసు పెట్టారు. రెండు నెలలయినా ఆవూరినుంచి ఒక్క ఉత్తరం కూడా బయటికి పోలేదు. సంగతేమిటో కనుక్కుందామని పోస్టల్ ఇన్స్పెక్టరు తనిఖీకి వెళ్లాడు.

"రెండు నెలలయినా ఒక్క ఉత్తరంకూడా ఈ ఊవూరినుంచి పోలేదట నిజమేనా?"

పోస్టుమాస్టరు: — నిజమే సాబ్. ఇంత పెద్ద తపాలాసంచీ ఇచ్చారు. అది నిండందే పంపట మెందుకని ఊరుకున్నాను.

'చూడండి, అదిగో శివలింగం......ఆ మహాత్ముడెవరో దేవుడిదగ్గిరసా కూచోని.. ఆహా ఏమి అదృష్టం!'

'ఆహా చాలా అదృష్టం.' నేనూ శృతి కలిపాను.

'వెండిపళ్లెంలో పువ్వులు పెట్టి పూజిస్తున్నాడండి కేముట్టి.'

నా గొంతుకలో కరకాయ పడింది. అయినా, 'అవును, అతను మహాభక్తుడు మరి' అనేశాను.

ఆ మహాభక్తుడు పూజ అయిపోయాక పళ్ళెన్ని పక్కనపెట్టి సాష్టాంగపడ్డాడు. మాఆవిడదృష్టి ఆ వెండిపళ్లెంపైకిపోయింది.

'చూడండి ఆ పళ్లెం...అచ్చంగా మన దానిలాగే వుంది సుమండీ ఆ నగిషీ అదీనూ. తప్పుచేశాం. మనం కూడా పండూ కాయా మన వెండిపళ్లెంలో పెట్టి తేవలసింది ఏమంటారూ'

నేను గదల్లేదు. జవాబివ్వడానికి అంతకన్నా ప్రయత్నించలేదు. కాని చెప్పలేని ఉద్రేకం ఏదో నన్నమాంతంగా క్రుంగదీసింది.

'ఏమండీ, అలా కొయ్యబారిపోయారేం?'

అవును. ఒంట్లో ఓపికా, నెత్తురూ, యిగిరిపోయి మిగిలిపోయింది కొయ్య మాత్రమే.

'అయ్యో! దెయ్యంబట్టినట్టుగా చూస్తారేం ఖర్మ!'

దెయ్యంకాదు; సైతాన్; సైతాన్; పెద్దసైతాన్.

'మాట్లాడరేం గ్రహచారమండీ.'

'ఆ!...అదే...అదే...'

'ఏమిటది?'

'అది...ఆ పళ్లెం...వెండిపళ్లెం...'

'ఆ! ఆ!'

'అది మనదే...మందే ఆ పళ్లెం.'

'ఆ! మనదేనా అది?...మీ రెలా తెచ్చారుదాన్ని; నాతో చెప్పనైనా లేదే!'

'ఊహూఁ...'

'మరి అక్కడికెలా వెళ్ళింది?'

'అదుగో, ఆ మహాత్ముడు,...ఆమహాభక్తుడు...అతను తెచ్చివుండాలి.'

'మళ్ళ మన పళ్లెం అతనెలా తెస్తాడూ?'

'వాడికమ్మేశాను.'

'అయ్యో! అదెప్పుడూ?...'

'ఈ సాయంత్రం.'

'ఎందుకూ?...ఎంతకీ?...'

'ఎందు కేమిటి నీపూజకోసం...పది రూపాయిలికి.

'రామ, రామ, అంతవస్తువూ పదిరూపాయిలకేనా పోస్తా?'

'అంతే...అంతే యిచ్చాడు...కాలిపిస్తానన్నాడు...కరిగిన ముక్కోహాటి నా ముందు పడేశాడు. అంతా నీరసం, సత్తుకలిసిన వెండిఅన్నాడు. అంచేత ధర తక్కువన్నాడు. జోనో కాదో నని వాడిచ్చిందే పదివేలని పుచ్చుకున్నాను.'

'హరహరా! ఏంపాపమండీ...ఎంత ఘోరమండీ...'

'చాల్లే, మరిక్కడేమీ గోలపెట్టకు. నీపుణ్యముంటుంది.'

'నాతో చెప్పనైనా చెప్పారు కారేమండీ...'

'ఏదో అయింది ... నోరూమ్కుకొని పూగుకో గోలపెట్టక, ఎవరైనావింటే పరువుతక్కువ.'

'ఎప్పటికప్పుడు నానోరు నొక్కేస్తూనే వున్నారు. మీ యిష్టానుసారం జరుపుకుంటూనే వున్నారు ... అయ్యయ్యో! మళ్లీ యీ జన్మలో అలాంటి వస్తువు గడించగలమా మన తలెత్తి,'

'పోనీలే, వస్తువు గడించలేకపోయినా, పుణ్యం సంపాదించాంగద! జన్మానికో శివరాత్రే అన్నారు. మొక్కు చెల్లించుకున్నామని సంతోషించు.'

మతిపోయినట్టు నాకేసి చూస్తుంటే, చెయ్యిపట్టుకొని మెల్లిగా ఆలయం దాటించాను మా ఆవిడని. ★



విజ్ఞానవీధులు

"డాక్టర్"



43. ఘర్షణ విద్యుత్తు

ప్లాస్టిక్ దువ్వెన్నలతో తల దువ్వుకొన్న వెంటనే కాగితము ముక్కలూ, నూలూ మొదలగు చిన్న వస్తువుల నాకర్షించే శక్తి ఎలాగు వస్తుంది అని హైదరాబాదు నుంచి చాగంటి కపాలేశ్వరరావు గారడుగుతున్నారు.

గాజు కడ్డీని పట్టుతోగాని, ఫౌంటెన్ కలాన్ని ఫ్లానల్‌తో గాని రుద్దితే ఆ గాజు కడ్డీ, ఫౌంటెన్ కలమూ చిన్న చిన్న కాగితము ముక్కలనీ, సుద్ద పొడినీ, నూలునీ ఆకర్షిస్తాయి. ప్లాస్టిక్ దువ్వెనకి వచ్చిన శక్తికూడా అలాంటిదే. దీనిని "విద్యుదావేశము" అన్నారు. ఒక ఫౌంటెన్ కలాన్ని దారముతో (పందిరి మంచపు కర్రకి) వ్రేలాడగట్టి, ఫ్లానల్ గుడ్డతో పట్టుకుని ఒక కొసని రుద్ది వదిలిపెట్టండి. ఆ కలము ఆగగానే వేరె ఇలాగే రుద్దిన ఇంకొక ఫౌంటెన్‌కలము కొసని మొదటి కలము కొసవగ్గిరకి తీసుకురండి. రావణాసురుణ్ణి చూసిన సీతమ్మలాగ ఆ కొస దీనికి దూరంగా పోతుంది. అంటే రెండు ఒకే రకపు విద్యుదావేశాలు వికర్షించు కుంటాయన్నమాట—ఇలాగే గాజు కడ్డీలుకూడా వికర్షించుకుంటాయి. కాని గాజు కడ్డీకి ఫౌంటెన్‌కలము కొసని అందిస్తే రెండూ ఆకర్షించుకుంటాయి. భిన్న విద్యుదావేశాలు ఆకర్షించుకుంటాయి.

అయితే వీటికి ఏం పేర్లు పెట్టాలి? గాజు కడ్డీని రుద్దిన పట్టుగుడ్డకూడా విద్యుదావేశితమైనట్లున్నూ, అది ఫౌంటెన్ కలము మాదిరిగా, రుద్ది వేలాడదీసిన గాజు కడ్డీని ఆకర్షించినట్లున్నూ కనుక్కున్నారు. ఈ రెండూ వేరువేరే కాగితపు ముక్కల్ని లాగినవే. అయితే రుద్దిన పట్టుగుడ్డ చుట్టివున్న గాజు కడ్డీమాత్రము కాగితముక్కల్ని లాగలేదు! అంటే గాజు నావేశించిన విద్యుత్తూ, పట్టునావేశించివున్న విద్యుత్తూ చేరుకుంటే ఏ విద్యుత్తూ లేదు! వీటికి వేరెవేరే వుంటేనే ఉనికి. కలిస్తే ఫలితము సున్న. కనక గాజు నావేశించిన విద్యుత్తు 'ధనము'నీ రెండోది 'ఋణము'నీ అన్నారు.

ప్రతీ వస్తువులోనూ, అణువులోనూ, ధన విద్యుత్తూ ఋణ విద్యుత్తూ సమపాళ్ళల్లో వుంటాయి. ధన విద్యుదావేశితమైన వస్తువును మామూలు వస్తువు—కాగితము ముక్క అందాము – దగ్గరకు తెస్తే, ఆ ధనవిద్యుత్తుకి దగ్గరవుండడమువల్ల కాగితపు ముక్కలోని ఋణ విద్యుత్తు దాన్ని చూడడానికిలాగ చేరువకి చేరుతుంది. వెంటనే ఆ ధనవిద్యుత్తు ఈ ఋణాన్ని ఆకర్షిస్తుంది. అందుకనే దువ్వడములోని రాపిడివల్ల జనించిన ప్లాస్టిక్ దువ్వెన్న విద్యుదావేశము కాగితపు ముక్కల్ని లాక్కుంటుంది. జుట్టు కూడా విద్యుదావేశితమౌతుంది కొంచెం. కాని చెమట తడివల్ల తలకీ, మనద్వారా భూమికీ అందిపోయి మాసిపోతుంది.

విద్యుదావేశితమైన దువ్వెన, దానికి అడపా తడపా తగిలే గాలి కణాలకి తన విద్యుత్తును ఇచ్చేయడమువల్ల కొంతసేపటికి దాని ఆవేశము తగ్గిపోతుంది.

అయితే ఘర్షణవల్ల పుట్టిన విద్యుత్తు లోహాలమీద నిలవదు. అవి విద్యుద్వాహకములు. లోహపు కడ్డీని తోమినప్పుడు, దాన్ని పట్టుకున్న మన రెండో చేతిద్వారా విద్యుత్తు కాస్తా భూమికి చేరుకుంటుంది. ప్లాస్టిక్కూ, గాజూ, లక్కా వంటి పదార్థాలే విద్యుత్తుని ఒకచోట నిలవరించగలవు.

గాలితో ఘర్షణవల్ల మబ్బులు కూడా విద్యుదావేశితము లౌతాయి. మబ్బులోని విద్యుత్తు భూమికి చేరడమే 'పిడుగు'.

44. పొయ్యిబూడిద ఉపయోగము

"జోగి జోగి రాసుకుంటే బూడిద రాలుతుంద"నీ, "పడ్డశ్రమంతా బూడిదలో పోసినపన్నీరైపోయిందనీ" అనేరెండు సామెతలూకూడా బూడిద నిరుపయోగమైందనే అభిప్రాయం మన మనస్సుల్లో అనాదిగా పాతుకుపోయినట్లు వ్యక్తం చేస్తాయి. బూడిద నిజంగా అంత నిరుపయోగమైనదా? అంటే—కాదనే తేలుతుంది.

శాస్త్రవేత్తలు రసాయనిక విశ్లేషణ విధానాల నుపయోగించిచేసిన కృషి ఫలితంగా పొయ్యిబూడిద మిశ్రపదార్థమని తెలిసింది. దాంట్లో కొద్దిగా సోడియమూ—పోటాసియమూ, కార్బొనేటు ఫాస్ఫేటు లవణాలూ, కొంచెం ఎక్కువగా ఇసుకా, మొదలైన వన్నీ కలిసి ఉన్నట్లు రుజువైంది.

ఈ పదార్థము లెలా ఉపయోగిస్తాయో తెలుసుకోవాలంటే వ్యవసాయ శాస్త్రవేత్తలు కూలంకషమైన ప్రయోగముల వల్లా, అనుభవపూర్వకంగానూ కనుక్కొని నిర్ణయించిన విషయాన్నొకదాన్ని ముందుగా తెలుసుకోవాలి. వారి కృషివల్ల మొక్కలు బాగా పెరిగేటందుకూ, ఫలించేటందుకూ, వాటికి పోటాసియము, ఫాస్ఫేటు లవణముల సరఫరా తప్పకుండా అవసరమని తేలింది. ఆ కారణంవల్లనే వ్యవసాయశాఖ వారు పొలాల్లో సూరేకారాన్నీ, (ఇందులో పోటాసియముతోపాటు అవసరమైన నైట్రోజన్ అనే మరొక పదార్థంకూడా ఉన్నదనుకోండి) సూపర్ ఫాస్ఫేటునీ మోతాదు ప్రకారం ఎరువులుగా వాడాలని విరివిగా ప్రచారం చేస్తుంటారు. మనవారు పొలాల్లోకి పెంటతో బూడిదని కూడా కలిపి తోలడంకద్దు. కేవలం పరంపరాగతమైన ఈ ఆచారంలో ఉన్న విశిష్టత మనకీ శాస్త్రవేత్తల కృషివలన అవగతమౌతోంది.

వ్యవసాయదారులే కాకుండా ఆయుర్వేద వైద్యులుకూడా పొయ్యి బూడిద

యొక్క విలువ తెలుసుకొని వాడుతున్నట్లు తెలుస్తోంది. అన్ని రకముల మొక్కల బూడిదలోనూ, సామాన్యంగా బూడిదలో ఉంటాయని పైన పేర్కొన్న పదార్థాలన్నీ ఒకే ప్రమాణములో ఉండవు. అవి మొక్కల స్వభావాన్ననుసరించి కొంచెం ఎక్కువ తక్కువలుగా ఉంటూ వుంటాయి. కొన్నింటి బూడిదలో సోడియంపోటాషియము కార్బొనేటు లవణాల పాలు ఎక్కువ. మృదుక్షార గుణం వాటి రసాయనిక లక్షణాల్లో ముఖ్యమైంది. ఆ గుణంవల్లనే దానిని మోతాదుగా గజ్జి పొక్కులమీద పూతలా పూస్తే అవి త్వరగా పక్వానికివచ్చి చితికి చీము ఓడిపోతాయి. మోతాదు మీరినట్లయితే మాత్రం పుండవుతుంది. అందుచేతనే మృదుక్షార పదార్థాలున్న ఒలిబూడిదని, రాలిపోకుండా ఆముదంతో రంగరించి, గజ్జిపొక్కులకి పట్టించే చిట్కావైద్యము లోకాచారమైంది. ఆయుర్వేద వైద్యులు ఒలిబూడిదని రసాయన ప్రక్రియలవల్ల శక్తివంతమైన గాఢక్షార పదార్థాలను తయారు చెయ్యటానికి కూడా వాడారు. బూడిదని సున్నంతో కలిపి ఇనుప పెనంలో సలసలా కాచి వడియగట్టి మరీ చిక్కగానూ, మరీ పలచగానూ ఉండకుండా మరగగాచి వారు గాఢక్షారాన్ని తయారుచేసి (*History of Hindu chemistry. -P. C. Ray vol I pp. 2 o*) మొండి కురుపుల్ని దుంపనాశనం చెయ్యటానికి ఉపయోగించేవారు.

ఒలిబూడిదలోనూ, అంతకంటె చాలా ఎక్కువగా చవుడు లోనూ సోడియం కార్బొనేటు (చాకలిసోడా) ఉంటుంది. దాన్ని సున్నంతో కలిపి బట్టలకు పట్టిన మురికిని వదలగొట్టటందుకు వాడుతుండేవారు. రసాయనికంగా స్వచ్ఛమైన చాకలిసోడా చవుకగా తయారై అందుబాటవడంచేత చవుడువాడే ఆచారం ఇటీవల వెనకపట్టింది. కాని, సోడాకి ఎటామటే వచ్చినప్పుడు ఒలిబూడిదనీ, సున్నాన్నీ కలిపి చాకళ్లువాడడం ఇప్పటికీ ఉంది.


పొయిలో బూడిదకు మరొక క్రొత్త ఉపయోగాన్ని మన రసాయన శాస్త్రవేత్తల్లో ముఖ్యులైన కాళీపట్నపు కొండయ్యగారు ఇటీవల సాధించారు. ఆయన అరటి చొరుగు బూడిదలో పొటాసియము లవణాలు కొంచెం ఎక్కువగా ఉన్నాయన్న విషయాన్ని గమనించారు. వారి కృషివల్ల మొన్న మొన్నటివరకూ వృథా అయిపోతున్న అరటిచెత్త బూడిద పొటాసియము పెర్మాంగనేటు లవణాన్ని పారిశ్రామికంగా తయారుచేయడానికి ముడి పదార్థమైంది.

పొయిలో బూడిదనే కాకుండా ఎముకల బూడిదని కూడా రసాయన శాస్త్రవేత్తలు వదలలేదు. ఎముకల బూడిదలో కాల్షియము ఫాస్ఫేటు పాలెక్కువ. దాన్ని ముడిపదార్థంగా వాడి ఎన్నో రాసాయనిక పదార్థములను తయారు చేస్తున్నారు. వాటిలో సూఫర్ ఫాస్ఫేటు అనే రసాయనిక ఎరువూ, నరాల పుష్టికొరకు ఎల్లోపతివైద్యులు వాడే మందుల్లోని ముఖ్యపదార్థమైన కాల్షియము హైపోఫాస్ఫైటూ, నిత్యకృత్యాల్లో అందరికీ అవసరమైన నిప్పుపెట్టెల తయారీలో వాడే ఫాస్ఫరసూ పేర్కొనదగినవి.

బూడిదని గురించి ఇంత చదివిన తరువాత కూడా మీరు అది ఎందుకూ పనికి రాదంటారా? (హరి)

45 నెలవంక కొమ్ములు

శుక్లపాడ్యమీ విదియల చంద్రుణ్ని నెలవంక అంటాము. ఈ నెలవంక రెండు కొసల్నీ కొమ్ములంటాము. "ఈ కొమ్ములు ప్రతినెలా ఒకేవిధంగా ఉండకుండా తడవకొకరకంగా ఉండుటకు కారణమేమిటి?" అని జి. చినబాబుగారు-చీరాల



శుక్లవిదియనాడు చిన్న గుట్టఎక్కి సూర్యుడు అస్తమించిన చోటు గుర్తించండి. వెంటనే నెలవంకని చూడండి. నెలవంక కొమ్ముల్ని కలిపే 'కచ' అనే రేఖని సరిగా రెండుభాగాలు చేసే లంబరేఖని క్రిందికి గీశామనుకుంటే, అది 'సూ' అనే సూర్యుడు కుంకినచోటుని చూపిస్తుంది. ఇంకోనెల శుక్లపాడ్యమినాడు చూచినా 'విసూ' అనే రేఖ ఆనాడు సూర్యుడు కుంకినచోటే చూపిస్తుంది. భూమి సూర్యునిచుట్టూ తిరగడములో భూమి యిరుసు వంగియుండడము వల్ల ఏర్పడే దక్షిణాయనము, ఉత్తరాయనములవల్ల సూర్యుడు ప్రతీనెలా ఒకేచోట క్రుంకడు. సూర్యుని వెలుగుపడటమువల్లనే భూమికి కనిపించే చంద్రవంకకూడా సూర్యుడున్న చోటునిబట్టే కొమ్ములు మారి కనపడుతుంది.

"ఈ పొట్లం ఏమిటమ్మా ఇంత భద్రంగా దాచావు?"
"అందులో మా ఆయన జుట్టు కొంచెం జ్ఞాపకార్థంగా దాచానమ్మా."
"అదేమిటి? ఆయన శుభ్రంగా ఉండగానే?"
"ఆయన జుట్టంతా ఊడిపోయి బట్టతల అయిందిగా?

చిట్టి ప్రశ్నల జవాబులు

—వాననీరు భూమిమీద పడి మట్టిలోని ఉప్పులను కరిగించుకుని నదుల ద్వారా సముద్రములో చేరుతుంది. సముద్రంలోంచి (మంచి) నీరుమాత్రమే ఆవిరి రూపాన్ని నష్టమౌతుంది. అందువల్ల కాలము గడిచిన కొద్దీ సముద్రపునీరు వుప్పన అవుతుంది.

—పెద్దకెరటాలు రావడానికి సముద్రమీద వీచే గాలులూ, సముద్రము లోతుగా వుండడమూ కారణాలు. నదుల మీద వీచేగాలికి బలము తక్కువా, కెరటాల పెరుగుదలకి నదియొక్క అనువు అడ్డూను.

—శుక్రుని ప్రతిబింబిత ప్రకాశమే.

—మంచుగడ్డను ఊకతో కప్పివుంచుతే పైనించి వేడిని మంచుగడ్డకి అందనివ్వదు ఊక. అందుచేత మంచు కరగకుండా నిలుస్తుంది.

—ఘనపదార్థాలు బాగా కంపించకలవు. ద్రవపదార్థాలు అంత బాగా కంపించలేవు. అందువల్ల ఘనపదార్థాలు కిందపడితే అయినంత చప్పుడు ద్రవాలు పడితే కలగదు.

—పిప్పరమెంటులోని పంచదార కడుపులోకి వెళ్లినప్పుడు నీటిని ధారాళంగా కోరి, రక్తంలోంచి లాక్కుంటుంది. రక్తం నీటిని కోరుతుంది. అదే దాహం.

పాటలపిచ్చి

రాము—వయసు సుమారు ఇరవై. కాలేజీలో చదువుతుంటాడు
పాటలంటే తగని పిచ్చి.
గోపి—రాము తమ్ముడు, వయసు నాలుగు.
లక్ష్మి—వయసు సుమారు పద్ధెనిమిది. రాము భార్య.
విశాలాక్షమ్మ—రాము తల్లి. వయసు సుమారు నలభై అయిదు.
కాలం—ఒకనాటి రాత్రి
స్థలం—రాము స్టడీరూము.

(గది మధ్యను ఒక టేబుల్ వుంటుంది. దానిమీద ఒకవైపున టేబుల్ లైట్, యింక్ స్టాండ్, అలారం టైంపీస్ వుంటాయి రెండోవైపున ఒక బోత్తిపుస్తకాలు. టేబుల్ ఎదురుగా ఒక కుర్చీ వుంటుంది.)

(తెరలో)

నేను చదువుకోటానికి వెళ్ళుతున్నానే అమ్మా.

(ప్రవేశం రాము)

రాము: (కుర్చీలో కూర్చుని) పతలిక మర్ హై, తిర్ భి నజర్ హై, (పాడుతూ మధ్యలో పుస్తకం తెరిచి) *Every body continues in its state of rest or of uniform motion in a straight line unless*...మరలిరావో మనసు లేదో మన కధే మరతువో...(కూనిరాగం తీస్తాడు)... *Every body continues...nues...nues...every body...body*—ఛీ వెధవది! ఎంత చదివినా రాదేం? ఏం చేయాలి? చెప్పకపోతే మాస్టరు తిడతాడు. లేకపోతే క్లాసుకి నెళ్ళను. అమ్మయ్యో వా డెక్కడ టైగర్ వరదాచారిలాగు ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేమనిషి! వీల్లేదు, వచ్చితీరాలి. (పుస్తకం తెరిచి, ఒకమారు చదివి, మళ్ళీ పుస్తకం మూసి, కండ్లుమూసుకొని, త్వరత్వరగా)...

...*Every body continues in its state of rest...rest which.. is represented both in magnitude and direct!on...*

(ఆగి పుస్తకం చూచి) అయ్యబాబోయ్ ఒక్కమారే ఇక్కడనుండి *Parallelcg-ram law of velocities* లోకి వెళ్లిపోయాను! ఛ! ఛ! ఎంతకీ రాదు. (బిగ్గరగా) లక్ష్మీ...లక్ష్మీ...నిన్నే.....

కాస్తమంచినీళ్లు పట్టుకురా...
రావో నను మరచితివో
చెలిననుమరచితివో (పాడుతాడు)
(ప్రవేశం లక్ష్మి మంచినీళ్లగ్లాసుతో-)

శ్రీ వి. ఎ. ఎమ్. కౌండిన్య

లక్ష్మి: ఇదిగోండి మంచినీళ్లు తీసుకోండి ఎందుకలా చదువుకోకుండా పొలికేకలు పెడతారు?

రాము: (వినిపించుకోకుండా) హల్లో! లక్ష్మి వచ్చావా? (మంచినీళ్ళు తీసుకుని) తినటానికి ఏమైనా తే లేకపోయావ్ తియ్యగా-

లక్ష్మి: ఏము న్నాయండి ఇంట్లో తియ్యవి తినేందుకు?

రాము: ఏమీ లేదూ—లేకపోవడమేమిటి తప్పు తప్పు! పరమాపరాధంపన్నిచ్చుకోవాలి-

లక్ష్మి: (నవ్వుతూ) ఏం ఇచ్చుకోమంటారో చెప్పండి.

రాము:
ప్రేమ మిరాయీ తింటుంటే హాయీ
రావే మిఠారీ రాజాకశారీ ప్రేమమిరాయి-

లక్ష్మి: చాల్లెండి సరసాలు ఎవరయినా వింటే నవ్విపోతారు. చదువుకోండి. (అని దూరంగా వెళ్లి ఒకపుస్తకం చూస్తూ నేవెళ్తా నిలబడుతుంది.)

రాము: ఆ! పోతున్నావా?
పోదువో —
ఓ ప్రియతమా —
పయనమయే ప్రియతమ నను మరచి
పోకుమా.


లక్ష్మి: (మాటలాడకుండా గ్లాసు తీసుకుని గుమ్మంవైపు నడుస్తుంది.)

రాము: (తల గోక్కుని)
పలుకరాదటే—
పలుకరాదటే చిలుకా పలుకరాదటే

(తెరలోనుండి)

రామూ! ఏమిటా గోల? చదువుకో లక్ష్మి నువ్వొచ్చెసెయ్.

రాము: అబ్బ! చదువుకుంటున్నాను లేవే!



"రావో నను మరచితివో, చెలినను మరచితివో..."

(ఒక పది నిముషాలు దీక్షగా పుస్తకం చూసి చదువుతాడు ఇంతలో గోపి ఏదో తింటూ నవ్వుకుంటూ వస్తాడు—)

అరే! డింగరీ – ఏలరా నవ్వుచుంటివి? నోటిలో ఏమున్నదిరా? చెదరక చెదరక నోరు తెరువుమురా డింభకా – సాహసం శాయరా – దేవి కటాక్షిస్తుంది

(ఈ వింతధోరణికి భయపడి పిల్లవాడు కెవ్వన కేకవేసి ఏడుస్తూ పారిపోతాడు. వెనుకనుండి విశాలాక్షమ్మ ప్రవేశం)

రాము: (కళ్లు మూసుకుని) జై! పాతాళభైరవీ – రక్తనేత్రవు – జ్వాలాజిహ్వవు –

విశా: (నెమ్మదిగా) ఏమిట్రా నీగోల?

రాము: దేవీ! నాకీ పాఠం వచ్చేటట్లు అనుగ్రహించు.

విశా: (బిగ్గరగా) ఒరేయ్! పిచ్చిగాని పట్టిందా ఏమిట్రా. ఏమిటి ధోరణి? పిలిస్తే పలకవేమిరా? (భుజం పట్టుకుని ఊపుతుంది.)

రాము: (ఉలికిపడి) ఏమిటే నీగోల. చదువుకుంటూంటే. చూడు టైమ్ పదయిందప్పుడే. పోయి పడుకో—

విశా: ఓరి నీయిల్లు బంగారంగానూ. ఇదంతా చదువట్రా (నవ్వుకుంటూ వెళ్తుంది.)

రాము: తస్సదియ్యా! పాఠం వచ్చేటట్టు లేదు. ఇంగ్లీషు చదువుతా. అయినా ఎందుకీ శ్రమంతా? హాయిగా పండుకుని నిద్రపోక (దీపం ఆర్పటానికి చేయిచాచి తలుపువేపు చూస్తాడు లక్ష్మి ప్రవేశం. తటాలున తలుపుదగ్గరే ఆగుతుంది)

"మాటెన వేలనో ప్రణయ
సుందరి కౌతుక కండ్లలోని ఆ
లోచన లేమిటో హరిణ
లోచని, నీ చిరునవ్వులోని సం
కోచము లెందుకో కుసుమ
కోమలి, నీ మధురాధరమ్ములో
దాచుకొనంగ నేటికి సు
ధామయసూక్తి కళావిలాసినీ"

లక్ష్మి బాగానేవుంది మీ పాటల పిచ్చి! అయితే వుండండి (తెచ్చిన తమలపాకులు, వక్కలపళ్లెం టేబుల్ మీదవుంచి వెనక్కు వెళ్లి తలుపువద్ద నిలుచుంటుంది)

(తెరలో – బయట సినిమానుంచి తిరిగి వెళుతున్న జనంలోంచి పాట)

తలుపుతీయునంతలోన తత్తరమది ఏలనోయి
తాళుము కృష్ణా, కాస్తసేపు తాళుము
కృష్ణా—

రాము. ఏం ఇంకా అక్కడే నిలుచున్నావు? (లక్ష్మివైపు నడుస్తాడు)

(తెరలో)
తలుపుతీయునంతలోన
తత్తరమది ఏలనోయి

లక్ష్మి (నవ్వుతుంది)

రాము (లక్ష్మి భుజంమీద చెయ్యివేసి నవ్వుతూ) ఏడవలేకపోయాను తీయాట ష్మట (కి నూపరం తెలిసి అనూరి సేనా?– (లక్ష్మి తలుపు మూస్తుండగా తెర).

కృష్ణదేవరాయలవారి ఆస్థానంలోఉన్న పండితులు అసూయాపరులై, క్రొత్తగా రాజసన్మానానికై వచ్చిన కందుకూరి రుద్రకవిని పరాభవించవలెనని ప్రయత్నం చేశారట. చాలా కఠినమైన దుష్కరప్రాసతో కూడిన సమస్యలను యిచ్చి పూర్తి చేయవలసినదని సవాలు చేశారు. వాటిని అన్నింటిని కందుకూరి రుద్రకవిగారు వెంటనే పూర్తిచేసి పద్యాలు చెప్పారు. అప్పుడు రాయలవారు రుద్రకవికి ఉన్నతాసనం ఇచ్చి సన్మానించారు. అప్పుడు సభలోని అసూయాపరులగు పండితులను గూర్చి సరభసంగా (ఉద్రేకంతో), కొంచెం రసాభాసంగా, ఆ సభావిభవం యిలా వర్ణించాడు:–

ఉ॥ కొందరు పార్థుటెక్కెములు – గొందరు కాలుని వాహనంబులున్
గొందరు భైరవాశ్వములు – గొందరు యీశ్వర వాహనంబులున్
గొందరు కృష్ణజన్మమున – గూసిన ధన్యులు నెంచిచూడగా
నందర కందరే మరియు – నందర కందరె యందరందరే.

తా॥ కొందరు అర్జునుని జెండామీద ఉండేవారు అనగా కోతులవంటివారు. కొందరు యముని వాహనాలవంటివారు అనగా దున్నపోతులు. కొందరు భైరవుని గుర్రాలు అనగా కుక్కలవంటివారు. కొందరు యీశ్వరుని వాహనముల వంటివారు అనగా ఎద్దులవంటివారు కొందరు శ్రీకృష్ణుని జన్మకాలమందు కూసినటువంటివారు అనగా గాడిదెలనంటివారు. మొత్తముమీద అందరూ ఇంచుమించుగా సరిసమానులే

"ఒకసారి ఒక గొప్ప చిత్రకారుడు పువ్వుల బొమ్మలు వేశాడట. ఎంత వాస్తవికంగా వేశాడంటే వాటిని చూసి నిజమైన పువ్వులనుకుని కొన్ని వేలు, కొన్ని లక్షలు తుమ్మెదలు ఇంట్లోకి జొరబడి ఆ బొమ్మలమీద మూగాయట వాటిని తోలెయ్యటానికి ఎంతో కష్టపడ్డాడట"

"నేను నమ్మను,"

"ఏమిటి? అటువంటి ఆర్టిష్టులు లేరంటావా?"

"ఉండచ్చు. కాని అంత తెలివితక్కువ తుమ్మెదలుండవు"

బొమ్మరిల్లు

మతి మరపు

రచన: శోభిరాల

పూర్వ మొకానొక పురవరమ్ములో
లెక్కల మేష్టారొక్క డుండెను;
గత కాలమ్మున పూర్వీకుల చే
గణిత శాస్త్రమున కనుగొబడనీ

క్రొత్తసూత్రములు కని పెట్టాలని
కోరిక గలదా మేష్టరు గారికి
అందుచేత నతడను క్షణమ్మును
ఆలోచనలో మునిగి యుండును.

ఆసమయములో అన్ని విషయములు
అట్టేమఱచీ పోవుచు నుండును.
సాయంకాలం ప్రతి దినమ్మునూ
చల్లని గాలికి పొలాలమీదికి

కర్రను చేగొని షికారు పోవుట
అలవాటైనది ఆ మేష్టారికి.
షికారునుండి వచ్చిన వెంటనె
గదిమూలన తన కర్రను పెట్టీ

తానొక మంచముపై పవళించీ
ఆలోచనలం దోలలాడునిక.


ఒకనాడిట్లే షికారు పోయీ
వచ్చేసరి కాలోచన తట్టెను
దానితోడ కడు తన్మయుడై మది
తనసంగతి తానే మరచెను.

తత్క్షణమే తన చేతిలోనగల
కర్రనుతీసీ మంచముపై నిడి
తానుబోయి యా కర్రను పెట్టే
మూలకు చేరీ నిలబడి యుండెను.

ఇంతలోన నొక బాలకు డచటకు
గంతులు వేయుచువచ్చి తొందరగ
లెక్కల మేష్టా రేరీయని తా
నొక్క క్షణమ్మా నిలబడెనక్కడ.

మూలగనున్నా మేష్టారయ్యది
ఆలకించియును, ఆలోచన బడి
అదిగో మంచముపై నున్నారని తన
మంచముపై గల కర్రను జూపెను.

బాలుండాయన పలుకులు వింటూ
పరుగిడి పోయెను పకపక నవ్వుచు.



డాన్ క్విక్‌సెట్

పూర్వకథ

లామంచా అనే గ్రామానికి చెందిన డాన్ క్విక్ సెట్ అనే పెద్దమనిషి తానొక వీరుడుగా చెలామణీ కావాలనుకొని, శాంకో పాంజా అనే చదువురానివాణ్ణి తన బంటుగా చేసుకొని వీరవిహారాలకు బయలుదేరాడు. ఎవరో ఒక ఆడదాని మొహం చూచి ఆమెకు డల్‌సీనియా రాకుమారిఅనే బిరుదాన్ని తనమనస్సులోనే యిచ్చేసి, ఆమెను మెప్పించటంకోసమే తానీ ధర్మరక్షణమనే కఠోరదీక్షను స్వీకరించానని నమ్మాడు. ప్రథమ క్షేత్రయాత్రలో యీయనకు అన్నీ పరాభవాలే అయినాయి. ఇంటికి తిరిగివచ్చి వళ్లునయమయ్యాక మళ్ళీ ద్వితీయ యాత్రకు బయలుదేరి వెళ్లాడు.

ఒక రోజున వీళ్లిద్దరూ ఒక ఏటిగట్టుకు చేరారు. అక్కడ ఒక పడవ చెట్టుకు కట్టేసివుంటే డాన్ క్విక్ సెట్ గారు అందులో ఎక్కి కూర్చొని శాంకో పాంజానుకూడా పడవ ఎక్కమన్నాడు. వాడు అయిష్టంగానే పడవ ఎక్కాడు. ఆ పడవ ప్రవాహంలో కొట్టుకొని పోయిపోయి, ఒక మిల్లు చక్రాలమధ్య యిరుక్కోవటానికి సిద్ధమైంది. రాబోయే ప్రమాదాన్ని గుర్తించిన మిల్లు యజమాని ఎలాగో నలుగురు మనుష్యుల సహాయంతో పడవలోవున్న వీళ్లిద్దరినీ కాపాడాడు. పడవ పాడుచేసినందుకు పల్లెవాళ్లకు నష్టపరిహారం చెల్లించుకొని ఆస్వామీ, బంటూ మళ్లీ బయలుదేరారు.

లోగడ డాన్ క్విక్ సెట్ గారు తాను జయించబోయే దీవుల్లో ఒకదానికి శాంకో పాంజాను గవర్నరుగా చేస్తానన్నాడు. వాడా మాట నమ్మి ఆరోజుకోసం ఎదురు చూస్తున్నాడు.

15

నౌకావిహారం ఆతీరుగా ముగిశాక డాన్ క్విక్ సెట్ గారు విషణ్ణ హృదయులై ఎక్కడికో అంతులేని ప్రయాణం చేశారు. ఆ ప్రయాణంలో ఆయన, ఆయనగారి బంటూ అడవి అంతా దాటి, మైళ్లతరబడి వ్యాపించివున్న ఒక మైదానంలో తేలారు.

అక్కడ ఒకచోట కొందరు మనుష్యులు గుంపుగా కూడి, పెంపుడు గద్దలను ఎగరేసి పందేలు కాస్తున్నారు. ఆరోజుల్లో భాగ్యవంతులైన వారు యీ మాదిరి వ్యాసంగాలతో కాలం గడిపేవారు. ఈ క్రీడలలో ఆడవాళ్లు కూడా మొగవాళ్లతో సరిసమానంగా యీ పందేలలో పాల్గొనే వాళ్లు. ఇప్పుడు డాన్ క్విక్ సెట్ గారి కంటపడిన ఆ మనుష్యుల గుంపులో కూడా ఎవరో ఒకామె వున్నది. బాగా స్థితిమంతురాలల్లే వున్నది. చాలా అందమైన దుస్తులు ధరించి వున్నది; రవ్వలు పొదిగిన నగలు పెట్టుకొన్నది; పాలమీది నురుసులా పరిశుద్ధమైన తెల్లని మేనిఛాయతో విరాజిల్లుతున్న వుత్తమ జాతి అశ్వాన్ని ఎక్కి, తన ఎడమ చేతి మణికట్టుమీద పెంపుడు గద్దను నిలబెట్టుకొని, దానివంక అతి వయ్యారంగా చూస్తున్నది. ఈ అన్ని లక్షణాలు చూశాక, డాన్ క్విక్ సెట్ గారు యీామె ఎవరో చాలా గొప్పయింటి ఆడపడుచు అయివుండాలని నిరూపించుకొన్నాడు. శాంకో పాంజా వైపుకు తిరిగి——

"శాంకో! అశ్వము నెక్కిన ఆ యిల్లాలిని చూచితివా! సత్వరమే ఆమెకడ కేగి, వీరకేసరి డాన్ క్విక్ సెట్ గారిందు ఏతెంచి యున్నారనియు, ఆమె సమక్షమున కేతెంచి ఆమెపట్ల నాకు అవ్యాజముగా ఏర్పడిన గౌరవ భావమును వ్యక్తపరుప వేగిరపడుచున్నాననియు, సవినయముగా విన్నవించి రమ్ము" అంటూ ఒక వుత్తరువు వేశాడు.

శాంకో పాంజా, స్వామి చెప్పిందే తడవుగా గాడిద మూపునుంచి దిగి, జంకూ గొంకూ లేకుండా ఆమెదగ్గరకు వెళ్లి ఆమెగారి పాదాలదగ్గిర మోకరిల్లి——

"అమ్మగారూ! అల్లదే అక్కడ గుర్రమెక్కి వున్న ఆ వ్యక్తి ప్రపంచఖ్యాతి పొందిన వీరకేసరి డాన్ క్విక్ సెట్ గారు. నేనాయనగారి బంటును; నన్ను మాచుట్టూ వాళ్లందరూ శాంకో పాంజా అంటారు—— నాపేరు ఏదైతే ఏమిలెండి! —— ఆ వీరకేసరిగారు తమకు మీపట్ల అవ్యాజంగా కలిగిన గౌరవ భావాన్ని వ్యక్తపరుచుకొనేందుకు అనుమతించి అవకాశమివ్వ

మూలం: సెరివాన్‌టెజ్ ★ అనువాదం: శ్రీ విశ్వాత్ముల నరసింహమూర్తి

వంపిందిగా నాద్వారా మిమ్ములను వేడుకొంటున్నారు. ఇంతే నా మనవి." అంటూ తన దూత్యం ముగించాడు.

ఈమాటలు విని, ఆవిడ చాలా ఆప్యాయంగా చిరునవ్వులు నవ్వుతూ "మీ యజమాని అంటున్నావే— ఆ డాన్ క్విక్‌సెట్ గారి గురించేగా యిటీవల పత్రికలలో పడుతున్నాయి ? ఆయన గారేదో అతి సాహసకార్యాలు చేశారనీ, ఆవిడ ఎవరూ— ఆ— 'టొబోసో' రాజ్ఞి 'డల్‌సీనియా' కన్యను యీయన ప్రేమించాడనీ పత్రికలలో చదివినట్లు గుర్తు. ఆ డాన్ క్విక్‌సెట్ గారేనా యీయన ?" అంటూ ఎంతో ఔత్సుక్యంతో అడిగింది.

ఆవిడ ఒకటి తరువాత ఒకటిగా అలాంటి ప్రశ్నలు అరడజనూ కురిపిస్తుంటే శాంకో పాంజా అన్నిటికీ ఔనన్నట్లు బుర్ర తెగ ఆడించాడు.

ఇప్పుడు తనను చూడవచ్చిన ఆ వ్యక్తి డాన్ క్విక్‌సెట్ గారే నని ఆవిడగారికి రూఢి అయ్యాక "అయితే చప్పనపోయి, నేనూ 'డ్యూక్' గారూ కూడా (ఆవిడగారి భర్త) డాన్ క్విక్‌సెట్ గారిని హృదయ పూర్వకంగా ఆహ్వానిస్తున్నామని చెప్పు. మా దేవిడీ ఇక్కడకు దగ్గరలోనే వున్నది. కనుక ఆ డాన్ క్విక్‌సెట్ గారంతటివారు మా ఆస్థానానికి రావటంకంటె మాకు ఆనంద దాయకమైన విషయం మరొకటి వుండబోదని నా మాటగా మీ యజమానితో చెప్పు" అన్నది.

శాంకో పాంజా చంకలు ఎగరేసు కొంటూ మళ్లీ తన యజమాని వద్దకు వచ్చి, డాన్ క్విక్‌సెట్ గారికి ఆ విషయాన్నంతా ఎరుక పరిచాడు. అక్కడ వాడా పని చేస్తుండగా, యిక్కడ, యీవిడ తన భర్త అయిన ఆ 'డ్యూక్' దొరగారి వద్దకు వెళ్లి యిలాగు ఫలాని వీరుడు తమ యింటికి రాబోతున్నాడని చెప్పింది. అసలు ఆవిడ తత్వతః చాలా సరదా అయిన మనిషి. ఆవిడకు వేళాకోళాలు అన్నా, వినోదాలన్నా బలే యిష్టం. ఎవరినైనా ఏడిపిస్తూ వుండటం అన్నిటికంటె ఎక్కువ యిష్టం. ఈ వీరుణ్ణి యీయనగారి బంటును కాస్త వుబ్బేస్తే, వాళ్లు ఏవేవో కబుర్లు కథలూ చెప్పుతారు కదా, అవి వింటూ కొంత కాలక్షేపం చేయవచ్చునని యీవిడ ఆశపడ్డది.

అందుకే డాన్ క్విక్‌సెట్ గారిని అంత మన్నిస్తున్నట్లు, ఆయనగారి పాదధూళి సోకినంత మాత్రంచేత తమ గృహం పావనమై పోతుందనే టంతటి గౌరవభావం తనకు ఆయనపట్ల వున్నట్లు, యీవిడ శాంకో పాంజాను నమ్మించి చెప్పింది.

డాన్ క్విక్‌సెట్ గారికి యీవిడగారి వుద్దేశాలు ఏమీ తెలియవు. ఆయన ఎప్పుడూ కూడా మనుష్యులు అన్న మాటలే లెక్కచేస్తాడు కానీ, ఆ మనుష్యులు ఆయామాటలు మాట్లాడే టప్పుడు వాళ్లవాళ్ల మనస్సుల్లో ఏవే వుద్దేశాలు పెట్టుకు మాట్లాడి వుంటారో, అదంతా కనుక్కోవాలని కానీ, అలా కనుక్కోవలసిన అవసరం వుందని కానీ అనుకొనే తరహా మనిషి కానేకాదు. ఆహ్వానం అందినదే తడవుగా బయలుదేరి, ఆమె సమక్షంలోకి వచ్చి సైనిక వందనాది కాలుచేశాడు. ఆవిడకూడా ఆ వందనాలను, వగైరాలను అందుకొని, ఎంతో ఆప్యాయంగా ఆయనను వెంటబెట్టుకు వెళ్లి తన భర్తతో పరిచయం చేసింది. ఆయనగారు కూడా యీ వీరుణ్ణి చాలా గౌరవిస్తున్నట్లే కనబడ్డారు. పొపుడు గద్దల పందేలన్నీ చప్పున ముగించేసి ఆ డ్యూక్ దంపతులు యీ



వీరకేసరిని వెంట బెట్టుకొని తమ దేవిడీకి తీసుకు వెళ్లారు.

దేవిడీకి పోయే దశలోనే శాంకో పాంజాగాడికి ఆ జమీందారిణి గారితో గొప్ప చనువు ఏర్పండి పోయింది. ఆవిడగారు చాలా సరదా కలమనిషి అని చెప్పానుగా. చదువూ సంస్కారమూ లేని యీ శాంకో పాంజాగాడు మాట్లాడే మాటల్లోనూ, చూచే చూపుల్లోనూ, నడిచే నడకల్లోనే ఏదోచమత్కారం వున్నట్లు ఆమెకు తోచింది. అందుకనే వాణ్ణి ఒక పెంపుడు కుక్కను చూచినంత మురిపెంగా చూసింది. దారి పొడుగునా ఆవిడగారు వీణ్ణి తనతో పాటే వుండమని కోరింది. అప్పుడు వాడు మాట్లాడిన మాటల్లో ఏవో ఒక వింతరకమైన వేదాంతం వాడికి వున్నట్లు జీవితాన్ని గురించి నాలుగైదు పసందైన సిద్ధాంతాలు వాడిలో, జీర్ణించి వున్నట్లు ఆవిడ అర్థం చేసుకొన్నది. అంతటి గొప్పయింటి వ్యక్తి — అందులోనూ ఆడమె — యిలా తనవంటి చదువురాని వాణ్ణి సమాదరించి సంభాషిస్తున్న దంటే శాంకో పాంజాకు చాలా సంతోషమైంది. ఆ సంతోషంతో వాడు ఎక్కడా ఆగకుండా ఫ్రాపైనా తీసుకో కుండా, కామాలు, ఫుల్ స్టాపులు సరిచూసుకో కుండా ఏమి టేమిటో ఒకటే ధోరణిలో కబుర్లు చెప్పుకుపోయాడు. ఆధోరణిలో కోకొల్లలుగా సామెతలు వాడేశాడు. చదువురాకపోయినా వీడికి వచ్చిన సామెతలకు అంతు అన్నది లేదని పించింది. సామెతమీద సామెతగా, సామెతల వర్షమే కురిపించాడు.

దేవిడీ యిక కొద్దిదూరంలో వుందనగానే 'డ్యూక్' గారు తమ గుర్రాన్ని వేగంగా పోనిచ్చి, దేవిడీకి ముందుగా చేరుకొని, వీరకేసరి డాన్ క్విక్ సెట్ గారి ఆగమన సందర్భంలో ఆయనకు అనుచితమైన సత్కారాదులు చేయటానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేయించారు.

వీరకేసరి డాన్ క్విక్ సెట్ గారు, శాంకో పాంజా తదితరులు దేవిడీ మొదటి ప్రహారీదాటి లోపలికి వచ్చేసరికి, ఎక్కడినుంచో మించుబోడులు యిద్దరు దబదబా వచ్చి, పట్టుశాలితా ఒకటి అతి వయ్యారంగా తెచ్చి, యీ వీరకేసరి భుజాలమీద కప్పారు. ఈ క్రతువు ముగిసేలోగానే ఆ నెరాబా నెరబా అంతటా దాసదాసీ జనాలు బిల బిలావచ్చి, బారులుతీర్చి నిల్చొని "భీకరానన వీర శూరాగ్రేసరా! వీరకేసరీ! వీరకంఠీరవ! స్వాగతం! సుస్వాగతం!!" అంటూ కైవారాలు పలికారు.

వారందరి వదనాలను వీరకేసరి ఆనంద ఘూర్ణిత నేత్రాలతో విలోకిస్తూ వారిపై తన కేర్పడిన వాత్సల్య భావాన్ని తన చూపులద్వారా వ్యక్తం చేశాడు.

మరొక విడత దాస దాసీ జనముందుకు వచ్చి యీ వీరుడు, డ్యూక్ దంపతులు నడుస్తున్నంత మేరా, పన్నీటి జల్లులు కురిపించారు; వారిపై సుంగంధ పరిమళ జలాలు చిలుకరించారు.

ఇదంతా చూస్తుంటే డాన్ క్విక్ సెట్ గారికి తన జన్మసార్థకమైనట్లు తోచింది. వీరుల వర్గానికి చెందిన వ్యక్తులకు ఏ ఏమాదిరి గౌరవాలు జరగాలని తానింత కాలమూ కోరుకొంటూ, కలలు కంటూ వున్నాడో, అవన్నీ అంతకు రెండితలు మిక్కుటంగా తనకే జరుగుతూవుంటే ఆయన మనస్సు ఆనంద సాగరంలో తేలియాడింది. ఆవిధంగా ఆయన యీ విధమైన అతిథి సత్కారాలతో వుబ్బి తబ్బిబ్బు అవుతుంటే, ఆయనను డ్యూక్ దంపతులు జరీతెరలు వేలాడగట్టివున్న మెట్లమీదుగా మేడమీదికి నడిపించుకుపోయి, విశాలంగావున్న ఒక పెద్ద హాలులో నిల్చొబెట్టారు. హాలులో ఎక్కడ చూచినా నిలువుటద్దాలు. గోడలమీద గొప్ప గొప్ప వర్ణచిత్రాలు. ఇవన్నీ చూస్తుంటే ఆయన కళ్లు తిరిగాయి. ఇంతలో అరడజను మంది అంగనలు వచ్చి, యీయన చుట్టూ మూగి, అతి వయ్యారంగా వొంగి, యీయనవొంటి పైగల వుక్కు కవచాన్ని కాలి దట్టింపులను అతి సుతారంగా వొలిచివేయటం మొదలు పెట్టారు. ఒంటిపైవున్న బరువునంత వాళ్లు తీసేశాక, డాన్ క్విక్ సెట్ గారు ఆపట్టుశాలితాను భుజాలపై నుంచీ వేసుకొని రొమ్మునను కప్పుకొన్నాడు. కత్తిని మాత్రం వదలెయ్యకుండా నడుముకే అంటకట్టు కొన్నాడు. నెత్తిమీద ఆకుపచ్చని మొఖమల్ టోపీ పెట్టు కొన్నాడు. ఈయనగారి యీ ముస్తాబు అంతా పూర్తి అయ్యాక, ఆ అంగనలు నాట్య విన్యాసాలు చేస్తూ యీయనను మరొక హాలులోకి నడిపించుకు

పోయారు. అది డ్యూక్ గారి భవనంలో భోజనాల సావిడి. అప్పటికప్పుడే అక్కడ నలుగురు మనుష్యులకు బల్లలమీద తెల్లటి దుప్పట్లుపరిచి పళ్ళేలలో పంచ భక్ష్యపరమాన్నాలు వడ్డించి వున్నాయి.

మూడు కుర్చీలలో వరసగా డ్యూక్ దంపతులూ, వీరకేసరి గారు కూర్చొన్నారు. నాలుగో కుర్చీలో 'డ్యూక్'గారి ఆస్థాన పురోహితుడు శాబోలు — ఆయన వచ్చి కూర్చొన్నాడు. డ్యూక్ దంపతుల మాట అలావుంచినా, దేవిడీలోవున్న దాస దాసీలలో ప్రతి ఒక్కరూ యీ వీరుణ్ణి అంత గౌరవంగా చూస్తూవుంటే యీ పురోహితుడు ఒక్కడు అదేమిటో కానీ, యీయనవంక కొరకొర చూడటం మొదలు పెట్టాడు. వాడి ఆచూపులు చూస్తేనే, డాన్ క్విక్ సెట్ గారికి వొళ్లు మండు కొచ్చింది.

డ్యూక్ భార్యకి శాంకో పాంజా పైన అవ్యాజంగా కుదురుకు పోయిన ఆ వాత్సల్యంకొద్దీ, ఆవిడ వీణ్ణి ఏదో బంటులాగా చూడక, తనతోపాటు అక్కడే వుండమని కోరింది. తామందరూ మాట్లాడు కొనే మాటల్లో వాడుకూడా ఏదో ఒకటి మాట్లాడేటట్టు చేయటానికి ఆవిడ చాలా ప్రయత్నించింది కూడాను. ఆవిడ యిచ్చిన ఆ ఆసరానందుకొని వాడు వసపోసిన పిట్టలా ఒకటే వాగుడు వాగాడు. వాడు ఆతిరున ఎంతకీ ఆగకుండా ఏమేమిటో చెప్పుకు పోతుంటే డాన్ క్విక్ సెట్ గారికి చిరాకు ఎత్తుకు వచ్చింది. గుడ్లు పెద్దవిచేసి వాణ్ణి గదమాయించ బోయాడు.

ఇంతలో యీ విషయాన్ని కనిపెట్టిన డ్యూక్ భార్య, యీయనగారి ధోరణి మార్చాలని "అయితే డాన్ క్విక్ సెట్ గారూ—మీరీ మధ్యను డల్ సీనియా కన్యను గూర్చిన కబుర్లు ఏమీ వినలేదా?" అంటూ అడ్డువచ్చింది. డాన్ క్విక్ సెట్ గారు యీవిడ అడుగుతున్న యీప్రశ్న వినికూడా, శాంకో పాంజా గాడి మీద ఆయనకు వచ్చివున్న కోపాన్ని వెంటనే దిగమింగుకోలేక, ఆవిడకు వెంటనే ఏ సమాధానమూ యీయలేక గుటకలు మింగుతున్నాడు. ఆవిడ అది కూడా గమనించి, ఎలాగైనా సరే ఆయనకు శాంకో పాంజామీద వచ్చినకోపం తగ్గించి తీరాలన్న పంతం కొద్దీ "ఏమండీ! ఎందరెందరు రాక్షసుల తలకాయలను తెగకోసి ఆవిడ పాదాలముందు పడవేశారో ఆవిషయాలన్నీ మాకు వినిపించరూ?" అంటూ ప్రతిమాలింది.

డాన్ క్విక్ సెట్ గారికి వచ్చిన కోపం అప్పటికి కొంచెం సర్దుకొన్నది. కోపమైతే సర్దుకొన్నది కానీ ఆయన మనస్సు మాత్రం తేలికపడింది కాదు. కాక పోగా—గుండె బరువెక్కి పోయింది. వేడి నిట్టూర్పులు విడుస్తూ—

"అమ్మా! తమరు అప్రయత్నముగా నా మనస్సును కలవరపరచు విషయమును ప్రసక్తి తెచ్చుచున్నారు. నా దౌర్భాగ్యమును ఏమని చెప్పుదును? నే నెందరినో రాక్షసులను, భూతప్రేత పిశాచాదులను మదాంధులైన మానవాధములను పరిమార్చితిని. ఆమాట యథార్థమే! కానీ—నా వీర విహారములను, విజయోత్సాహములను ఏ అనన్య రూపసి డల్ సీనియా రాకుమారికి విన్నవించ వలెనని నేనింత కాలముగా వుత్సహించు చుంటినో, ఆ డల్ సీనియా రాకుమారినే, మాత్సర్యము పూనిన మాంత్రికుడెవడో మార్చి వేసి నాడు.. హా!.. ఆ అందాలరాణి నేడా ముష్క రాధముని మంత్ర ప్రభావమున ముదినాపసానియై వికార రూపమున పల్లెసీమల పట్టి తిరుగుచున్నది... నా యదృష్ట మీ రీతిగానుండ ఎవరినెంత నిందించి మాత్రము ఏమి ప్రయోజనము?" అంటూ దిగులుగా నిట్టూర్చాడు.

సంభాషణ యీ దశకు వచ్చేసరికి 'డ్యూక్' గారు తాను కల్పించుకొని శాంకో పాంజాను పేరు పెట్టి పిలిచి "మాంత్రికుడు మార్చివేసిన ఆ ముగ్ధను నువ్వుకూడా చూశావా?" అని అడిగారు.

"ఆఁ! చూచావా అని అడుగుతున్నారా? చూశాననే చెప్పాలి సుమండీ. అదేమిటో ఆవిడ నాకంటికి ఎంత వికారంగా కనిపించిందంటే,— అంతకంటే వికృతమైన ఆడది యిక పుట్టబోదని పించింది. అది కాదండీ — డ్యూక్ గారూ; ఆవిడ ఆగాడిద మీదకు ఎగిరి కూర్చోవటం అదీ చూస్తుంటే నాకు పరమ అసహ్యం వేసిందంటే నమ్మండి."

ఇంతవరకు నిరాఘాటంగా సాగిపోతున్న యీ సంభాషణ ధోరణిని ఆ పురోహితుడు ఎంత

(42-వ పేజీ చూడండి)

గుమ్మడికాయల దొంగ

అనాటి నుండీ నాకు మా తెలుగు మాస్టారంటే మహా కోపంగా వున్నది. (నాకైతే వచ్చిన మార్కులు పెద్ద బండిసున్నాయే ననుకోండి.) అయితే మాత్రం! ఆయన అడగదలుచుకొన్న ప్రశ్న ఏదో సరిగ్గా అడగకూడదూ? సరిగ్గా అడిగితే నాకు తెలియదని నిక్కచ్చిగా చెప్పేసేవాణ్ణి కదా! అయ్యొయ్యో! నన్ను అనవసరంగా నలుగురిలో నవ్వులు పాలుచేసేశాడే ఆయన!

శ్రీ ఆర్. వి. ఎస్. శ్రీరామమూర్తి

ఈ గొడవ అంతా అలా వుంచండి, అసలు సంగతి చెప్తాను.


ఆ వేళే మా బడి తెరిచారు. నేను ఫోర్తుఫారం ప్యాసు అయి, ఫిఫ్తు ఫారంలో ఓం ప్రథమంగా అడుగు పెట్టేరోజు అదే. స్కూలు మామూలుగా పదిగంటలకే కదా! తొమ్మిది మూపావు అయ్యేసరికి భోజనం అదీ పూర్తి చేసుకొని యిస్త్రీ బట్టలు అవీ కట్టుకొని, తలా అదీ దువ్వుకొని నాకు తీరుగా తయారై వీధిలో కాలుపెట్టాను; బడికి పోదాంకదా అని. ఎవడో మహానుభావుడు, వాడిసొమ్ము ఏదో పోయినట్లు, సరిగ్గా అప్పుడే 'ఆఛ్ఛి' అని తుమ్మేశాడు.

నాకు ముందుకు పోవటానికి మనస్కరించ లేదు. మళ్లీ యింట్లోకి వచ్చి కాళ్లూ అవీ కడుక్కొని, కాసిని మంచినీళ్లు తాగి, ఓ రెండు నిముషాలు అక్కడే కూలబడి, మళ్ళీ బయలుదేరాను.

ఇవన్నీ అయి, నేను క్లాసు రూముకు వెళ్లేసరికి అప్పటికే ఐదు నిముషాలు ఆలస్యమైంది. అయిన ఆలస్యం ఎలాగూ అయిందికదా, ఏం చేస్తాం లెమ్మని క్లాసులోకే వెళ్లాను.

నేను క్లాసులో అడుగు పెట్టేసరికి మా తెలుగు మాస్టారు ఓ విద్యార్థిని ఏదో ప్రశ్న అడుగుతున్నారు. ఆ విద్యార్థికి సమాధానం తెలియలేదల్లే వుంది; గోడవైపు పూరికే చూస్తూ నిలబడి వున్నాడు. నేను పోయి నా సీట్లో కూర్చొన్నాను.

ఆ విద్యార్థి ఎంతసేపటికీ సమాధానమూ చెప్పకుండా, ఆగోడ మీదినుంచి చూపులు మరలించుకోకుండా వుంటే, నాకేమిటో ఆశ్చర్యంవేసి, ఆగోడమీద ఏంవున్నదోనని నేనూ చూశాను. దానిమీద "చీంబోతు" అని వ్రాసివున్నది. నాకు నవ్వువచ్చింది. ఎవరు వ్రాసి వుంటారాఅని ఆలోచిస్తూవున్నాను. ఆధ్యాసలోనే పడి వున్నానేమో, అవతల మాస్టారు ఒకటి రెండు





ఆ రోజు మా పాఠశాల వార్షికోత్సవం. మంత్రిగారు అధ్యక్షత వహించి, పోటీల్లో గెలుపు పొందిన వారికి బహుమతులిచ్చారు. తర్వాత ఉపన్యాసం మొదలు పెట్టారు:

"మానవుడికి అన్నిటి కంటే ముఖ్యమైనది విద్య. 'విద్యలేని వాడు వింత పశువు' అన్నారు పెద్దలు. ఉదాహరణకి గణిత శాస్త్రం తీసుకోండి! గణిత శాస్త్రం అంటూ లేకపోతే రెండు యిదులు పది, నాలుగార్లు ఇరవైనాలుగని, తొమ్మిది పధ్నాలుగులు... తొమ్మిది పధ్నాలుగులు ...ఏ ..ఏ... ఎంతవుతుందో మనకి తెలియదు. అల్లాగే భూగోళ శాస్త్రం తీసుకోండి..."

సార్లు పిలిచినా నాకు వినపడలేదు. మూడోసారి "నువ్వేరా?" అంటూ పైకప్పు ఎగిరి పోయేటంత గట్టిగా అరిచాడు మాస్టారు! దాంతో నేను వులిక్కిపడి లేచి నిల్చున్నాను.

"అది ఎవరు వ్రాశారు? చెప్పు" అంటూ మాస్టారు బెత్తం ఆడిస్తూ గద్దించి అడిగారు.

నేను ఆపాద మస్తకం కంపించి పోయాను. 'శుభమా అంటూ క్రొత్తగా ఫిఫ్తుఫారం క్లాసులో అడుగు పెట్టుతుంటే ఎవరో తుమ్మిన ఫలితం యిలా పరిణమించ బోతుంది కాబోలురా భగవాన్లూ,' అని నాలో నేనే చాలా యిదై పోయాను. ముఖమంతా ముచ్చెమటలు దగ్గారి పోతున్నాయి. ఏం చెయ్యటానికీ, ఏం చెప్పటానికీ దిక్కుతోచక గ్రుడ్డ వెర్రి ముఖం పెట్టేసి, అలాగే కట్టెలా నిలబడ్డాను. గోడమీద వ్రాసింది నేనే అను కొంటున్నారేమో, నే కాదని చెప్పి క్షమాపణ వేడుకొందా మన్న ఆలోచన రాగా "అది వ్రాసింది నేను కాదండీ" అని బిక్కు బిక్కు మంటూ సమాధానం యిచ్చాను.

క్లాసంతా గొల్లున నవ్వారు. నేను వ్రాయలేదంటే వీళ్లెందుకు నవ్వుతున్నారో నాకెంతకీ అర్థం కాలేదు. అలానే బిక్క ముఖం వేసుకొని నిలబడ్డాను.

మా మాస్టారికి కూడా నవ్వు వచ్చినట్లుంది; పైకి పొంగివస్తున్న నవ్వును ఆయన అతి ప్రయత్నంతో మీసాలచాటున దాచేసుకొంటూ "నాయనా! నీ అంత బుద్ధిమంతుడైన శిష్యుడు నా కింతవరకు లభించ లేదోయ్; ఇక కూర్చో" అన్నారు.

మా క్లాసు క్లాసంతా మళ్లీ పగలబడి నవ్వింది. వీళ్లకీ నవ్వు లెందుకు పుట్టుకొచ్చిందో నాకేమీ బోధపడలేదు. మౌనంగా కూలబడ్డాను నా సీటులో.

నా ప్రక్కనే కూర్చొని వున్న రామమూర్తి నాకు కావలసిన స్నేహితుడే. నా కోపంఅంతా చల్లారాక నెమ్మదిగా వాడి చెవులో నోరుపెట్టి "ఎందుకురా క్లాసు వాళ్లంతా నవ్వారు? నేను చెప్పిన దాంట్లో ఏం తప్పుంది?" అని అడిగాను. వాడు వుబికి వుబికి వస్తున్న నవ్వును అతి ప్రయత్నంతో ఆపుకొంటూ "ఓరి దద్దమ్మా! జైమినీ భారతం వ్రాసింది ఎవరురా' అని మాస్టారు అడిగితే, అది వ్రాసింది నేను కాదని సమాధానం యిచ్చావు కదా! నీ బ్రతుక్కుతోడు నువ్వు జైమినీ భారత మంతటి గొప్ప పుస్తకాన్ని ఎన్ని జన్మలకైనా వ్రాయగలవా అంట! జైమినీ భారతం నువ్వు వ్రాసేవన్నా, నమ్మే నాథుడెవడూ వుండడు" అన్నాడు.

నాకు ఎక్కడలేని వుడుకు మోతు తనం వచ్చింది "అదేమిట్రా! మాస్టారు నన్ను ఆ ప్రశ్న అడగనే లేదే!" అన్నాను.

"నువ్వు క్లాసులోకి వచ్చేముందే భాస్కర్నని అడిగారు. వాడు సమాధానం చెప్పలేక పోయేసరికి నువ్వు ఏమైనా చెప్పగలవేమో నని నిన్ను అడిగారు అంతే. దానికి నువ్వు యింత రాద్ధాంతం చేశావ్" అన్నాడు రామమూర్తి.

'గుమ్మడికాయల దొంగ అంటే బుజాలు తడుముకొన్నట్లయింది నా పని. హరి! ఎంత పని జరిగింది! నన్ను చూస్తే నాకే సిగ్గేసింది.

కాకపోయినా తెలుగు మాస్టారు తాను ప్రశ్న వేసి నప్పుడు నేను క్లాసులో లేనన్న విషయం కాస్త జ్ఞాపకం పెట్టుకోకూడదూ మీరే చెప్పండి.

ముష్టిముక్కు

ఆ ఊళ్లో ఎవరింట్లో తద్దినం అయినా, గున్నయ్య శాస్త్రి తయారన్న మాటే. ఆయన రాక పోతే అసలది తద్దినమే అనిపించు కోదు. ప్రతీరోజూ భోంచేసి రూపాయో, అర్ధోయిస్తే రొంటి నెట్టేసి, ఏ అరుగు మీదనో పడి దొర్లేవాడు.

గున్నయ్య శాస్త్రికి యే అలవాటూ లేదుగానీ, పొడుం అలవాటు మట్టుకు దిట్టంగా వుంది. అంతలావు అలవాటు వుండికూడా ఒక్క కాసీ అయినా ఖర్చుపెట్టి పొడుంకొని యెరుగడు. ఏ పొడుం పీల్చే వాని దగ్గరకో వెళ్ళడం; "రామయ్య బావా! ఏది ఈవాళ నీపొడుం ఎంత ఘాటుగా ఉందో చూస్తాను" "సూరయ్య తాతా! ఏది ఓపట్టు, నువ్వు తయారుచేసి నట్టు--తాతా--ఈ ఊళ్లో ఎవ్వరూ చెయ్యలే రనుకో" అంటూ వాడి దగ్గర ఒకపట్టు, వీడిదగ్గరో పట్టూ ముష్టి అడిగి పీల్చేసి కాలం గడిపే వాడు. ఈ విషయం కసిపెట్టి కుఱ్ఱ కుంకలు గున్నయ్య శాస్త్రిని "ముష్టిముక్కు" అని వేళాకోళం చేస్తూండే వారు.

ఆ ఊరి కరణంగారి పేరు కామయ్యగారు. చాలా తెలివిగల వాడు. మోతుబరి. పొడుం అల వాటు భారీగా ఉండడం వల్ల ఓ చిన్న జాడీడు పొడుం ఎప్పుడూ నిలవలో ఉంటుంది ఆయనయింట్లో. గున్నయ్య శాస్త్రి రోజుకు మూడు నాలుగు సార్లు కరణంగారి పొడుం ముక్కులోకి దట్టించుకొనే వాడు. కామయ్యగార్కి గున్నయ్య శాస్త్రి మీద కోపమయితే లేదుగాని, ఓ చిన్న గమ్మత్తు చెయ్యాలనిపించింది.

పచ్చి మిరపకాయిలు దోరగా వేయించి పొడుం కొట్టించి ఒక డబ్బాలో పోశారు. మంచి పొడుం కూడా మరో డబ్బాలో పోసి రెండు డబ్బాలనూ తన లాల్చీ కుండే రెండు జేబుల్లోనూ వడేసు కుని ఉదయమే బయటికివచ్చి వరండాలో కూర్చొన్నారు; కామయ్యగారు.

"కరణంగారూ" అంటూ తయా రైనాడు 'ముష్టిముక్కు'


"ఆఁ! ఈవాళ్ల తిథి ఎక్కడండీ! శాస్త్రిగారూ"

"ఈవాళ ఎవరింటోనూ లేదండీ! పక్కనేఉన్న పల్లెపాలెం సత్రంలో భోంచేసి వస్తాను. రెండు పట్లకుసరి పడేపొడుం యిద్దురూ" అనిఅడిగేడు.

"ఓ, దానికేం. తీసుకోండి" అంటూ కారం డబ్బా అందించారు కరణంగారు.

గున్నయ్య శాస్త్రి ఓపట్టు ఘనంగా పీల్చేసి, రెండోపట్టు





గుమాస్తా :- మన మేనేజర్ని మళ్లీ ఒకసారి తన్నుదామన్నంత కోపం వస్తోంది.

రెండో గుమాస్తా :- 'మళ్ళీ' అని అంటున్నావు; ఇదివరకెప్పుడైనా తన్నావా?

మొదటి గుమాస్తా:- లేదు. ఇదివరకు కూడా ఒకసారి అంతకోపమూ వచ్చిందిలే.

బొటనవ్రేలికీ చూపుడు వ్రేలికీ మధ్య సంధించి "శెలవు బాబూ" అంటూ సాగించాడు గమనం, పొరుగూరి సత్రానికి.

కొంత దూరం పోయేసరికి పొడుంపట్టు ప్రభావం చూపెట్టింది. కరణంగారి పొడుం మహా ఘాటుగా ఉంటుందనే గట్టి నమ్మకం వుండటంచేత 'ముష్టి ముక్కుకి' వేరే భావం యేమీ కలుగలేదు. ఈ వేళే క్రొత్తగ చేసి ఉంటారెమో శాస్త్ర ఘాటెక్కువగా ఉంది అనుకుని సమాధాన పరచుకొని నెమ్మదిగా సత్రం జేరుకున్నాడు.

అప్పటికప్పుడే సత్రం గుమాస్తా వచ్చినవారికి పద్దువేసేసి వెళ్ళిపోయాడు. అయినా వంట బ్రాహ్మలు స్నేహితులవడంవల్ల భోజనానికభ్యంతరం లేకపోయింది. భోజనంవేళ కావచ్చిందని వంట బ్రాహ్మలు హెచ్చరిస్తే గున్నయ్య శాస్త్రి చేతిలో ఉన్నపట్టు శాస్త్ర ముక్కులో కూరేసి స్నానం చెయ్యడానికి నూతి పళ్ళెం దగ్గరకి వెళ్ళాడు.

రెండో పట్టుతో 'రఫ్' మంది. కారం పవరు. కళ్ళమ్మట నీళ్ళు తిరిగేయి. బుర్ర గిర్రుమంది. వళ్ళు తిరిగి నూతి పళ్ళెంమీద పడిపోయాడు.

ఆరోజు భోజనానికి వచ్చిన వాళ్లు యిదిచూసి వంట బ్రాహ్మలకు చెప్పారు. స్నేహితుడి దురవస్థను చూసి, స్మారకం తప్పి పడి వున్న గున్నయ్యను తీసుకొచ్చి ఓ తాటాకు చాపమీద పడుకోపెట్టి వాళ్లు యథాశక్తి పరిచర్యలు చేశారు.

అలా వాళ్ళంతా చుట్టూచేరి ఒక గంటసేపు శైత్యోపచారాలు చేయగా చేయగా, గున్నయ్యకు కొద్దికొద్దిగా తెలివిరావటం ఆరంభించింది. తెలివి తెరవచ్చి నవ్వడల్లా గున్నయ్య తన ముక్కు పట్టుకొని "మంట బాబోయ్! మంట" అంటూ తెగ గగ్గోలుగా ఏడ్చాడు.


వంట వాళ్ళల్లో ఒకడి దగ్గిర గున్నయ్య శాస్త్రి లోగడ బాగా పీసెడు ముక్కుపొడుం దాకా, అప్పుడు కొంచెం అప్పుడు కొంచెంగా ముష్టి ఎత్తాడు ఆ అనుభవాన్ని బట్టి ఆవంట బ్రాహ్మడికి అసలు విషయం అనుమానం తగిలి ప్రక్కన వున్న వాళ్లతో "వీడికి ఎవరో పొడుంపేరు చెప్పి, మిరపపొడి చేతిలో పెట్టినట్లున్నారురా!" అన్నాడు.

గున్నయ్యకు మళ్లీ తెలివి వచ్చింది. "కామయ్య బాబూ! జన్మ జన్మాలకీ నీ దగ్గర పొడుం ముష్టి ఎత్తను బాబూ! అమ్మో! మంట! బాబో మంట!" అంటూ మళ్ళీ గోలగా ఏడ్చాడు.

అంతటితో వాళ్లకు తట్టిన అనుమానం నిజమేనని తోచింది. వాళ్లల్లో తెలివైన వాడు ఒకడు యింత నెయ్యి తెచ్చి గున్నయ్య ముక్కులో బొట్లు బొట్లుగా పోశాడు. తరువాత కొంతసేపటికి ఆ మంటలు కొంచెం చల్లారాయి.

మర్నాడు పొద్దున్న ఆ ఊళ్లో పొడుం దుకాణం దగ్గిర 'ముష్టి ముక్కు' కూడా ప్రత్యక్షమవడం చూసి ఆశ్చర్యపోయారు వూళ్లో జనమంతా. ఒకమూల నుంచి "అహ్హహహ్హ" అని పెద్దగా నవ్వు వినిపిస్తే, అటువైపు తిరిగారందరూ. ఎవరక్కడ! కరణం కామయ్యగారే కొంటెగా నవ్వుతున్నారు. ఆరోజు మొదలు ముష్టిముక్కు పొరపాటునైనా ఓ పట్టు ముష్టెత్త లేదు. ★

జంతుకోటిలో మానవలక్షణాలు



జంతువుల తెలివి తేటలు పరీక్షించే సమయంలో అవి ప్రవర్తించే పద్ధతులు చాలా విచిత్రంగా వుంటాయి. 'మిమ్మి' అనే ఒక చింపాంజీ తనను యీ మాదిరి పరీక్షలపాలు చేస్తున్నారని పసికట్టి, పరీక్ష హాలులోకి పోబోయే ముందు నీళ్ల దొడ్లోకి వెళ్ళి కుళాయి తిప్పి, మాటి మాటికి చేతులు కడుక్కోవటం మొదలు పెట్టింది. రానురానూ చేతులు కడుక్కోందే దాని బుర్ర అసలు పనిచేయని దశకూడా వచ్చేసింది. మామూలుగా యూనివర్సిటీ పరీక్షలకు వెళ్లే ఆడపిల్లలు, మొగపిల్లలు-మీరు గమనించారో లేదో కాని - ఆ పరీక్షరోజు వుదయాన ఎంతో శుచిగా వుండటానికి ప్రయత్నిస్తారు. ఒకటికి రెండుసార్లు కాళ్లూ చేతులు కడుక్కొంటారు. 'మిమ్మి' చేసిన పనికూడా యిలాటిదే !

'కొక్కో' అనే మరొక చింపాంజీకి పరీక్షరోజున అజీర్తి చేసేదట. దురదృష్ట వశాత్తు ఆరోజున మొట్ట మొదటి పరీక్షలోగనక అది తప్పిపోయిందీ అంటే, వెర్రికేకలు పెట్టేసి, ఒక్క కాలితో ఆ హాలు అంతా కుప్పిగంతులు వేసి నానా హంగామా చేసి పారేసేది.

మరొక చింపాంజీ కొరుకుబడని సమస్య ఏదైనా విడదీయవలసి వచ్చినప్పుడు, ఏం చెయ్యటానికీ తోచక తన తలకాయనే నేలకు దఫీ దఫీమని బాదుకొనేది. (నేనెరిగివున్న ఏడేళ్ల కుర్రవాడొకడు యిలాగే లెక్కలు చేయటం ఎలాగో తెలియక పోతే తలకాయ నేలనువేసి బాదుకొనేవాడు. 'అలా ఎందుకు కొట్టుకొంటా'వని అడిగితే 'బుర్రలో అట్టడుగున పడిపోయిన సరుకు పైకి వస్తుంద'ని సమాధానం యిచ్చాడు!)

చింపాంజీలు పరీక్షలలో నెగ్గలేకపోతే చాలా బాధపడే రకం. రాబర్ట్ జెర్క్స అనే ఒక శాస్త్రజ్ఞుడు వెంపీ అనే చింపాంజీతో కొన్ని పరిశోధనలు చేస్తున్నాడు. గిరగిరా తిరిగే బల్లచెక్కను ఒక దానిని యీ చింపాంజీ ఎదుటపెట్టి, తాను ఎప్పుడు ఏరంగు చెక్క చూపిస్తే, అప్పుడు ఆ చింపాంజీ ఆరంగు వచ్చేవరకు బల్లను తిప్పుతుందా లేదా అని యీయన పరీక్ష చేస్తున్నాడు. చింపాంజీ గనుక ఆ పరీక్షలో నెగ్గితే దానికి మంచి భోజనం పెట్టించేవాడు. ఇలా ఒకటి రెండు రోజులు గడిచాక ఒక రోజున యీ చింపాంజీ ఆ పరీక్షలో తప్పిపోయింది. తప్పిపోయింది కనుక దీనికి ఆయన ఆరోజు తిండి పెట్టకుండా చేశాడు. పరీక్షలో తప్పిపోయా నన్న పరాభవానికి తోడు, తిండికూడా లేకుండా చేసినందుకు ఆ చింపాజీకి యీయన మీద విపరీతమైన కోపం వచ్చేసింది. ఆకోపం కొద్దీ పరాకుగా వున్న ఆ శాస్త్రజ్ఞుడి ముంజేతిని పట్టుకు గట్టిగా కొరికేసి, గయ్యాళి పెళ్లాంలాగా - తననే ఎవరో చావబాదుతున్నట్లు బిగ్గరగా అరిచింది. ఆ అరుపువిన్న తోటి చింపాంజీలు మూడు అక్కడకు పరుగెత్తుకు వచ్చి, అవికూడా యీయన

మీద కలబడ్డాయి. ఆయన చేతి నంతా కొరికి పెట్టాయి.

చింపాంజీకి పరీక్షల విషయంలో యింత పట్టుదల వుంటుందా! గొరిల్లాలు అల్లా కాదు. వాటిదంతా మొద్దబ్బాయి వాటం. పరీక్షలకు వెళ్లటం అంటేనూ వీటికి వుత్సాహం వుండదు. ఆ పరీక్షల్లో తప్పిపోయినా అవి వాటిని మనస్సుకు పట్టించుకోవు.

సృష్టిక్రమంలో గొరిల్లాల కంటె మామూలు కోతులు కొంతవరకు కిందిమెట్టుకు చెందినవే అయినా, పరీక్షల విషయంలో యివి గొరిల్లాలకంటె మెరుగు అనిపిస్తాయి. వాటికి వున్న తెలివి తేటలన్నిటినీ వుపయోగించి పరీక్షలలో 'పాస్' కావాలని తంటాలు పడతాయి. తప్పిపోయినప్పుడు మాత్రం రెచ్చిపోతాయి. అందుకనే కోతులతో పరీక్షలు చేసేటప్పుడు సామాన్యంగా శాస్త్రజ్ఞులు, పరీక్షా సాధనాలను పనిముట్లను వూడిరాకుండా నేలకు మేకులతో బిగించి వుంచుతారు. కిటికీల తలుపులన్నీ ముందుగానే మూసేస్తారు.

ఒక సందర్భంలో మానసిక తత్వ శాస్త్రవేత్త ఒకడు ఒక కోతిని పట్టి తెచ్చి, దానివొళ్లో యిన్ని గోలికాయలు పోశాడు. కోతి తన చేతికి ఒక గోలికాయ యిస్తే తాను దాని చేతికి యింత అన్నం ముద్ద అందించే పద్ధతి దానికి అలవాటు చేశాడు. చాలా రోజులవరకు అది ఎన్ని గోలికాయలు యిస్తే దానికి అన్ని అన్నపు ముద్దలు అందించి వున్నట్లుండి ఒకరోజున అది ఎన్ని గోలికాయలు యిస్తే అన్నీ తీసుకొని మాట్లాడకుండా వూరుకొన్నాడు. గోలికాయలు పుచ్చుకొని అన్నంముద్దలు యివ్వటం ఎగేశాడు ఆ గడుసువాడు! ఇక చూసుకోండి - ఆ కోతి తన సొమ్మంతా యీ ఆయన దోచేస్తున్నాడని ఒకటే గోలచేసింది. ఆయనను 'సివాళక బూజ్ఞవావని' తన భాషలో తెగతిట్టి పోసింది. వూపిరితిత్తులలో గాలి సాంతం అయిపోయేదాక పెట్టుబడి దారీ విధానాన్ని గూర్చి పెద్దగా రంకెలు వేస్తూ ఏమిటేమిటో వుపన్యాసం చేసింది. అక్కడికీ కసితీరక కాళ్లతో నేలమీద తెగబాద విడిచిపెట్టింది.

ఎలుకలు అంత అమాయకంగా వున్నట్లు కనిపిస్తాయి కదా! ఇవి కూడా పరీక్షలలో తప్పిపోతే ముఖం వేల వేసుకొని ఒకమూలకు పోయి కూర్చుని గోళ్లు నములుతాయి!

కొలంబియాలో ఒకచోట తెల్ల ఎలుకలను పట్టి తెచ్చి ఒక బోనులో పెట్టారట. ఆ ఎలుకలు ఎటువైపు చూస్తున్నా, సరిగ్గా వాటికళ్లలోకి గుచ్చుకొనే టట్లుగా పెద్ద వెలుతురు నిచ్చే ఎలక్ట్రిక్ దీపాలు అమర్చారట. అయితే - ఆ బోను

లోనే ఒకచోట ఒక చిన్న మీటను అమర్చి దానిని కిందికి వంచి పట్టుకొన్నంతసేపూ ఆలైట్లు ఆరిపోయే ఏర్పాటు కూడా చేశారు. అన్ని లైట్లూ వెలిగాక బోనులో ఎలుకలు, వాటి కాంతిని చూడలేక కాసేపు బోనంతా వెర్రి ఎత్తినట్లు అటూ ఇటూ తిరిగాయి. అలా తిరగ్గా తిరగ్గా అదృష్టవశాన ఒక ఎలుక ఆమీటను నొక్కటం జరిగింది. లైట్లు ఆరిపోయాయి. అమ్మయ్యా! వాటి ప్రాణాలు కొంచెం తేరుకొన్నాయి. ఆ ఎలుక మీట మీదనుంచీ కాలు తీసేసరికి మళ్ళీ లైట్లు ప్రత్యక్ష మయ్యాయి. అంతటితో వాటికా పరిస్థితి అర్థమైనట్లుంది. ఒక ఎలుక తానొక్కతే ఆ మీటను పకబిగిని అరగంటసేపు క్రిందికి నొక్కి పట్టుకొని అలాగే వుండిపోయింది. దీనినిబట్టి ఆ ఎలుకలు 'యీపనిచేస్తే యీ ఫలితం వస్తుందికదా' అని గుర్తించినట్లు మనకు అర్థమౌతున్నది.

ఇలాంటి పరిశోధనే ఒకటి మరొక శాస్త్రజ్ఞుడు ఒక కోతి మీద ప్రయోగించాడు. ఆకోతిని పెట్టిన బోనుకు సమీపంలో కంచు గంటలు కట్టించి వాటిని విద్యుత్ సహాయంతో ఆగకుండా మ్రోగేటట్లు చేశాడు. ఆకోతి ప్రాణం యీ మోతతో కకబ్బట్టిపోయింది. శరీరం కూడా కృశించి పోయింది. అలాంటి స్థితి వచ్చాక కాని యిది తన బోనులోనే వున్న ఆ మీటను నొక్కితే అవతలి రణగొణ ధ్వని ఆగిపోతుందనే విషయాన్ని కనిపెట్ట లేక పోయింది.

(ఇంకావుంది.)

డాన్ క్విక్‌సెట్

(34-వ పేజీ తరువాయి)

మాత్రమూ సహించలేక పోతున్నాడు. ఇక ఆగలేక—"డ్యూక్ గారూ! యీ మాదిరి వెర్రి ధోరణిని మీరు రెచ్చగొట్టుతున్నారు. ఈలోకంలో మీరు తెలిసో, తెలియకో యీ వెర్రి ధోరణిని ప్రోత్సహిస్తున్నందుకు, రేపు ఆ ఏసుక్రీస్తు ఎదుట మీరు సంజాయిషీ చెప్పుకోవలసి వస్తుందనే విషయాన్ని మీస్ఫురణకు తేవటానికి సాహసిస్తున్నాను. తరతరాలుగా మీ వంశీయుల ఆత్మ వారి శుద్ధ్యాన్ని పరిరక్షించే బాధ్యత మాపై పడివున్నది కనుకనే యీమాట అయినా నేను తమకు చెప్పకలుగుతున్నాను." అంటూ ఆ డ్యూక్ గారికి తాను చెప్పదలుచుకొన్న నాలుగు మాటలూ చెప్పేసి, యిటు డాన్ క్విక్ సెట్ గారి వైపు తిరిగి, ఆయింట్లో ఆయన అతిథిగా వచ్చాడన్న విషయమైనా గుర్తుంచుకోకుండా, యిష్టం వచ్చినట్లు తిట్టేశాడు. స్పెయిన్ దేశంలో యీరోజున అసలు యీ వీరులనే వారు ఎవరూ లేనే లేరనీ, అటువంటి వాళ్లతో దేశానికి ఎవ్విధమైన అవసరమూ లేదు పొమ్మనీ అన్నాడు. రాక్షసులు, భూతప్రేత పిశాచాదులు లేనేలే వన్నాడు మంత్రాలే లేనప్పుడు మంత్ర ప్రభావనికి లోబడిపోయి అసలు రూపుమారిపోయి తిరుగుతున్న అంగనలు ఎందునా వుండబోరని అనేశాడు. ఈలాటి వాటిలో నమ్మకాలు కలిగివుండే వ్యక్తి అథవా ఎవరైనా వుంటే, వాడో వెర్రికుట్టె అయివుండాలని అన్నాడు.

తనంతటి వీరుణ్ణి యింతమంది పెద్ద మనుష్యుల మధ్య పట్టుకొని వెర్రికుట్టె అంటే ఎవరికైనా కోపం వస్తుంది. డాన్ క్విక్ సెట్ గారు కూర్చొనివున్న వాడల్లా అమాంతం లేచి నిల్చొని, పళ్లు పటపట కొరికాడు. మనిషి ఆపాద మస్తకం కంపించి పోయాడు. అంత కోపంలోనూ వీరులుఅంటే ఎవరో, వీరులవర్గం అంటే ఏమిటో వీరోచిత కార్యాలు అంటే ఏవో అదంతా ఏకరువు పెట్టాడు. ఇన్ని చెప్పి ఆ పురోహితుడు తనకు తెలియని విషయాల జోలికి వచ్చినందుకు చివాట్లు పెట్టాడు. ఈధోరణిలో బాగా అరగంటసేపు వుపన్యసించి "ఏను వీరుడను. వీరునిగానే జీవించి, వీరోచితముగానే యాతనువును చాలించి తీరెదను. మానవులై పుట్టినవారిలో కొందరు తమ జీవితకాలము నంతటినీ పరులను ఆశ్రయించి, వారికి స్తోత్ర పాఠములుజెప్పి, వారివలన తృణమో, పణమో పొంది, తన్మూలముగా జీవయాత్రను కొనసాగించు కొనుటతోనే సంతుష్టులగుదురు. కొందరు, అహంకార పూరితులై కన్నుమిన్ను గానక సంచరించెదరు. మరి కొందరు గోముఖ వ్యాఘ్రములవలె వ్యవహరించెదరు. ఇన్ని తరహాలవారు పోగా, మిగిలిన ఆ కొద్దిమంది మాత్రమే ధర్మపథము ననుసరించెదరు. అట్టివారిలో నేనొకడను. ధర్మ సంస్థాప నార్థము నేనునూ మున్ను ప్రఖ్యాతవీరులు పోయిన మార్గముననే సంచరించు చున్నాను. ధర్మ రక్షణమునకై కంకణము కట్టుకొన్న నావంటి వానికి కావలసినది అజరామరమైన కీర్తియే కాని, ధనకనకవస్తు వాహనాదికములు కావు. నేచేయు ప్రతికార్యమూ, నేపలుకు ప్రతివాక్యమూ తోటి మానవులకు సేవచేయుటకే కాని, వారిని కొల్లగొట్టుటకు కాదని గుర్తెరుగుము. ప్రపంచ శ్రేయస్సే నా పరమ లక్ష్యము." అంటూ తన వుపన్యాసాన్ని ముగించాడు.

మిగిలిన వుపన్యాసం మాట ఎట్లావున్నా వుపన్యాసం చివరను డాన్ క్విక్ సెట్ గారు చెప్పిన ఆనాలుగు ముక్కలు మాత్రం చాలా వుదాత్తంగా వున్నాయి. అవి అంత వుదాత్తంగా వున్నాయన్న విషయం శాంకో పాంజాకు సైతం బోధపడింది. "మా బాగా చెప్పారండీ! మా బాగా చెప్పారు." అంటూ వాడు చప్పట్లు చరిచేశాడు.

డాన్ క్విక్ సెట్ గారంటే మొదటినుంచీ మండిపడుతున్న ఆ పురోహితుడికి ఆయనగారి ఆ వుపన్యాసమూ, అందులో తనమీద ఆయన విసిరిన ఆవిసురుళ్లూ అన్నీ వింటూవుంటే వొళ్లు మరీ మండుకు వచ్చింది. ఆయనగారి మాటలకే యీయన అంత మండి పడుతుంటే యీ బంటుగాడు ఆవరసను చప్పట్లు కొట్టుతుంటే, ఆయనకు వచ్చిన కోపం మరి ఆగిందికాదు. వీడి బ్రతుకంతా బయట పెట్టాలన్న పంతం కొద్దీ ఆయన బుసలు కొట్టుతూ "స బ్రతుకు బండలుకాను! నువ్వూ యీ వీరుడి బంటు శాంకో

పాంజా వేకదూ! నిన్నేగా యీ పీరుడు ఏదో దీవికి గవర్నరుగా చేస్తానన్నాడు." అంటూ ఏదో వేళా కోళం చెయ్యబోయాడు.

"అవునండీ; అవును. నన్నే ఆయన గవర్నరుగా చేస్తామన్నారు. గవర్నరు కావటానికి కావలసిన అర్హతలు కావలసినన్ని నాలో వున్నాయి కనుకనే ఆయన ఆమాట అన్నారు. ఇదుగో—! ఒక్కమాట చెప్తాను వినండి. 'మంచి వాళ్లతో మెసిలితే నీకూ మంచితనం అబ్బుతుందన్న' ఆర్యోక్తిలో నాకు వల్లమాలిన నమ్మకం వున్నది. కనుకనే నేనీ మహా పురుషుణ్ణి వెన్నంటి వుంటున్నాను. ఆసరా కావాలంటే డాన్ క్విక్ సెట్ గారి లాంటి మహావృక్షాన్ని పట్టుకోవాలి గానీ, బచ్చల తీగెలలాంటి మీ బోటి వారిని పట్టుకొంటే ఏం ప్రయోజనం?" అంటూ వాడు కుండ బద్దలుకొట్టినట్లు అడిగేశాడు. అంతే కాదు—ఆ పురోహితుడి మీదకు ఒక సవాలు పారేశాడు — "నా స్వామిపట్ల నాకుగల విశ్వాసం వృథాపోదు; ఇన్ని మాసాలుగా ఆయనను అనుసరించినందుకు నాకష్టం ఫలించి తీరుతుంది; నా యజమానికి పాలించేందుకు రాజ్యాలూ కొదవకావు; నేను గవర్నరు అయ్యేందుకు దీవులూ దొరక్కపోవు! మీరిలా చూస్తుండగానే కొద్ది రోజులలో నన్ను ఆయన ఒక దీవికి గవర్నరుగా చేసి తీరుతారు" అనేశాడు.

ఈమాట అందుకొని ఆ 'డ్యూక్' గారు— "నీవు గవర్నరు అయ్యేందుకు యీ క్షణాన కూడా దీవులలోటు లేదు. డాన్ క్విక్ సెట్ గారు నీకు యిచ్చిన వాగ్దానం మేరకు, నిన్ను నేనే యీరోజే నాకు చెందిన దీవులలో ఒకదానికి గవర్నరుగా నియమిస్తున్నాను." అనేశారు. డ్యూక్ గారు అన్న యీ మాటలు వినేసరికి శాంకో పాంజా మనిషి గడ్డకట్టుకు పోయాడు. వాడు తన చెవులనే తాను నమ్మలేనిస్థితిలో పడిపోయి, ఎలా నిలబడివున్న మనిషి అలాగే వుండిపోయాడు.

డాన్ క్విక్ సెట్ గారు గబగబా వాడి దగ్గరకు వెళ్లి "శాంకో! ఓనా శాంకో! 'డ్యూక్' గారు ఆడినమాట నీకు వినపడ లేదా! వారు నీపట్ల కనుపరచిన ఔదార్యమునకు వేగమె వారి పాదముల చెంత మోకరిల్లి ధన్యవాదము లర్పింపుము." అంటూ వాడికి తక్షణ కర్తవ్యాన్ని బోధించాడు.

శాంకో పాంజాకు అప్పటికి అర్థమైంది—తాను యింతవరకూ కలలు కనటం లేదనీ నిజంగానే ఆ డ్యూక్ గారు తనను గవర్నరుగా నియమిస్తానన్నారనీ ఉన్న చోటినుంచీ ఒక గంతువేసి ఆ 'డ్యూక్' గారి పాదాల దగ్గిర పడి, ఆయన రెండు కాళ్లూ పట్టుకొని కళ్లకు అద్దుకొన్నాడు. వాడా వరసను ఆయనగారి పాదాలు పట్టుకు వేళ్లాడుతూ వుండగా, ఆ పురోహితుడు యిక సహించలేక భోజనంముందు కూర్చొన్న వాడల్లా లేచి రుసరుస లాడుకొంటూ బయటకు వెళ్లిపోయాడు.

పంక్తిలో వున్న మనిషి ఒకడు అలా అర్థాంతరంగా లేచిపోయినా, మిగిలిన ముగ్గురూ మాత్రం కొంతసేపటికి తేరుకొని భోజనాలు పూర్తిచేశారు.

భోజనాల సమయంలో రేగిన ఆవేశాల మూలంగా డాన్ క్విక్ సెట్ గారి మనస్సు బాగా అలిసిపోయింది. అందులోనూ కమ్మని భోజనం దొరకనే దొరికింది గదా అని మరికొంచెం జాస్తిగానే పట్టించాడేమో, ఆయనగారికి భోజనాలు కావటంతోటే భుక్తాయాసం బద్ధకం అన్నీ వచ్చేశాయి. తన కోసం ప్రత్యేకించిన గదిలోకిపోయి పడుకొన్నాడు. శాంకో పాంజాకు కూడా పడుకోవాలని పిస్తున్నది. కానీ, 'డ్యూక్ గారి' భార్య అతగాణ్ణి పడుకోనిచ్చింది కాదు. తనతోపాటే వాణ్ణి తాను వుండే గదికి తీసుకుపోయి, అక్కడ పదమంది ఆడంగులనూ పోగుచేసి కూర్చోబెట్టి, వీడిచేత తెగవాగించింది. వాడు తెలిసో, తెలియకో ఏదో ఒకమాట అంటూ వుండటమూ, వాడా మాటలు అన్నప్పుడల్లా అంతమంది ఆడకంఠాలు గొల్లున పగలబడి నవ్వటంతో గంటల కొద్దీ కాలం గడిచిపోయింది. అప్పుడు వాడు ఆడిన మాటలు వింటున్నకొద్దీ ఆవిడకు వీణ్ణి బుజ్జగించాలనే బుద్ధి అంతకంతకూ ఎక్కువైంది. ఎన్నిరోజులు వీలైతే అన్నిరోజులు వీణ్ణి తనదగ్గిరే అట్టే పెట్టుకొని, వీడిని వాగించాలని ఆవిడ తనలోతాను ఒక నిశ్చయానికి వచ్చేసింది.

(ఇంకావుంది)



రోహిణివారి "ప్రతిజ్ఞ"లో నాయిక, పద్మినిపాత్రధారిణి సావిత్రి.

సినిమాల్లో వాస్తవికత

తక్కిన కళలన్నిటికంటే సినిమాలు బహుళ జనాదరణ పొందటానికి గల కారణాలలో ఒకటి—సినిమాలు తమ కథ యొక్క వాతావరణాన్ని ప్రేక్షకుల భావనాశక్తికి వదిలెయ్యకుండా యథాతథంగా ప్రదర్శించగలగడం. నాటక రంగానికి ఈ శక్తి లేదు. వాతావరణాన్ని సాధ్యమైనంత ఎక్కువగా సూచించటానికి నాటకరంగం చాలా శ్రమపడుతుంది. అయినప్పటికీ వాతావరణాన్ని ఊహించుకుని సప్లయి చేసుకోవలసిన బాధ్యత ప్రేక్షకులదే. అందుచేతనే నాటకంలో వాతావరణం అంత ముఖ్యం కాదు. ప్రేక్షకులను ముంత్రముగ్ధులనువలె చేయటానికి నాటకం



జైమిని వారి "చిన్నమ్మకథ"లో కృష్ణకుమారి



రాజరాజేశ్వరి వారి "పెద్దరైతు"లో లింగమూర్తి, రేలంగి.

ఇతర విషయాలమీద ఆధారపడుతుంది. ముఖ్యంగా నటీనటుల నటనాశక్తి, శక్తివంతమైన సంభాషణలు, సన్నివేశాలు ఇత్యాదయః.

సినిమాలకున్న ప్రధాన సౌకర్యాలలో ఒకటి వాతావరణాన్ని యథాతథంగా చూపగలగడం. పట్టణ వాతావరణం కావలిసివస్తే బస్సులు, ట్రాములు, మేడలు, పార్కులు మొదలైనవాటిని ఉన్నవళంగా షూట్ చేసి తెరమీద కెక్కించవచ్చు. ఇదేవిధంగా ఎడారులు, కొండలు, నదులు, సముద్రాలు—కథకు ఏవి అవసరమైనా తెరమీదికి తీసుకురావచ్చు. సినిమాలకూ నాటకాలకు గల ఈ తేడాను అనుసరించే మరికొన్ని భేదాలుకూడా ఏర్పడుతున్నాయి. ఉదాహరణకు నాటకాలలో నటునికున్నంత ప్రాముఖ్యత సినిమాలలో ఉండదు. నాటకాలలో వాతావరణం లేకపోవటంమూలాన నటుడు నటనతోనే ప్రేక్షకులను ఆకట్టవలసి వస్తుంది. సినిమాలో యథార్థ వాతావరణం ఉండటంవలన సినిమానటుని నటనకూడా మామూలు మానవప్రవర్తనకు సన్నిహితంగా ఉండాలి. ఏమాత్రం నాటకీయంగా ఉన్నా వెంటనే ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. సినిమాలో యథార్థ వాతావరణాన్ని ఎలా కల్పిస్తున్నామో అలాగే యథార్థ ప్రవర్తనను కూడా కల్పించాలి. అంటే సినిమాలో నటనకు అసలు తావు లేదని కాదు. అది నాటకీయంగా ఉండరాదని మాత్రమే అర్థం. ఇటీవల ఒకరు ఒక వ్యాసంలో రాశారు: మన నటులు సినిమాల్లో డైరెక్టర్లు, ఇతర టెక్నీషియన్లు అనేకమంది సహాయం ఉన్నా రాణించలేక పోతున్నారనీ, దీనికి కారణం డైరెక్టర్ల అసమర్థతేకాని నటుల లోపంకాదనీ, ఎందుకంటే ఆ నటులే ఎవరిసహాయమూ లేకుండా స్టేజిమీద ప్రతిభావంతంగా నటించగలుగుతున్నారనీ. మన నటులు సినిమాల్లో రాణించలేకపోవటానికి బాధ్యత డైరెక్టర్లదీ కావచ్చు, నటులదీ కావచ్చు. మన నటులలో కొందరు నాటకాల్లో నటన అలవాటైనవారు; మిగతావారు నాటకాల నటనే అసలైన నటనగా భావిస్తున్నవారు. నాటకీయనటన సినిమాలకు పనికిరాదని గుర్తిస్తే ఈ నటులందరూ సినిమాలలో కూడా ఎందుకు రాణించరు? (సినిమాలలోను, నాటకాలలోను సమాన ప్రతిభ చూపేనటులున్నారనేది వేరే సంగతి. సినిమాల్లో నాటకీయ నటన ఏవిధంగా ఉంటుందో చూడాలంటే గగ్గయ్యగారు నటించినచిత్రాలుచూడాలి.)

అలాగే సినిమాలలో యథార్థ వాతావరణకల్పనవల్ల మరొక విశేషాంశంకూడా ఏర్పడుతున్నది. నాటకాల్లో మాటలు, సంభాషణలు ఎంతముఖ్యమో సినిమాల్లో అవి అంత అప్రధానం. సంభాషణలు ఎంత చాతుర్యంతో రాస్తే ఆ నాటకం అంత గొప్పదవుతుంది; దానికి అంత సాహిత్య గౌరవం వస్తుంది. షేక్స్పియరు తన నాటకాలన్నిటినీ అటు సాహిత్యాన్నీ, ఇటు రంగస్థలాన్నీ కూడా దృష్టిలో పెట్టుకుని రాశాడు. అందుచేత అవి చదువుకొనడానికీ, ప్రదర్శించడానికీ కూడా సమానంగా పనికివస్తాయి. సినిమా సినేరియోలకు ఈ మాదిరి సాహిత్యగౌరవంలేదు. సినిమా ప్రదర్శనం ప్రధానంగా చూడబడేదేకాని ఆలకించబడేది కాదు. అందువల్లనే తెరమీద వట్టినే వాతావరణం చూపటంతోనూ, మూగ నటనతోనూ ఎంతైనా కథ చెప్పవచ్చు. నాటకాల్లోలాగ సుదీర్ఘ సంభాషణలు, స్వగతాలు సినిమాస్క్రిప్టులో ప్రవేశపెడితే ప్రేక్షకుల దృష్టి చూడబడేదానిమీదినుంచి వినబడేదానిమీదికి చెదిరిపోతుంది. సినిమాకళకుగల ప్రత్యేక ప్రయోజనాలూ, సౌకర్యాలూ వ్యర్థమైపోతాయి; కేవలం నాటకశిల్పాన్ని చేతగాక అనుకరించినట్టవుతుంది. మనదేశంలో సినిమా శిల్పం ఇన్ని ఏళ్ళ తరవాత కూడా నాటకశిల్పాన్ని అనుకరించే స్థితిలోనే ఉంది. దర్శకత్వపు టెక్నిక్‌లో ఆరితేరిన శాంతారాంలాటివ్యక్తికూడా ఇటీవలి "పర్చాయి" చిత్రంలో దీర్ఘ ఉపన్యాసాలు చొప్పించాడు. అంతరాత్మచేత వేదాంత ఉపదేశాలు చేయించటం—సాహిత్య దృష్టితో చూస్తే ఎంత శక్తివంతంగా ఉన్నదనుకున్నా, ఆ గౌరవం సంభాషణలు రాసిన మనిషికే చెందుతుంది గాని, కథను చిత్రీకరించే బాధ్యతగల డైరెక్టరుకు చెందదు.

సినిమాశిల్పానికి సంభాషణల కంటే కెమేరా పనితనం, 'మాంటేజ్' ఎడిటింగ్ ముఖ్యమని మనవారిలో కొద్దిమందిని మినహాయిస్తే ఎక్కువమంది గ్రహించినట్టు కనబడదు. సైలెంటుచిత్రాల్లో పనిచేసినవారికి ఈ సంగతి బాగా తెలుస్తుంది. సైలెంటుచిత్రాల్లో సంభాషణల రచయితకు స్థానమే లేదు. అందుచేత ప్రతి కథాంశాన్నీ కెమేరాద్వారానే చిత్రీకరించవలసి వచ్చేది. ప్రపంచ సినిమారంగంలోని గొప్పగొప్ప డైరెక్టర్లందరూ సైలెంటు చిత్రాలరోజుల్లోనే పుట్టుకొచ్చారు. మాటలసహాయం లేకుండా (సబ్ టైటిల్సు ఉన్నప్పటికీ) కథను చిత్రీకరించవలసి వచ్చేటప్పటికి డైరెక్టరుపస కనబడేది ఎంతో మేధాశక్తి ఉపయోగించవలసి వచ్చేది. ఉదాహరణకి చార్లీచాప్లిన్ చిత్రాలు చూడండి. చాప్లిన్ చిత్రాల్లో ఎక్కువభాగం సైలెంటుచిత్రాలే. వాటితోనే అతనికి అంతర్జాతీయ ఖ్యాతి వచ్చింది. టాకీరంగంలోకూడా అతడు తన ప్రఖ్యాతి నిలుపుకున్నాడు. దానికి కారణం అతడు శబ్దగ్రహణసౌకర్యపు మోజులో పడకుండా కెమేరాకు, డైరెక్షన్‌కు, ఎడిటింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వటమే. అతని టాకీలలో మాటలు చాలా పొదుపుగా వాడబడతాయి. సంభాషణలు, సినేరియో, ఆఖరికి నేపథ్య సంగీతందగ్గిర్నించీ తనకి తనే తయారుచేసుకుంటాడు.

ఇంతవరకూ సినిమాలలో బాహ్య వాతావరణ కల్పనను గూర్చి పరిశీలించాం. కాని సినిమాలకు నాటకాలకంటే మరొక విషయంలో కూడా సౌకర్యం ఉంది. మానసిక వాతావరణంగాని, మానసిక సంఘర్షణగాని, భావోద్రేకంగాని సృష్టించటంలో సినిమాలదే పైచెయ్యి.


బాహ్య వాతావరణం సృష్టించినంతమాత్రాన వాస్తవికత సాధించినట్టు కాదు. మానసిక అనుభూతులను చిత్రించటంలోనే నిజమైన కళ ఉన్నది. నాటకంలో సాహిత్యం పాలు ఎక్కువగనక మాటలతోనే మానసిక అనుభూతులను వ్యక్తం చేస్తారు. సినిమాల్లో అల్లా కాదు. కెమేరాతోనే వ్యక్తం చెయ్యాలి. కెమేరా ఈ పని ఎల్లా చేస్తుంది? బాహ్య వాతావరణం ద్వారానే మానసిక వాతావరణాన్ని, అనుభూతులను స్ఫురింపజేస్తుంది. ఇందులో అనేక పద్ధతులున్నాయి. నాయిక దుఃఖిస్తున్న దృశ్యం ఉందనుకోండి. నాయికతోపాటు ప్రకృతి అంతా దుఃఖిస్తున్నట్టు చూపవచ్చు. (శాంతారాం మామూలుగా ప్రతి చిత్రంలోనూ నాయిక ఏడుస్తున్న దృశ్యంలో చెట్ల ఆకులనుండి మంచునీళ్ళు కారుతున్నట్టు చూపిస్తాడు.) అలాగే లైటింగ్‌నకూడా 'లో కీ' లో ఉంచి విషాదవాతావరణంకల్పించవచ్చును.

షేక్స్పియరు "కింగ్ లియర్" నాటకంలో లియర్ మానసిక సంఘర్షణను చూపించటానికై తుపానును ఆసరాగా తీసుకున్నాడు. లియర్ మనస్సులో చెలరేగే ఆగ్రహం, క్రోధం, ఉన్మాదం మొదలైన ఉద్రేకాలన్నిటినీ బ్రహ్మాండంగా చెలరేగుతున్న తుపానులో ప్రతిబింబింపచేస్తాడు. అయితే అది నాటకంగనక షేక్స్పియరు కవిత్వం ద్వారానే తుపాను వర్ణన చెయ్యాల్సివచ్చింది. అదే

సినిమాలో అయితే తుపాను బీభత్సాన్ని ప్రేక్షకుల కళ్ళ ఎదట ప్రదర్శించవచ్చు. సాధారణంగా ఈపద్ధతిని సినిమాలవారంతా ఉపయోగిస్తున్నారు మానసిక సంఘర్షణను చూపించటానికి ప్రకృతిలోని సంఘర్షణ చూపించబడుతుంది

విడివిడిగా తీసిన షాట్సును ఎడిట్ చెయ్యటంలోకూడా మానసిక అనుభూతులను వ్యక్తం చెయ్యవచ్చు దుఃఖపూరితమైన సన్నివేశంలో షాట్స దీర్ఘమై, మందంగా నడుస్తాయి హృదయావేగం చూపించవలసివచ్చినప్పుడు షాట్స హ్రస్వమై, ఒకదాన్ని ఒకటి తరుము తుంటూ అతి వేగంగా నడుస్తాయి కెమేరాతో పనిచేసే సినిమాకళలో నే ఇవన్నీ సాధ్యపడతాయి

సినిమటోగ్రఫీద్వారా మిగతా కళలు సాధించలేని గొప్ప ఫలితాలు ఎన్ని సాధించినా సినిమటోగ్రఫీ ఏ వస్తువు కోసం ఉద్దేశించబడినదో ఆ వస్తువు సరియైనది కాకపోతే టెక్నికల్ ప్రావీణ్యం బూడిదలోపోసిన పన్నీరవుతుంది సినిమటోగ్రఫీకి వస్తువు స్క్రీన్‌ప్లే స్క్రీన్‌ప్లే రాసేవాడికి బలమైన సన్నివేశాలు కల్పించే తెలివితేటలు లేకపోతే ఎంత టెక్నిక్ ఉన్నా వ్యర్థమే స్క్రీన్‌ప్లే రచయితకు నవలారచయితకుండవలసినంత పాత్రీకరణశక్తి, కథాకథనశక్తి ఉండాలి ఇటీవలి చిత్రాల్లో ముఖ్యంగా హిందీ చిత్రాల్లో ఏదైనా తీసుకోండి సినిమాశిల్పం ఎంత అద్భుతంగా ఉంటుందో సినిమావస్తువు అంత దిబ్బగా ఉంటుంది ఎందుచేత? ఏ ఒక్క పాత్రకూ జీవమూ, చైతన్యమూ ఉండవు నాయిక ఘోరకష్టాల్లో ఉంటుంది; నాయకుడు ఘోరప్రమాదంలో చిక్కుకుంటాడు అయినా సరే మనం కించిత్తయినా చలించకుండా ఆ సన్నివేశాలు చూడగలం ఎందుకంటే వాళ్ళెలాగూ చివరికి వాటిలోంచి బయటపడి ఆఖరికి పెళ్ళి చేసుకుంటారని మనకి తెలుసు కనక అసలా పాత్రలపై మనకి సానుభూతి కలగనే కలగదు ఎందుకో ఏడుస్తారు, ఎందుకో నవ్వుతారు, ఎందుకో పాడతారు. ఈ అనుభూతుల్లో మన కేవిధమైన పాలూ ఉండదు ఎందుకంటే ఆ పాత్ర లనుభవించే కష్టాలూ, సుఖాలు నిజమైనవిగా మనకి తోచవు; అసలా పాత్రలే రక్తమాంసాలున్న సజీవపాత్రలుగా గోచరించరు కేవలం డైరెక్టరుచేతుల్లో ఆడే కీలుబొమ్మలుగా కనిపిస్తారు పాత్రీకరణంలోనూ, సన్నివేశకల్పనలోనూ వాస్తవికత లేనంతకాలం ఎంత డైరెక్షన్ ప్రతిభ, ఎడిటింగ్ ప్రతిభ చూపించినా లాభంలేదు. ఈ వాస్తవికతను సాధించటానికే మనవారు ఎంతో కృషి చేయవలసి ఉంది ★



"అమ్మలక్కలు", "చండీరాణి", "నా చెల్లెలు" చిత్రాల్లో పరిచయం కాబోతున్న కొత్తనటుడు అమరనాథ్.

'ఇనప తెరలు' నాటక ప్రదర్శనం

సంఘంలో ఘరానా మనుష్యులుగా చెలామణి అయ్యేవారు లోలోపల ఎంతటి రాక్షసత్వాన్ని దాచుకొని పైకి నవ్వుతూ బ్రతికిపోతూవుంటారో నిరూపించటమే ఆదర్శంగా జె బి ప్రీస్లీ యింగ్లీషులో "ఏన్ ఇన్‌స్పెక్టర్ కాల్స్" అనే నాటకాన్ని వ్రాశాడు దానిని ఆధారంగా తీసుకొని కొప్పరపు సుబ్బారావుగారు తెలుగులో "ఇనపతెరలు" అనే నాటికను రచించారు దానిని మొన్న 14న (మద్రాసు) యూనియన్ థియేటర్ వారు తెలుగు లిటిల్ థియేటర్ వారితో కలిసి మైలాపూరు రసికరంజనీ హాలులో ప్రదర్శించారు. ఇందు కె వి ఎన్ శర్మ, కె మోహనదాస్, కె జగ్గయ్య (సినిమా నటుడు), మాచినేని, కె సరోజిని, వి సరోజిని, కె. పి సారథిగార్లు నటించారు.

నాటకం మొత్తం 110 నిమిషాలలో

ముగిసింది. ఎక్కడా ఒక పాటకానీ, ఒకపద్యంకానీ, నవ్వుపుట్టించే చేష్టకాని లేకపోయినా, నాటకం పొడుగునా ప్రేక్షకులు నాటకంలో లీనమైపోయారు. ఇంత తక్కువ టైములో ముగిసిపోయికూడా ప్రేక్షకుల మనస్సులో హత్తుకుపోగల తెలుగునాటిక యిదే కాని, మరొకటి లేదనిపిస్తున్నది.

ఎవరికి వారు తమ సౌఖ్యాన్ని తమ ఆనందాన్ని చూసుకొంటే, సంఘంలో అట్టడుగున కుమిలే అభాగ్యుల గతి ఏమౌతుందో యీ నాటకం సూటిగా చెప్పుతున్నది. మానవులలోని అంతఃకరణ అనేది ఒక బలీయమైన శక్తి అనీ, అది ఏనాటికైనా మనకు ఎదురై మనం చేసిన చెడు పనులనుగూర్చి గుచ్చి గుచ్చి అడిగితే మనం ఉక్కిరిబిక్కిరి కాక తప్పదనీ తెలియచెప్పటానికి రచయిత యిందులో ఒక పోలీసు యిన్స్పెక్టరుపాత్రను ప్రవేశపెట్టాడు. ఈ యిన్స్పెక్టరు ప్రజలలోని ఆత్మశక్తిచిహ్నంగా రచయిత సృష్టించాడు కనుక ఆపాత్ర రంగంమీదికి రావటం తెరలచాటునుంచీ కాక ప్రేక్షకసమూహంలోనుంచే జరగటం చాలా సమంజసంగానూ అర్థయుక్తంగాను వున్నది.

జమీందారీ కుటుంబంతో వియ్యమందబోతున్న మాజీజిల్లాబోర్డు ప్రెసిడెంటుగారింట్లో ప్రధానం జరుగుతున్న చక్కని సాయంకాలపువేళ యీ యిన్స్పెక్టరు ప్రవేశించి కరుణకుమారి అనే బీదయువతి, (సౌందర్యవతి) ఆత్మహత్యకు, వరుసగా జిల్లాబోర్డు ప్రెసిడెంటు, ఆయన కుమార్తె, కాబోయే అల్లుడు (జమీందారు) ఆయన కుమారుడు, ఆయన భార్య అందరూ కారకులయ్యారని ఆరోపిస్తాడు. ఆరోపించడమే కాదు వాళ్ళందరిచేతా ఒప్పిస్తాడు కూడా. తన ఫ్యాక్టరీలో పనిచేస్తూ ఎక్కువ జీతం రాబట్టటంకోసం పనివాళ్ళందరిచేతా సమ్మె చేయించిందని జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారు ఆ కరుణకుమారిని పనిలోనుంచి తీసేశాడు. ఆ తరువాత ఆ అమ్మాయి బట్టలదుకాణంలో పనిచేసి పొట్టపోసుకొంటూవుంటే 'ఫలాని బ్లౌజ్ మీకు బాగుండదని' చెప్పినందుకు జిల్లాబోర్డు ప్రెసిడెంట్‌గారి కూతురు ఆ బట్టల దుకాణం యజమానితో చెప్పి ఆ అమ్మాయిని పనిలోనుంచీ తీయించేస్తుంది. వేశ్యాగృహంలో (మరొక పేరుతో) పొరపాటున ప్రవేశించిన ఆఅమ్మాయినే జిల్లాబోర్డుప్రెసిడెంట్ గారి కాబోయే అల్లుడు (జమీందారు) తాను వుద్ధరించబోయి, తన వుంపుడుకత్తెగా వాడుకొంటాడు. ఆ తరువాత మరొక పేరుతో సినిమా ఎక్స్ట్రాగా పని చేయబోయిన యీ అమ్మాయితోనే జిల్లాబోర్డు ప్రెసిడెంట్ గారి అబ్బాయి రహస్య సంబంధం ఏర్పరుచుకొంటాడు. ఈ అమ్మాయి కోసమని అతడు తండ్రి తాలూకు ఫ్యాక్టరీలో దొంగరసీదులు పుట్టించి డబ్బు కొట్టేస్తాడు. తదనంతరం ఆఅమ్మాయి నిండు చూలాలుగా జిల్లాబోర్డు ప్రెసిడెంట్ గారి భార్య అధ్వర్యాన నడిచే ధర్మవైద్యశాలకు వచ్చి సహాయం అర్థిస్తే, తోటిఆడది అనైనా ఆలోచించకుండా, కేవలం తమ యింటి పేరే తన యింటి పేరని చెప్పినకారణంచేత ఎట్టి సహాయమూ ఆమెకు అందకుండా చూస్తుంది, ఆ యిల్లాలు. వరుసక్రమంగా యీ విషయాలన్నీ ఐదుగురిచేతా ఒప్పించి, వీరు, యిలాంటివారు సంఘానికి ఎన్ని రకాల అన్యాయాలు చేస్తున్నారో అంతా బట్టబయలు చేసి, ఆ అమ్మాయి యింతకుముందే ద్రావకం త్రాగి ఆస్పత్రిలో చనిపోయిందని చెప్పి వెళ్ళిపోతాడు.

ఇన్స్పెక్టరు వెళ్ళాక జమీందారుగారు ఆ పేరుగల యిన్స్పెక్టరు ఎవడూ లేడనీ, ఆ పేరుగల యువతి ఎవరూ ఆత్మహత్య చేసుకొని చనిపోనే లేదని టెలిఫోన్ ద్వారా నలుగుర్ని అడిగి తెలుసుకొంటాడు. జిల్లా ప్రెసిడెంట్ గారి కూతురు, కొడుకు తప్ప మిగిలినవారంతా తెరిపిన పడ్డట్లు భావించుకొంటారు.

(50-వ పేజీ చూడండి)



భారతీయ చలనచిత్ర పరిశ్రమ ప్రతినిధులుగా, హాలీవుడ్ వెడుతున్న రాయబారవర్గానికి, అమెరికా రాయబారి చెస్టర్ బౌల్స్ 11-9-52 న ఢిల్లీలో విందుచేశారు పై బొమ్మలో బీనారాయ్, నర్గీస్, సూర్యకుమారి, కె సుబ్రహ్మణ్యం, ప్రేమనాథ్ మున్నగువారిని చూడవచ్చును

ప్రశ్నలు - సమాధానాలు

వై. యస్. ప్రకాశరావు—కాకినాడ.

సాధారణంగా పిచ్చుక గెంతుతుంది గాని నడవలేదేం?

—గెంతడమే అనుకూలం కనక.

మొసలి గ్రుడ్లు పెడుతుందా లేక పిల్లల్ని కంటుందా?

—ఇసుక నేలలో గ్రుడ్లే పెడుతుంది.

గుడ్లగూబ రాత్రిళ్ళే కాని పగలు చూడలేకపోవుటకు కారణం?

—పగలు చూడలేదన్నమాట నిజము కాదు. పగలు వేటాడే గద్దలాగ పెద్దదీ కాదూ, వేగ అంత వేగమైనదీ కాదు. రాత్రి వేటయే గ్రుడ్లగూబకి అనుకూలము, భయంకరమైన కేక విని పారిపోయత్నించే చిన్నపిట్టల్ని పట్టితింటుంది.

* * *

కొండముది దత్తాత్రేయులు—అప్పికట్ల.

హిందీ-చిత్రదర్శకుడు వి. శాంతారాం, మ్యూజిక్ డైరెక్టరు సి. రామచంద్రగార్లు ఆంధ్రులేనని విన్నాను. ఇది నిజమంటారా?

—కొంతకాలానికి షేక్స్పియరుకూడా తెలుగువాడేనని వినగలరు.

* * *

శ్రీ త్రిపురాన శంకరనారాయణ—టెక్కలి.

మా గ్రామంలో సైకిలుకు బ్రేకులు లేకపోయినా, రాత్రిసమయంలో లైటు లేకపోయినా, పెద్ద ఉద్యోగస్థులను పోలీసువారు పట్టుకోరు. సామాన్యప్రజలు అటువంటి ప్రమాదాలుచేస్తే మెల్లిగా లంచం పుచ్చుకుని వదలివేస్తుంటారు. కారణమేమిటో తెలియజేస్తారా!

—ప్రస్తుతం ధర్మం నాలుగు పాదాలమీద నాలుగు చక్రాలమీద నడవకుండా రెండు చక్రాలమీదనే నడుస్తోంది. అదే కారణం.

* * *

వి. నారాయణరావు—గుంటూరు.

మా బంధువులలో ఒకామెకు పిచ్చి ఎక్కగా ఆమె పిచ్చిలో ఇంగ్లీషు మాట్లాడింది, అంతకుముందామె ఇంగ్లీషు నేర్చుకొనలేదు ఈ విషయ మెలా సంభవించింది?

—వివరాలు పూర్తిగా తెలియకుండా జవాబు లివ్వడము కష్టము అయితే, ఒక్క అవకాశము కనబడుతోంది ఒకామె వేదపండితుని కూతురు ఆడవారికి వేదము చెప్పరుకదా? ఆమె ఎప్పుడు విన్నదో గాని వల్లించడము మాత్రము చెయ్యలేదు. పెద్దదైన చాలనాళ్ళకు జ్వరతీవ్రతలో ఆమె వేదఋక్కులు పలకడము మొదలుపెట్టింది. అప్పుడు విన్నవి ఆమెకు తెలియకుండగనే మనస్సుకు పట్టినవి. అవసరము లేకా, వీలులేకా ఆమె వాటిని అణచిపెట్టినది. జ్వరతీవ్రతలోనూ, 'పిచ్చి'లోనూ నిషేధాలు సడలిపోయి తొక్కిపెట్టి ఉన్నవి పైకి వచ్చేశాయి. వేదఋక్కులులాగే "విన్న ఇంగ్లీషుమాటలు" కూడా రావచ్చును.

* * *

శ్రీ కాకర్ల శివసుబ్రహ్మణ్యం—పెదముత్తేవి.

ఆంధ్రరాష్ట్రమును గురించి వోటింగు జరిగినప్పుడు రంగాగారు తటస్థంగా ఎందుకు ఉన్నారు?

—వోటింగుహక్కు స్వాతంత్ర్యం భారతీయు లందరితోబాటు రంగాగారికికూడా ఉన్నది గనుక - "తటస్థంగా" ఉండడం అంటే ఒడ్డున కూర్చుండడం. ప్రవాహంలో కొట్టుకొనిపోవడం యిష్టంలేనివారు, ఈత చేతకానివారు తటస్థంగా ఉంటారు. ఇంతేసంగతులు. చిత్తగించవలెను.

* * *

జి. కృష్ణారావు—బరంపురం.

వివాహము చేసికొనకుండ బ్రహ్మచారిగా ఉండిపోదామనుకున్న వాళ్ళు గూడ సినీమామోజు ఎక్కువైపోవుటవల్ల సంసారసముద్రములో నిమగ్నులగుచున్నారు. దీనికి కారణం దయచేసి తెల్పుతారా?

—మీ ప్రశ్నలో మీరే కారణం చెప్పి మమ్మడుగుతారేం మహాశయా?

* * *

యన్. సుందరాచారి—పటమట.

'మంత్రములతో రోగనివారణ చేయవచ్చును' అనుదానిని ఆధునిక విజ్ఞానము ఒప్పుకొనునా?

—ఒప్పుకొనదు. ఇంద్రజాలములూ, మంత్రవైద్యాలూ కొత్త విజ్ఞానాన్ని కోరి అన్వేషించని జాతులన్నిటిలోనూ కనబడుతున్నాయి విజ్ఞానాన్ని అన్వేషించిన జాతులలో ఇవి క్రమక్రమముగా తగ్గిపోతున్నాయి మంత్రాలువేసి ఒకరి వ్యాధులు నివారణచేస్తామన్నవారు వారి వ్యాధుల నివారణకుమాత్రము అచికిత్స చేసుకోరు.


అయితే ఫలాని 'మహామంత్రవేత్తమాటేమిటి?' అని అడుగుతారేమో! మంత్రశక్తిని పరీక్షిద్దామని పూనుకున్నవారు ఇంకా బయల్దేరలేదు. మంత్రాలు, విజ్ఞానవిధులలోవి కావు. అజ్ఞాతవిధులలోనివి.

* * *

శ్రీ పి. వి. అప్పారావు—బరంపురం.

సుమతీశతకమును వ్రాసిన కవి ఎవరు? ఇప్పుడు దొరుకుతున్న ప్రతులలో కవి విషయమై పీఠికలుగాని, కవి వ్రాసుకున్న దగ్య పద్యములుగాని లేవు. ఈ భోగట్టా ఎక్కడ దొరుకుతుంది? మీకు తెలిసినంత వరకు నాలుగు ముక్కలు చెప్పండి.

—క్రీ॥ శ॥ 1260 సం॥ ప్రాంతంలో ఉండిన బద్దెప్రభువు సుమతీ శతకమును వ్రాసినట్లుగా సాహిత్య చరిత్రకారులు ఇంతవరకు జరిగిన పరిశోధనవల్ల నిర్ణయించారు. ఇంకా యీ విషయమై తెలిసికోవలెనంటే శ్రీ నిడదవోలు వెంకటరావుగారు, 9, ఆఫీసు వెంకటాచలమొదలి వీధి, ట్రిప్లికేన్, మద్రాసు అని వ్రాయవలెను.



గజాననా వారి "కోడరికం"లో గుర్రపు పందాల వ్యసనంలో పడిన రేలంగి, సూర్యకాంతం

ఇనప తెరలు

(48-వ పేజీ తరువాయి)

వచ్చినవాడు యిన్‌స్పెక్టరు కాకపోయినా, చచ్చిన ఎల్ల కరుణకుమారి కాకపోయినా, ఎవరో ఒక వ్యక్తిపట్ల తామందరూ ఘోర అన్యాయం చేశామని కొడుకు కూతురూ మాత్రం బాధపడుతారు ఇంతలో టెలిఫోన్ మ్రోగుతుంది కరుణకుమారి అనే అమ్మాయి అప్పుడే ఆత్మహత్య చేసుకొని చచ్చిపోయిందనీ ఆ చావుకు సంబంధించిన భోగట్టా సేకరించటానికి పోలీస్ యిన్‌స్పెకరు వీరి యింటికి యిప్పుడే వస్తున్నాడనీ ఆస్పత్రి అధికారులు చెప్పారు అందరి నెత్తినా పిడుగులు పడ్డట్లు అవుతుంది తెరపడిపోతుంది

నాటకం గొప్పది తెలుగులో చేసిన అనుసరణకూడా వుదాత్తంగా వుంది నటకులు అందరూ తమ తమ పాత్రలను చాలా చక్కగా పోషించా[illegible]దరిలోకి యిన్‌స్పెక్టరుగా చేసిన కె వి ఎన్ శర్మగారి నటన చాలా ప్రశంసనీయంగా వున్నది

ఈ నాటకానికి 'యినప తెరలు' అని పేరు పెట్టటంలో రచయిత వుద్దేశించిన భావం—ప్రతివారి మనస్సులోనూ యినుప తెరలు పరుచుకువుంటాయనీ, వాటిన్నిటినీ తొలగించి చూసుకొంటేనే కాని తమ చర్యలు ఎంతవరకు సమర్థనీయాలో గుర్తెరుగలేరని ఎవరికి వారుగా యీ తెరలు తొలగించుకోలేపోయినా, అలా తొలగించుకోవటానికి ప్రయత్నించకపోయినా ఎప్పటికో ఒకనాటికి సంఘశక్తియే ఆ యిన్‌స్పెక్టరులాగా అర్ధాంతరంగా జీవితరంగంలో ప్రవేశించి పుండు బద్దలు కొట్టి తీస్తుంది

సంఘానికి యిట్లాటి సందేశాలు యీయగలిగిన నాటకాలు ఎన్నైనా కావాలి

★

"నీలంపరి"

చంద్రకళాపిక్చర్స్‌వారి "నీలంపరి" అనే హిందీ చిత్రం ఇప్పుడు అశోక్, రాజకుమారి థియేటర్లలో ప్రదర్శించబడుతోంది డైరెక్టరు ధీరూభాయ్ దేశాయ్, సంగీతం షఫీద్ అన్వర్, గీతాబాలి, సజ్జన్, కులదీప్‌కౌర్, మొదలగువారు నటించారు

పదిపదిహేనేళ్లు ఆలస్యంగా తీయబడిన జానపదచిత్రం, అంటే ఏ 1935 లోనో 1940 లోనో తీసివుండవలసినకథ

కోరిన కోరికలన్నీ ఇచ్చే ఒక మణి ఉంటుంది ఆ మణిని ఒక రాణిదగ్గరనుండి ఒక మాంత్రికుడు తస్కరించి ఆమెను, గోరింక గాను, ఆమె భర్తను సర్పంగాను మార్చివేస్తాడు రాజా అనే యువకుడు ఆ మణికోసం బయల్దేరతాడు చివరకు మాంత్రికుణ్ణి చంపేసి మణి తీసుకుని తను ప్రేమించిన రాజకుమారిని పెళ్లిచేసు

కుంటాను. ఈ లోగా బోరెడు కత్తి యుద్ధాలు, ఆకాశగమనాలు, సాహస కృత్యాలు, జరుగుతాయి ప్రయోజనం లేని సన్నివేశాలు ఈ చిత్రంలో ఉన్నన్ని ఇంకే చిత్రంలోనూ మనం చూసివుండం అంటే అతిశయోక్తి కాదు ★

సినిమా వార్తలు

భాస్కర్ పిక్చర్సువారు వరూన్ స్టూడియోలో నిర్మిస్తున్న సాంఘిక చిత్రం "బ్రతుకుతెరువు" మూడవ వంతుకు పైగా తయారైంది నాగేశ్వరరావు, శ్రీరంజని నటిస్తున్న ఈచిత్రానికి డైరెక్టరు రామకృష్ణ సంగీతం ఘంటసాల; పాటలు, మాటలు సముద్రాల, నిర్మాతి క భాస్కరరావు

* * *

ప్రకాశ్ ప్రొడక్షన్సువారు స్వంత

★

ఎమ్ ఆర్ ఏ వారి
"లేడీ క్టర్'లో
కొత్తనటి జగదీశ్వరి





నవయుగవారి "జ్యోతి"లో
జి. వరలక్ష్మి

★

స్టూడియోలో తీస్తున్న "కన్నతల్లి" సగం వరకూ తయారైందని తెలుస్తున్నది జి వరలక్ష్మి, నాగేశ్వరరావు, నంబియార్, వసంత మున్నగువారు నటించే ఈ చిత్రానికి సంగీతం పెండ్యాల, దర్శకుడు ప్రకాశరావు

* * *

వాహినీవారి "పెద్ద మనుషులు" షూటింగ్ రేవతీ స్టూడియోలో జరుగుతున్నది ఈ చిత్రాన్ని వాహినీ, వరూన్ స్టూడియోలలో కూడా తీస్తారట గౌరీనాథశాస్త్రి, శ్రీరంజని, రామచంద్రకాశ్యప మున్నగువారు నటించే ఈ చిత్రాన్ని సాధ్యమైనంత త్వరలో, వీలైతే మూడు నెలల్లోనే పూర్తి చెయ్యాలని డైరెక్టరు కె. వి. రెడ్డిగారు అనుకుంటున్నారట ఈలోగా బి ఎన్ రెడ్డిగారు పాలగుమ్మి పద్మరాజుగారిని కథకులుగా తీసుకుని మరొకచిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు ఇదిగాక ఆయన మైసూరు గాయత్రీ ప్రొడక్షన్సువారి కొక చిత్రం డైరెక్టు చేయనున్నారట. ★

పరారి
(11–వ పేజీ తరువాయి)

వాళ్ళకి ఇలాటి అద్భుతాలు ఆశ్చే తటస్థ పడవ్.

డె: (నిశ్చేష్టుడౌతాడు) అదేమి టండోయ్? ఇప్పుడేం అద్భుతం చూశారు?

వృ: ఇదివరలో ఎప్పుడూ తప్పించు కున్న ఖైదీలతో మాట్లాడలేదులే - అహఁ జర్మనీనించి నే చెప్పేది.

డె: వొస్తానండి.

వృ: మంచిది కెప్టెన్ డెనాంట్! (డెనాంట్ అదిరిపడతాడు.) మనల్ని ఎవరూ చూళ్ళేదులే. క్షేమంగా వెళ్లిరా.

డె: (తెల్లబోయి మాస్తూ) మీరు నన్నెల్లా గుర్తుపట్టారో చెస్తారూ?

వృ: (ఎక్కెక్కి నవ్వుతాడు) ఏముంది? చేపల్ని మింగెయ్యాలన్నట్టు చేశారు మీరు. అదికాక, మీ కాళ్లు-ఏమనుకోబోకండి.

డె. (పంట్లాం కొద్దిగా పైకి లాక్కుని కాళ్ళవంక చూసుకుంటాడు) అవును. ఈ మేజోళ్ళు...

వృ: ఇంకోటి. నీమీద మీకే జాలె క్కువగా ఉందని స్పష్టంగా తెలుస్తోనే వుంది.

డె: జైల్లో అది అలవాటైపోయింది. ఇంకోరిపట్ల సానుభూతి చూపకూడ దక్కడ—దానివల్ల వాళ్లు పాడైపోతారుట. జైలుకి వెళ్లకముందు నాకోసం నేను చింత పడ్డం ఎన్నడూ ఎరగను. ఈపైన ఇంకో కళ్ళని చూసి జాలిపడ్డం నా చేతకాదేమో!

వృ: సహజమే! కాని బాగుందిలే కాల క్షేపం. నే నేం చెయ్యాల్లో ఇంక తెలుసు.

డె: (ఆత్రుతతో) అంటే?

వృ: కెప్టెన్ డెనాంట్, ఈమాటు— ఈమాటుకే సుమా. వెళ్లొస్తా.

డె: వీడి జాలిసుండె. ఇప్పటికి నాలో ఇంకా మానవత్వం నశించలేదు లెండి.

వృ: అదే అదే! అది చూసే నా మనస్సు మారింది. ఆ! పోనిస్తూ ఇదో తెప్పు. సరే. వొస్తా.

(తనలో తను నవ్వుకుంటూ వృద్ధుడు సాగిపోతాడు. డెనాంట్ ముఖంలో కృతజ్ఞతాభావం ప్రస్ఫుటమౌతుంది.)

[తెర]

ఆయిదో ఘట్టం

[గంట తరవాత. ఊరికి దూరాన ఒక చోట చెటునీడలో ఇద్దరు స్త్రీలు ఇద్దరు పురుషులూ కూర్చొని ఉంటారు. దగ్గర్లోనే కారొకటి ఉంటుంది. సెలవురోజున విహారార్థం వచ్చారు. తెచ్చిన ఫలహారాలు తీసి తింటున్నారు. వారిలో ఒకడు నావికుడు. ఏభై ఏళ్లుండవచ్చు. రెండో పురుషుడు వ్యాపారి; ఏభైఅయిదేళ్ళుంటాయి. అతని భార్య బొద్దుగా మందకొడిగా ఉంటుంది. రెండో ఆమె అతని చెల్లెలు. వివాహం కాలేదు. సన్నగా కోరచూపుల్తో చిత్రంగా ఉంటుంది. అందరూ ఆబగా తింటూవుంటారు.]

భార్య: కెప్టెన్! మీరు చెప్పినట్టే అయింది. చివరికి ఎండొచ్చింది. ఇప్పుడు బాగా లేదూ.

కెప్టెన్: ఈపాటి తెలియకపోతే ఓడ లెల్లా నడపగలనండి మరి?

భార్య: (భర్తవంక తిరిగి) 'కెప్టెన్ మాట తప్పకుండా నమ్మొచ్చు'నని చెప్ప లేదూ మీతో? నాకు తెలుసు. మీరాశ్చే ఐస్‌క్రీమ్ తినకండి మీకు పడదు.

వ్యాపారి: హుఁ మొదట ఈ పూరు



HVM. 166-50 TL.

వొచ్చినప్పుడు ఎంత ఐస్‌క్రీమ్ తినేవాణ్నానుకున్నావ్?

భార్య: అందుకే ఇలా వున్నారు; ఎప్పుడూ గుసగుసలాడుతూ.

వ్యాపారి: (చెల్లెలివంక తిరిగి): ఏం నేనెప్పుడూ గుసగుసలాడుతూ ఉంటానా? నువ్వు చెప్పాలి.

చెల్లెలు: అంతలేదులే. అప్పుడప్పుడే.

వ్యాపారి: (కెప్టెన్ వంక తిరిగి) మీరు చెప్పండి.

కెప్టెన్: భార్యనిచూస్తే అలా వుంటుందేమో, ఇతరులికిమాత్రం నిజంగా మీరు దేవతలా వుంటారు.

భార్య: (కెప్టెన్‌తో) పెళ్ళంటే ఎరగరు మీకేం తెలుస్తుంది లెండి!

కెప్టెన్: పుట్టడమే బ్రహ్మచారిగా పుట్టానండోయ్!

భార్య: ఊరికో పెళ్ళాంతోనా?

చెల్లెలు: ఛ! అవేం మాటలు!

కెప్టెన్: అదేం తప్పుకాదు లెండి.

భార్య: అదో ఫేషన్. పెళ్ళికానివాడితో అలా మాట్లాడకూడదండోయ్. అబ్బ! ఇదేమిటి? ఏదో పురుగులా వుందే.

భర్త: చంపు చంపు.

భార్య: చంపడమా? ఎందుకు?

భర్త: ఏం పురుగో తెలియనప్పుడు చంపవలసిందే.

భార్య: (పురుగుని దులిపి) పోనీండి పాపం.

కెప్టెన్: మీరెవరు?

[డెనాంట్ చేపలబుట్టా గేలం చేతబట్టుకుని వస్తాడు. నలుగురికేసీ చూసి పలకరిస్తాడు) బస్తీకి దారి చెప్తారూ?

భర్త: బస్తీకా? చుట్టు తిరిగొచ్చారేం? ఇక్కడికి పన్నెండుమైళ్లుంటుంది.

డె: నిజం? అరి దేవుడా!

భర్త: అదుగో ఆ కనపడే కొండ దిగి వెళ్ళండి. దిగ్గానే ఎడమవేపు రోడ్డెక్కండి.

డె: ఓహో! అడిగి తెలుసుకోవాలంటే అక్కడెవరేనా జనం ఉంటారా?

భర్త: ఉండరనుకుంటాను.

కెప్టెన్: చేపలు పట్టినట్టున్నారే.

డె: (బుట్ట తెరిచి) ఏవో చిన్నచిన్నవి లెండి, ఎనిమిది దొరికాయి.

భార్య: చక్కగా ఉన్నాయి. బలే రుచిగా ఉంటాయిలెండి.

డె: కావాలాండి?

భార్య: (లేనినిగ్రహం తెచ్చిపెట్టుకుని) అబ్బే! బాగుంటాయన్నానంతే.

కెప్టెన్: ఘరనాలేదు తీసుకోండి — దొరికినప్పుడే తీసుకోవడం మంచిది. బాగుంటాయి లెండి.

చెల్లెలు: (కెప్టెన్‌తో) ఎరిక లేకపోయినా ఇస్తున్నారు. చాల మర్యాదస్తులు.

భార్య: మీరిస్తోంటే వొద్దనడం ఎందుకు. (భర్తతో) ఏదీ ఆ పేపరిలా ఇవ్వండి. పొట్లం కడతాను.

డె: ఎంత మాట. ఇవిగోనండి. (అందిస్తాడు) చాలాదూరం వొచ్చినట్టున్నారు — కార్లో.

భర్త: ఆతట్టు ఊరినించి పది మైళ్లు.

డె: పరారైన ఖైదీ సంగతేమైనా తెలిసిందాండీ, అక్కడ?

భర్త: అదేమిటి? తెలియదే. ఇంకా పేపరు చూళ్లేదు.

భార్య: ఏమిటి? ఇంకోడు పారిపోయాడా? అరెరే.

డె: అవునండి. మంచు చూసుకుని పారేశాడండి. మొన్నటిరాత్రి.

చెల్లెలు: అబ్బ! అలాంటివాళ్ళని తల్చుకుంటే భయమేస్తుంది, రాత్రి నిద్రకూడా పట్టదు నాకు.

కెప్టెన్: అబ్బే! అంత ఉద్రేకం— అంత భయం పనికిరాదండి. వాడికీ వీలైనా దొరికింది కదా అనుకోవాలి కాని.

భార్య: (పేపరు చూస్తుంది) అరె! పార్కులో పోలీసుని చంపినవాడే! దురంతకుడు! రెండుసార్లు చిక్కికూడా తప్పించుకున్నాట్ట. ఇదుగో పేపర్లో వుంది.

(డెనాంట్ వాళ్ళని పరిశీలనగా చూస్తాడు. మరింత శ్రద్ధగా పక్కని పడివున్న రొట్టెముక్కలవంక చూస్తాడు. మెల్లిగా ఆ ముక్కలదగ్గిరికి చేరతాడు)

భర్త: వాణ్ని పట్టుకోడానికి అందరూ చూస్తూ వుంటారులే, ప్రాణాలకి తెగించాడన్నమాట, అసలా కేసుమా చెడ్డది. ఆ ఆడదాని మాటలు నేను నమ్మలేదు సుమా.

చెల్లెలు: అబ్బే! ఎలా నమ్మడం?

భర్త: నాడి మాట నమ్మలేం, అసలా పార్కులో ఎందుకు చేరినట్టు వాళ్ళా? దేశాన్ని ఉద్ధరించడానికా! లండన్ పార్కులు నిక్షేపంలా వుంటాయి.

చెల్లెలు: కాని చాలా మంది వాణ్ని చూసి జాలిపడ్డారు. ఎంత చిత్రం!

డె: నన్ను పిచ్చివాడనుకోండి మరేమైనా అనుకోండి. నాకు మాత్రం అతనంటే జాలేసేసింది.

భర్త: అలాగా? ఎందుకండి?

డె: అది అతని దురదృష్టం మాత్రమే; అతనికేం లేదు.

భర్త: అవునవును. అసలీ కేసుల్లో ఒట్టి రభస ఎక్కువండి, మొగుణ్ని చంపిన ఆడదాన్ని ఉరితియ్యాలంటే ముందు హిస్టీరియా అడ్డొస్తుంది. అదీ ఆడవాళ్ళ సంగతి.

కెప్టెన్: అసలీ కేసేమిటో?

భార్య: ఏముంది? ఇతనితో కూచున్న ఒకత్తిని ఒక పోలీసు పట్టుకున్నాడు. ఇతను పెద్దమనిషే ననుకోండి. అయితేం! పోలీసునికొట్టి తల చితక్కొట్టి చంపేశాడు.

కెప్టెన్: మరి వాణ్నెందుకు ఉరితియ్యలేదు?

డె: అది తనవుకింద తేల్చారు జూరీ, అంచువల్ల. అసలా పోలీసుని కొట్టేసరికి వాడు తూలి ఒక ఇనపరాటమీద పడ్డాడు. పడితే తల బద్దలైచచ్చాడు. వాణ్ణి దానిమీద వాడు పడమన్నాడు?

భర్త: మరి వాడు పోలీసుని కొట్టా

డుగా! ఎందు కొట్టాలి? కొట్టకపోతే వాడు పడకపోను, చావకపోను.

డె : బాగుంది మీరు చెప్పేది, అతన్ని ఆ పోలీసు పట్టుకోకపోతే కొట్టేవాడే కాదు.

భర్త: నేనైతే వాణ్ని ఉరితీయించే వాణ్ని.

భార్య: అంత నిర్దాక్షిణ్యం కూడదు లెండి.

భర్త : ఏం? ఎందుకు కూడదు? తన డ్యూటీ తను చేసుకుంటున్న పోలీసుని కొడతాడా మరి? అందులోనూ వాడు పరాయిపిల్లతో పార్కులో కూచున్నాడు. ఏదో మర్యాదస్తుడని వొదిలేశారు వాణ్ని. అంతేకాని...

డె : మర్యాదస్తుడా? అసలే చాదస్తం కాదండీ! మర్యాదస్తు లేవిటి? కాని వాళ్లెవరు? మర్యాదలోనే ఉందా అంతానూ? దయాదాక్షిణ్యాలకూడా మర్యాదస్తులే కావాలా?

(వ్యాపారి తెల్లబోయి చూస్తాడు. చూసి అతను మర్యాదస్తుడేలే అనుకుంటాడు.)

చెల్లెలు : ఆ ఆడదానికి శిక్ష వేశారా?

డె : ఎందుకండీ ఆమెకి శిక్ష?

చెల్లెలు : అలాటివాళ్ళని జైళ్ళలో పడేసివుంచాలంటాను - పచ్చని కుర్రాళ్లని వల్లో పడేసుకోకుండా. మాయ కుచ్చులు!

డె : అరి దేవుడా! అదీ తప్పే!

(అందరూ తెల్లబోయి అతనివంక చూస్తారు.)

భర్త : (గొంతు సవరించుకుని) హుం. నన్నే ఆడదీ వల్లో వేసుకోలేకపోయింది.

డె : అవున్లెండి. మీరు భాగ్యవంతులు! కారుకూడా వున్నట్టుంది, ఇలాటి గతుకుల్లో సరిగ్గా నడుస్తుందండీ కారూ?

వ్యాపారి : (పరధ్యానతో) సరిగ్గానే నడుస్తుంది లెండి.

డె : మరి కొండెల్లా ఎక్కుతుంది?

వ్యాపారి : అదేముంది? కొట్టినదారే. అయినా పరిగెత్తే ఖైదీని అందుకోడానికి పనికొస్తుందిలెండి నా కారు.

డె : అలాగా! (తళుక్కున ఒక ఆలోచన తట్టుతుంది) బలే! బాగుంది.

భార్య : ఇంక మనం కదలాలి. ఏదండి ఆ కెటిల్ ఇలా అందుకోండి. డాలీ, ఆ ముక్కలల్లా వొదిలెయ్యి. ఇంటిదగ్గిరింకా రొట్టె వుందిలే. చీకటి పడకముందే ఇంటికి చేరాలి. పరారైన ఖైదీ ఇక్కడ తిరుగుతున్నాడు కూడా. ఎందుకొచ్చింది మనకి, ఆ ముక్కలేవో వాణ్నే ఏరుకోనీ.

(చాటుగా ఎవరూ గమనించకుండా డెనాంట్ రొట్టెతుంపులు అందుకుని జేబులో వేసుకుంటాడు)

డె : వస్తానండి, చేపలు భద్రంగా తీసుకెళ్లండి. (వెళ్లిపోతాడు)

చెల్లెలు : (మెల్లిగా వొదిన గారితో) చూశావా? రొట్టెతుంపులు జేబులో వేసుకున్నాడు!

భార్య : నిజం? అరే! పెద్దమనిషిలా కనపడ్డాడే. మాట తీరు కనిపెట్టావూ?

(కారు ఇంజన్ చప్పుడు వినపడుతుంది)

వ్యాపారి : అరెరె! (గుభాలున లేచి నిలబడతాడు)

కారు, ఎక్కాడేమిటి?

కెప్టెన్ : (బిగ్గరగా) ఏ మయ్యోయ్! ఏంచేస్తున్నా వక్కడ?

వ్యాపారి : కారెక్కి కూచున్నాడు. అరె!

చెల్లెలు : ఆరి దుష్టుడా!

(కారు బయలుదేరిన శబ్దం 'సెలవు' అని వినపడుతుంది. మగవాళ్లిద్దరూ కారు వెంట పరిగెత్తుతారు.)

భార్య : అయ్యయ్యో! ఇదేంవిడ్డూరం.

చెల్లెలు : నువ్వే! వాడు చేపలివ్వడం నువ్వందుకోడం. వాడో దొంగ మొహమని చూళ్ళేకపోయావ్. (ఆలోచనతట్టగా) అరె వాడే కాబోలు!

భార్య : అబ్బ! నీ గొడవేమిటే డాలీ! అసలిప్పుడు ఇంటికెలా వెళ్ళడం? అదాలోచించు.

(ఆయాసపడుతూ మగవాళ్ళిద్దరూ తిరిగి వస్తారు)

వ్యాపారి : అమ్మమ్మ! ఎంత మోసగాడు!

కెప్టెన్ : ఆరి నా తెలివి తెల్లారా!

(కూలబడి వెర్రిగా నవ్వుతాడు)

చెల్లెలు : అబ్బ! ఇలాంటప్పుడు నవ్వెలా వొస్తుందో! ఇంతసేపూ వాడితో ఎలా మాట్లాడామో!

కెప్టెన్ : (చటుక్కున నవ్వు ఆపి) ఎవరు వాడే!

చెల్లెలు : తప్పించుకున్న ఖైదీ. వాలకం తెలియడం లేదూ?

భార్య . (భర్తతో) మీరే చేశారిదంతా. కేసుగొడవ తెచ్చి వాణ్ని నానా మాటలూ అన్నారు మీరు మీ చెల్లెలూ. అల్లా అనకపోతే కారెత్తుకు చక్కాపోడు. ఉరి తీయిస్తారుట! ఉరి! మీరలా అంటోంటే వాడి మొహం ఎర్రబడిపోయింది. నేను కనిపెడుతూనే వున్నాను.

భర్త : నువ్వు మాత్రం అనలా! సర్లే. ఎక్కడ కెడతాడో తెలుసుగా. ఆ ఊరే! దొరుకుతాళ్ళే.

కెప్టెన్ : అందరం గుడ్డివాళ్ళమైపోయాం!

వ్యాపారి : కొండదిగువ ఊరికె వెడతాడనుకుంటాను.

కెప్టెన్ : వెళ్ళడండీ.

వ్యాపారి : అలా కాదు. అక్కడికి వెళ్ళడని మన మనుకుంటామని వాడనుకుంటాడు. అనుకుని మోసం చెయ్యడానికి చూస్తాడు.

కెప్టెన్ : కాదులెండి. అలా మోసం చేస్తాడనుకుంటామని గ్రహించే అక్కడికి వెళ్తాడు.

భార్య : అబ్బబ్బ! ఇదో గోలా!

చెల్లెలు : ఎంత పొగరుమోతు కాకపోతే మనకి చేపలు కూడా ఇస్తాడు!

కెప్టెన్ : ఏం చేస్తాం? చేసిందానికి భరించక తప్పదు. లేవండి కాళ్ళకి పని చెప్పడామింక, దార్లో ఇంకో కారేదేనా తగిలేవరకూ.

భార్య : అమ్మో! ఎల్లా నడవడం! ఇప్పుడే కాళ్లు నొప్పులు పుడుతున్నాయి.

కెప్టెన్ : అబ్బెబ్బే! అలా వుంటే ఎలాగండీ! అన్నింటికీ డీలా అయిపోతే యెల్లా బతకడం?

వ్యాపారి, డీలా! నీ కారు కాకపోతే సరి.

కెప్టెన్ : పోన్లెండి. పోయింది విచారిస్తే వస్తుందా? ఆ! ఆపక్క కుంటదగ్గర నడపలేక కారు వొదిలిపోడూ! మూర్ఖాంగా నడవండింక.

వ్యాపారి : అవునవును. నడదాం. పదండి త్వరగా.

(అందరూ సామానుమోసుకుంటూ నడక ఆరంభిస్తారు.)

భార్య : (వెనక్కి తిరిగి) అరె! చేపలు మరిచిపోయాం.

చెల్లెలు : ఛీ! వాడిచ్చిన చేపలా!

భార్య: అదేమిటి డాలీ! ఎవరిస్తేం. ఆ చేప లెంత ఖరీదుంటాయో తెలుసా! (భర్తతో) పొట్లం తీసుకురండి.

(వ్యాపారి వెనక్కి వెళ్ళి పొట్లం తెస్తాడు వాసన చూసి 'బాగున్నాయి' అంటాడు. నలుగురూ నడక సాగిస్తారు.)

[తెర]

[ఇంకా వుంది]

శ్రీరాముడు:— నాన్నా, అడవులకు వెళ్తున్నాను.

దశరథుడు :— నన్ను బాసి పోవుటకు నీ కెట్లు మనస్కరించుచున్నది తనయా!

శ్రీరాముడు :— నేను పుట్టుటకు ముందే వాల్మీకి రామాయణము వ్రాసెను. అందులో నేను అడవులకు వెళ్ళవలయునని యున్నది. ముని వాక్కు అన్యథా యగునే. కనుక సెలవిమ్ము, పోయి వస్తాను.

కాలక్షేపం

(6-వ పేజీ తరువాయి)

అని విప్పి చెప్పలేక, అట్టివారు భజ గోవిందం అని సంభ్రమంగా అన్నారు.

మన చుట్టాలతో మనము కట్టకట్టుకొని ఉండవలెనని పెద్దలు చెప్పలేదు. కనుక మన చుట్టాలను మనము "గ్రక్కున విడువంగవలయును" అనే మాటకూడా చాలా తొందరపడి యీ పద్యంలో గ్రక్కున నోరుజారివిడిచిన మాటగా కన్పిస్తోంది.

ఒక దేవుణ్ని ఆరాధిస్తూఉండి మనం కోరిన కోరికలు నెరవేరలేదనే కారణంచేత ఆదేవుణ్ని విడిచిపెట్టి యింకో దేవుని ఆరాధన సాగించడంకూడా, సుమతీ (మంచి బుద్ధి గలవాడా!) సునీతి కాదు—తొందరపడి ఈ మతం బాగాలేదని ఇంకో మతంలోకి వెళ్లిన వాళ్లుకూడా ఉన్నారు.

అయినా, మన అల్పబుద్ధితో మనకు శ్రేయస్కరమైన దేదో భవిష్యత్తు ఊహించి మనం గ్రహించలేము. తెలిసీ తెలియక, అనేక తప్పుకోరికలు కోరుతాము. మన కోరికను నిజంగా యీశ్వరుడిస్తే అందువల్ల మన కోరివితో మన తలను మనమే గోకుకున్నట్లవుతుంది. మన కందరికీ ఉన్న కోరిక ఏమిటంటే, "కోరికలు కోరుతూ ఉండడం. ఆ కోరికలు అన్నీ ఫలిస్తూ ఉండడం." ఈ కోరికలు ఆ పని ఊడిపోతే యీకలుతీసిన కోడిలాగున అయిపోతాం. అలాగైతే ఎట్లా? అని మన భయం. కాని, అదే మోక్షం అన్నారు. దానికోసమే ఏ దేవుణ్ని అయినా ఆరాధించవలసిన దన్నారు. అటువంటి మోక్షంకోరి భగవధ్ధ్యానం చేసేవాడు, యితర వరాలు కోరడంగాని, ఆ వరాలు యివ్వలేదని ఆ విగ్రహంమీద తాను ఆగ్రహించడంగాని సంభవించదు.

ఏదో ఒక ఇష్టదైవం ఆరాధించడానికి ఉండాలి. ఏదో ఒక తెప్పను ఆశ్రయించి భవసాగరంలో ప్రయాణం సాగించాలి. ఆ నావ మునిగిపోయేటట్లుగా ఉన్నదనిగాని, ముంచివేసేటట్లు ఉన్నదనిగాని, అందో శనపడి మరొక తెప్పను ఆశ్రయించవలెననే ఉద్దేశంతో, మొదటి నావను గ్రక్కున విడిచి గుమికితే, ప్రక్కనున్న తెప్పమీద చక్కగా కాలునిల్పగలమా? "ముక్కోటి దైవం లేక, చూసే చుట్టం లేక" గెంటికిం జేసిన రేవడివలె చిత్తస్థైర్యం, ఆత్మస్థైర్యం అన్నీపోయి ఆత్మవిశ్వాసం కూడా లేని అగమ్యగోచరావస్థలో అజ్ఞానబంధంలో యీ జీవుడు అంతర్ధాన మవుతాడు. నట్టేటిలో నుర్రాలమీద పోతున్న స్వరం "నట్టేటిలో నీవు ర్రాలు బార్చకు" అని సంగీతములో పాకెన లోకోక్తి ఉంది. ఎంగ్రాము మధ్యంలో పదుగు త్రిని పుర్రాన్ని "గ్రక్కున విడువంగవలయును గదరా సుమతీ" అనేపద్యానికి, సమాధానంగా అలా చేయడం వట్టి "గాథరా సుమతీ" అని జవాబు చెప్పక తప్పదు. "గ్రక్కున విడువంగనాదియో —గాబర సుమతీ"

ఆలోచించగా ఆలోచించగా, యిదే క్కడి కందపద్యమో గాని యీ పద్యము నే "గ్రక్కున విడువంగవలయును గదరా సుమతీ" అని నిదానంగా ఆలోచించి తీర్మానం చేయవలసి వస్తోంది. అయినా, యీ పద్యాన్ని తొందరపడి "గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ!" అనే సలహా గ్రక్కున యివ్వడానికి కూడా వీలులేదని తోస్తోంది. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madras


పంచతంత్రం
మిత్రభేదం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
"ఇప్పుడు గరుత్మంతుడొకడె మనలను కాపాడగలడు. ఆయనె మన పక్షికులము కంతటికీ చక్రవర్తి. కనుక నతని ధ్యానింతము."
పక్షుల దీనారావాలు వైకుంఠ పురమ్ములోని గరుత్మంతుడాలకించి
వెంటనె భూలోకానికి బయలుదేరి వచ్చాడు అంతరిక్షమందు నిలచి సంగతేమ నడిగాడు.
"పాపా, పాపా! పక్షిరాజ మీరలు వైకుంఠంలో హాయిగ ఉంటుంటే, ఇక మాకిక్కడ దిక్కెవ్వరు? ఈ తీతువు గుడ్లన్నిటి జలధిరాజు హరించాడు"
"వెనుకటికా గొర్రెను వలె- మా తిండే, మా వునికే- మా మనికే చూసి మమ్ము- చులకన చేస్తున్నారు!"
"ఎవరా గొర్రె? ఏమా కథ?"
వెనుకటికొక అడవిలోన గొర్రె ఒకటి మంద తప్పి ఒంటరిగా తిరుగుతు తెగ మేసిమేసి బలిసింది
సింహమొకటి దాన్ని చూసె
"నాకు జూలు మెడపైనే; ఈ మృగాని కొడలంతా తెగ పెరిగి జూలున్నది! అమ్మో, ఇది ఏదో అతి బలాఢ్యమగు కొత్త మృగము"
అని భయపడి ఆ సింహం గొర్రె కంట పడకుండా తప్పించుకు తిరిగింది
ఒక రోజున గొర్రె పోటేల్ ఆకలెత్తి ఆకులలము లదేపనిగ మేస్తుండగ పొదల వెనుక నక్కి వున్న సింహం గమనించింది.
"ఇంతా భయపడితే ఇది గడ్డి మేయు పశువయ్యా! ఊరికె భయపడ్డానే!!"
అంటూ ఆ గొర్రె పోటేల్ పైకి దూకి డొక్క చీల్చి తృప్తిగ తిని వేసింది
"అట్లాగే అల్పులమగు మేమూనూ ఎప్పటికే ఆపద వస్తుందో నని భయపడుతూ గడుపుతుంటే ఈ కష్టం వచ్చింది."
29

Rgd No M 4479

సెప్టెంబరు 26 నుండి

విశాలాంధ్రలో.

